# "పంజరంలో పక్షులు"

రచన :

**పినిశెట్టి**

894.8272
RAM

ci

Dr. B. R. AMBEDKAR
OPEN UNIVERSITY
LIBRARY
HYDERABAD-500 033

# "పంజరంలో పక్షులు"

సాంఘిక రూపకం

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
N11351

రచయిత

పినిశెట్టి శ్రీరామమూర్తి

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
Acc. No
11351

శ్రీ మురళీకృష్ణ స్టోర్సు
బుక్ సెల్లర్సు అండ్ స్టేషనర్సు,
పవరుపేట — ఏలూరు.

ప్రథమ ముద్రణ

1963 నవంబరు

హక్కులు రచయితవి.

మూల్యము 225 న. పైసలు

2

894.8272
RAM

సంపాదకులు :

అల్లు మస్తాన్ రావు

ముద్రణ :

ముముక్షువు ముద్రణాలయ

పవరుపేట - ఏలూరు.

 AOUA103B101

| వచ్చేపాత్రలు : | : వివరాలు : | వయస్సు : |
|---|---|---|
| రంగనాథం | రిటైర్డ్ జడ్జి | 58 |
| రాము | జడ్జి సుపుత్రుడు | 22 |
| గోపి | రాము స్నేహితుడు | 24 |
| పాపయ్య | జడ్జి సన్నిహితుడు | 60 |
| సుబ్బయ్య | ఆయింటి నౌకరు | 60 |
| రాధ | జడ్జి మేనకోడలు | 20 |
| సీత | రాము ప్రియురాలు | 18 |

రంగం ఒకటే

రంగనాథంగారి భవంతి చావడి

విభాగాలు రెండు

## పగలూ - రాత్రి

: విశేషం :

ఒకేపగలూ రాత్రీ జరిగిన విచిత్రగాథ

ప్రదర్శనా కాలం

2 గంటల. 45 నిమిషాలు

ప్రముఖ చిత్రదర్శక, నటీనటుల సమక్షంలో మదరాసు వాణీమహల్లో ది 23-1-63వ తేదీన ప్రదర్శించిననాటి ఈ నాటకంలోని పాత్రధారులు.

| | | |
|---|---|---|
| రంగనాథం | ... | మల్లాది |
| గోపి | ... | రామకృష్ణ |
| రాము | ... | అంజిబాబు |
| పాపయ్య | ... | పిని శెట్టి |
| సుబ్బయ్య | ... | భూసారపు |
| రాధ | ... | మణిమాల |
| సీత | ... | సుజాత |

సంగీత దర్శకులు

పూర్ణచంద్రరావు

నేపథ్య గాయకులు

శ్రీ యమ్. యమ్. కె. అప్పారావు (బన్‌బాబు) సత్యారావు,
కుమారి రమణ, స్వర్ణకుమారి

నృత్యదర్శకులు

కె. యస్. రెడ్డి.

మొదటిప్రదర్శనమే అద్భుతంగా ఆకర్షించిన ఫలితంగా, ఇదేనటీనటులతో, ఇదేనాటకాన్ని మదరాసులో "రాజా అన్నామలై మందిరం" లో ది 10-3-63 తేదీన తిరిగి ప్రదర్శించడం జరిగింది.

"నటశేఖర్" యస్. వి. రంగారావుగారి నిర్వహణలో 1963 ఏప్రియల్ 6, 7, 9 తేదీలలో కాకినాడ, రాజమండ్రి పట్టణాల్లో ప్రదర్శించిననాటి నటీనటబృందం.

| | | |
|---|---|---|
| రంగనాథం | ... | యస్. వి. రంగారావు |
| గోపి | ... | రామకృష్ణ |
| రాము | ... | అంజిబాబు |
| పాపయ్య | ... | పిని శెట్టి |
| సుబ్బయ్య | ... | భూసారపు |
| రాధ | ... | శారద |
| సీత | ... | సుజాత |

సంగీత దర్శకులు

పూర్ణచంద్రరావు

నేపథ్యగాయకులు

యమ్. యస్. రామారావు

కుమారి రమణ

నృత్యదర్శకులు

కె. యస్. రెడ్డి

## గమనిక

ఈ నాటకాన్ని నా అనుమతి పత్రంలేకుండా యేవిధంగాను ప్రదర్శించకూడదు. వ్యతిరేకించి ప్రదర్శించినవారిపై చర్య తీసుకోబడుతుంది.

రచయిత.

7

# స మ ర్ప ణ

"నటశేఖర్" "నటసామ్రాట్"

శ్రీ యస్. వి. రంగారావుగారి

రసమయ, కళాహృదయానికి

పినిశెట్టి.

# "పంజరంలో పక్షులు"

# ప గ టి భా గ ం

రంగనాథంగారి భవంతిహాలు. తెర లేచేసరికి చాలా చీకటిగావుంది. దూరం నుంచి సుప్రభాతం వినిపిస్తుంది. మెల్లగా వెలుతురు ప్రసారితమైంది. హాలులో కుడివైపున మేడమీదకెళ్ళే మెట్లున్నాయి. ఎదురుగా హాలులో పంజరంలో రెండు చిలుకలు. అటూయిటూ కిటికీలున్నాయి. అన్నిటికీ తెరలుకూడా ఉన్నాయి. ఎడమవైపున గుమ్మంవుంది. అది రాము గది. కుడివైపున మరో చిన్న గుమ్మం, బహుశా అది ఆఫీసుగది కావచ్చు. ఆ చావడిలో శ్రీమంతులకు కావలసిన డ్రాయింగ్ రూము సామాన్లు అన్నీ వున్నాయి. ఒకప్రక్కగా ఆ యింటి నౌకరు సుబ్బయ్య గోంతుకాళ్ళమీద కూర్చొని కునికిపాట్లుపడుతూ వుంటాడు. కాఫీ ఏర్పాట్లుగల "టీ ట్రే"తో రాధ ఎదురుగానున్న గుమ్మంలోంచి వచ్చింది. ఆమె ముఖం దైన్యంగా వుంది. సుబ్బయ్యదగ్గరగా వచ్చింది. అతని అవస్థచూచి లేపడం యిష్టంలేక రాము గదిగుమ్మందగ్గర కెళ్ళి నిలచింది. లోనికి వెళ్ళడంకూడా ఆమెకు మనస్కరించదు తిన్నగా సుబ్బయ్య దగ్గరకువచ్చి సూటిగా చూసింది.

రాధ : సుబ్బయ్యా! ......... సుబ్బయ్యా!

సుబ్బ : (కదలి వళ్ళు విరుచుకున్నాడు.)

రాధ : తెల్లారింది! ఇంకా మెళుకువ రాలేదా?

సుబ్బ : మీరా రాధమ్మగారు! (కంగారుగా లేస్తాడు).

రాధ : రాత్రి నీకూ్కడా నిద్రలేదా?

సుబ్బ : అంటే మీకుకూడా నిద్రపోలేదమ్మా?

రాధ : (తీక్షణంగా చూసింది).

(రంగనాథం రాత్రి దుస్తులలో వచ్చి గంభీరంగా మేడ మెట్లమీద జేబుల్లో చేతులు పెట్టి నిలచాడు).

సుబ్బ : అబ్బే! ఊరికే అడిగేనులెండి ... పెద్దయ్యగారేమో రెండు పక్షుల్ని పంజరములో పెట్టి ఇక్కడ తగిలించారాయె! తెల్లార్లు అవి రక్కుకోడం కీచులాడుకోవడం తప్ప బుద్ధిగా ఉండవుకదా! ఎట్టా నిదురపడుతుంది చెప్పండమ్మ!......

రాధ : వాటి బాధ మీ పెద్దయ్యగారికి తెలుసుంటే అలా పంజరంలో పెట్టి వాటిని బంధించరులే. ఈ కాఫీ తీసుకొని వెళ్ళి మీ చిన్నయ్యగార్కి ఇవ్వు. (సుబ్బయ్య కాఫీ ట్రే తీసుకుని ప్రక్కగదిలోనికి వెళ్ళాడు). (మెట్లమీదఉన్న రంగనాథం జోళ్ళధ్వనితో దిగాడు. రాధ వెళ్ళబోతుంది.)

రంగ : రాధా!

రాధ : (ఆగింది. వెనక్కితిరిగి చూచింది. కాస్త భయపడింది.) ఏం మావయ్యా?

రంగ : ఆ పక్షులను ఎప్పుడు తెచ్చి ఆ పంజరములో పెట్టానో నీకు తెలుసమ్మా?

రాధ : తెలీదండీ.

రంగ : నీకు తెలీదు. తెలుసుంటే ఆ మాటనవని నాకు తెలుసు. ఇప్పటికే నీ పెళ్ళయి మూడుమాసాలయింది. నీవు కాపురానికివచ్చి బహుశా రెండుమాసాలుకావచ్చు.

రాధ : అవన్నీ యిప్పుడెందుకుమావయ్యా?

రంగ: నీ గురించికాదు. నా చేతులారా ఆ పంజరములో బంధించిన పక్షులగురించి....

రాధ: (లోనికి వెళ్ళబోతుంది.)

రంగ: ఆగు రాధా! విమర్శ అవసరమే. వివేకముతో వివరం తెలుసుకొని విమర్శించడం చాలామంచిది. (మెల్లగా పచార్లు చేస్తూ) అబ్బాయిపెళ్ళికి... అంటే మీ ఇద్దరి పెళ్ళికి రెండు రోజులుముందు గాలివానపట్టింది. ఆ మరునాడు పొలాలుచూట్టానికి వెళ్ళాను. ఈ రెక్కలు రాని పక్షులు గూటినుండిజారి క్రిందపడ్డాయి. చావడా నికి సిద్ధంగావున్న ఆసమయంలో వీటినిచేరదీశాను. వాటి ఆత్మరక్షణకోసమే పంజరంలో పెట్టాను. ఆ కారణంగా అవి నాప్రాణంలో ప్రాణంగా కలిసిపోయాయి. పెంచిన మమకారం తెంచుకోవడం అంత సులభంకాదు రాధా! అందుకే వాటినివిడిచిపెట్టాలని ఎవరన్నాఅంటే సహించ లేను; సహించనుకూడా......

రాధ: వివరం తెలుసుకోకుండా ఏదో అన్నందుకు......

రంగ: క్షమించమంటావు! క్షమించడం పెద్దకష్టంకాకపోవచ్చు కాని క్షమించలేను. నిన్నేకాదు. ఆ రామునికూడా... రాధా! పెళ్లై యిన్నిరోజులైనా మీ భార్యాభర్త లిద్దరూ ఎడముఖం పెడముఖంతో వేరువేరుగదుల్లో ఉండటానికి హేతువు? ఒక్కనాడుకూడా మీ రిద్దరూ మనసిచ్చి మాట్లాడుకోపోడానికి కారణం? సమాధానం

చెప్పు రాధా ? మామగానే కాదు మేనమామగా కూడా అడుగుతున్నా ?

రాధ : (బాధగా) మావయ్యా !

రంగ : మావయ్య ఎందుకమ్మా మావయ్య ? ఆ పక్షులను పంజరంలో బంధించినట్లు మిమ్మల్నిద్దర్నీ భార్యా భర్తలు కమ్మని నిర్బంధించానా ? జ్ఞానం లేని నోరు లేని ఆపక్షులు మాట్లాడ లేకపోవచ్చు. చదువు సంస్కారము ఉండి కూడా మీ రిద్దరు ఎందుకు మూగనోము నోచారో తెలుసుకోవచ్చా ? పరవా లేదు చెప్పు రాధా !

రాధ : (ఏదో చెప్పబోయి చెప్పలేక లోనికి వెళ్ళిపోయింది) (రంగనాథం బరువుగా నిట్టూర్చి వెనక్కి తిరిగి చూడగా సుబ్బయ్య ఉన్నాడు. అతను భయముగా వెళ్ళబోతాడు).

రంగ : సుబ్బయ్య !

సుబ్బ : బాబు !

రంగ : రాము లేచాడా ?

సుబ్బ : లేచారండీ ! కాఫీ త్రాగి మళ్ళీ పడుకున్నారు.

రంగ : వాడికి రాత్రి నిద్ర లేదనుకుంటాను.

సుబ్బ : తమకు కూడా నిద్రలేదా బాబు ?

రంగ : అయితే నువ్వుకూడా నిద్రపోలేదన్న మాట ...

సుబ్బ : మనకే కాదండి బాబు రాధమ్మగారికి కూడా నిద్ర లేదు.

రంగ : అని నీతో చెప్పిందా !

సుబ్బ: అబ్బే లేదండి బాబు! అబ్బాయిగారికి కాఫీ ఇస్తూ "నీకుకూడ నిద్రలేదా సుబ్బయ్యా" అని అడిగారండీ. ఆ 'కూడా' అనే మాటతో ఆరికూ్కడా నిద్రలేదని అర్థం చేసుకున్నానండి.

రంగ: (నవ్వి) సుబ్బయ్యా! మన ఇంటిలో అబ్బాయి పెళ్ళి అయిన దగ్గరనుంచి అందరికి నిద్రలేకపోవడము చూస్తే నీకు ఆశ్చర్యముగాలేదు?

సుబ్బ: లేదుబాబు.

రంగ: నువ్వుకూడా అర్థం చేసుకున్నావన్నమాట.

సుబ్బ: ఎందుకులెండి బాబు... కడుపుతరుక్కుంటే కాళ్లమీద పడుద్ది. మనం కళ్లు మూసుకుంటే కొంతకాలానికి ఆలుమగల్ని కాలమే కలిపేస్తుందిలెండి.

రంగ: ఔను కలుపుతుంది. (నిట్టూర్చి) వాళ్ళు కలపకపోయినా కాలముతీరిన తరువాత నన్ను మట్టిలో కలుపుతుంది కాలం.

సుబ్బ: (భయం, బాధ) బాబుగారు!

రంగ: ఒక్కగాని ఒక్కబిడ్డ.........రత్నములాంటి నా మేన కోడలిని నా చెల్లెలుకోరికతో పెళ్ళిచేశాను. వాళ్ళిద్దరు కిలకిలా నవ్వుకుంటూ కలకాలం కాపురంచేస్తుంటే కళ్ళతో చూస్తూ మురవాలనుకున్నాను. మనవల్నిఎత్తి ముద్దాడాలనుకున్నాను. ఆ కోరిక తీరనిదయింది. ఇది నేను చేసినపాపమో లేక వాళ్ళశాపమో అర్థము కావటములేదు. నువ్వయినా చెప్పగలవా సుబ్బయ్యా!

సుబ్బ : అన్నీ తెలిసున్నవోరు, జడ్జిగా ఎన్నో తీర్పులిచ్చినోరు తమకు నేనేమిచెప్పగలను బాబయ్యా! తమకు కాఫీ తీసుకువస్తాను (లోపలికి వెళ్లాడు.) (రంగనాథం ఆలోచనగా కుర్చీలో కూలబడి తలవంచుకొని బరువుగా నిట్టూర్చాడు. రాము నైట్‌దుస్తులతో చురుగ్గా వచ్చాడు. లోనికి చూశాడు.)

రాము: సుబ్బయ్యా!... సుబ్బయ్యా!

రంగ : (మెల్లగా) ఏమి రాము ?

రాము: (కంగారు తిన్నాడు) ఓః! మీరా! (వెళ్ళబోయాడు)

రంగ : ఎందుకోవచ్చావు! సుబ్బయ్యా అని అరిచావు! పని గాకుండానే తిరిగి వెళ్ళిపోతావేం ?

రాము: మీరేదో ఆలోచనలో ఉన్నారు. చూడలేదు.

రంగ : నా ఆలోచన కంతరాయము కలిగించడమెందుకా అని తిరిగి వెళ్ళిపోతున్నావు ? నా ఆలోచన ఎందుగురించో నన్న ఆలోచనగూడా లేనప్పుడు అంతరాయము కలిగిస్తున్నాననే ఆలోచన ఎక్కడనుండి వచ్చిందిరా ?... చదువుకున్నావు, సంస్కారముకూడా నీలో ఉందనుకున్నా... కాని... ఆ సంస్కారము నీలో పూర్తిగా సంస్కారము చేయబడ్డదని ఇప్పుడిప్పుడే తెలుసుకుంటున్నా.

రాము: నన్ను మీరు అవమానిస్తున్నారు.

రంగ : తప్పు, మాటయొక్క అర్థము తెలియక అలా మాట్లా

డేవు. ఏ తండ్రి బిడ్డను అవమానించాలని కోరడు. అంధుడవుతున్నాడేమోనని అనుమానిస్తాడు. ప్రక్క దారిపట్టి భ్రష్టుడవుతాడేమోనని బాధపడతాడు. అంతే... అంతే (కాసేపాగి బాధగా) బాబు! తెలియ కడుగుతాను తండ్రిని గౌరవించడమంటే ఎదురు తిరిగి సమాధానము లేకపోవడమేనా? వినయ విధేయతలు వెల్లడిచేయడమంటే కుళ్లు మనసులు పెట్టుకొని తండ్రి కంతాన్ని ......

రాము: (భయముగా) నాన్నా!

రంగ: ఏం... కష్టం కలిగిందా?... సరే నీకు రాధతో పెళ్ళి ఇష్టములేనప్పుడు ముందు నాతో ఎందుకు చెప్పలేక పోయావు?

రాము: ఇప్పుడేం చెప్పలేనండీ.

రంగ: చెప్పితీరాలనే అడుగుతున్నా.

(సుబ్బయ్య కాఫీ ట్రేతో, టవల్‌తో, వస్తాడు)

రాము: (సుబ్బయ్యతో) ఏమిటింత ఆలస్యం? (తండ్రితో భయంగా) మీ మాట కాదనలేక ... (సుబ్బయ్య దగ్గర టవల్ విసురుగా లాక్కు వెళ్ళాడు.)

రంగ: రోషం ఉందిగాని పౌరుషంలేదు. మాటకాదనలేకట, మాట కాదనలేక.

సుబ్బ: కాఫీ బాబూ......

రంగ : ఆఁ ! తర్వాత తీసుకుంటాలే. నువ్వెళ్ళి పాపయ్యను ఒకసారి తీసుకురా.

సుబ్బ : ఇప్పుడాయనెందుకులెండి బాబయ్యా ?

రంగ : ఏం ?... ఆ చస్సంటూ ఆడితే ఈగొడవ కాస్సేపన్నా మర్చిపోవచ్చు. ఊఁ వెళ్ళు...

సుబ్బ : ఒక్కఆట అయితే పర్వాలేదుబాబు. ఆయనమాటలు వినలేంగదా ! పైగా కోపంలో ఇలాంటిగొడవలుండగా అలాంటిమనిషి వస్తే మనబ్రతుకులన్నీ బజారులో ఉంటాయిబాబు !

రంగ : సుబ్బయ్యా ! నువ్వన్నమాట నిజమేకాని... చిన్ననాడు మేమిద్దరం కలసి చదువుకున్నాం. ఎంతచెడ్డా దూరపు బంధువుకూడా. అందుకే నా ఇల్లంటే తన స్వంతఇల్లుగా భావిస్తాడు. అందరితో సమానంగా మనల్నికూడా జమ కడతాడంటావా ?

సుబ్బ : ఆయన తిన్నఇంటివాసాలు లెక్కపెట్టేబాపతుబాబు.
(తెరలోనుంచి ఓ రంగనాథం... ఓ...రంగనాథం)

సుబ్బ : అదుగోబాబు మాటలోనేవచ్చారు.

పాపయ్య: (వచ్చాడు. విచిత్రంగావున్నాడు) విన్నావటోయ్ తాజావార్త ! ఏది ?

సుబ్బ : ఇంక రేడియో కట్టేసివస్తానుబాబూ !

పాప : (సుబ్బయ్య ట్రేలోని కాఫీతీసుకుని) అయ్యో రామా !

నేనిలా వచ్చానో లేదో అప్పుడే రేడియోను కట్టేస్తా నంటాడేమిటీ సుబ్బయ్య...ఏది ?

సుబ్బు : ఇక అనవసరంలెండి పాపయ్యగారు !

పాప : నాకు తెలుసుగా కరంటుఅయిపోతుందని...ఈయింటిలో ఖర్చు ఏమాత్రం ఎక్కువయినాసరే మా రంగనాధాని కన్న నువ్వేఎక్కువ బాధపడతావు సుబ్బయ్యా! శుద్ధ విశ్వాసపాత్రుడివి...ఏది ? ఒకఅరగంటపోయాక మరో అరకప్పుకాఫీ నాకు...ఏది ?

సుబ్బు : కాఫీ... (కోపంగా వెళ్ళాడు)

పాప : ఆఁ ! వీడెక్కడ దాపురించాడయ్యా నీకు... బావురు పిల్లి మొఖం వీడూను.

రంగ : కొంతమంది అలాగేదాపురిస్తారుపాపయ్యా !

పాప : ఏది ?...నువ్వు చాలా ద్వంద్వంగా మాట్లాడతావే రంగనాధం. ఆఁ ఏది ? ఇప్పుడు చెప్పబోయిన విషయ మేమిటంటే ఆఁ...అదే భగవాన్లుగారబ్బాయి వెంకటేశం లేడూ ... సినిమా తీద్దామని వెళ్ళి ఒకమ్మాయిని 'లవ్వుమారేజీ' చేసుకు చక్కా వచ్చాడట.

రంగ : అదృష్టవంతుడు.

పాప : ఏదీ ! అదీ ఒకఅదృష్టమే...నిజమేలే...అందరికీ దొర కొద్దు ఆఛాన్సు. ఏదీ ? అసలువిషయ మేమిటంటే ఒక లక్షరూపాయలు ఇంటినుండి కొట్టికెళ్ళాట్ట సినిమా

తీయడానికి సైలెంటుగా. ఆ బిజినెస్ మాని ఈ బిజినెస్ భేషుగ్గా వుందని చేసుకు చక్కావచ్చాట్ట ఏదీ ? అసలు వాళ్ళ ఫామిలీ అంత రంగనాథం. భగవాన్లు సిష్టరు లేదూ గజలక్ష్మి! (అని నోరుమూసుకొని నవ్వాడు).

(రాధ వచ్చింది)

రంగ : సరే ఒక ఎత్తు వేద్దామా? (మెట్లదగ్గర కెళ్ళాడు).

పాప : అయ్యోరామా! అందుకే గదటయ్యా వచ్చింది. మాట పూర్తిగాకముందే ఏది ? (రాధను చూశాడు) ఓ రాధమ్మా? బావున్నావు కదమ్మా ?

రాధ : ఏమవుతామండి ఒక్కరోజులో...

పాప : ఓఁ...ఏది ? నిన్న చూచాసుకదూ అందుకా ! ఏది ? ఈరోజుల్లో ఒక్కరోజేమిటమ్మా ఒక్కగంటలో చేంజ్ అవుతున్నారుగా మనుషులు... తాయారమ్మగారి చిన్నకోడలు సంగతి...

రంగ : (మెట్లమీదనుంచే కోపంగా) పాపయ్యా !

పాప : అయ్యో రామా ! వెళ్ళకపోతే కోప్పడతాడు. తర్వాత చెబుతాగా ఏది ?

సుబ్బ : (వచ్చాడు) దారి అది...

పాప : ఏది ? (చూశాడు) వీడొచ్చాడు. చాలా మంచివాడు పాపం. సుబ్బయ్యా! కాఫీసంగతి మర్చిపోకు సుబ్బయ్యా ! ఏది ? దారి యిదేగా (మెట్లమీదకు వెళ్ళిపోయాడు).

సుబ్బ: మనిషికి తగ్గ పేరు. పాపాత్ముడు.

రాధ: ఎందుకు సుబ్బయ్యా అతనంటే కోపం ?

సుబ్బ: తన బతుకు మర్చి అందర్నీ అలా ఆడిపోసుకోవటం మంచిదంటారా మీరు ?

రాధ: జరిగినవి చెప్పడములో తప్పేముంది ?

సుబ్బ: ఆయనకు జరిగింది మీకు ఎప్పుడైనా చెప్పారామ్మా.

రాధ: ఏమిటది ?

సుబ్బ: ఆయన పెళ్ళాం ఎప్పుడో ఒకనితో లేచిపోయి ఈ వూళ్ళోనే మకాం పెట్టింది.

రాధ: ఆఁ !

సుబ్బ: మనిషికుండేరోగం అదే కదమ్మా. తనతప్పులు మరచి మెదటాళ్ళలో లేనితప్పులు ఎదుకుతారు.

రాధ: పాపం ! అసలు పాపయ్యగారి కెందు కిలా జరిగింది ?

సుబ్బ: ఒకళ్ళమీద ఒకళ్ళకు యిష్టంలేకుండా కాపురాలు చేస్తుంటే, ఇలా జరగడంలో ఇడ్డూరమేముందిలే అమ్మగారు.

రాధ: (దెబ్బతింది) సుబ్బయ్యా !

సుబ్బ: ఏమైందమ్మా. (అర్థమైంది) ఆఁ మన్నించడమ్మా. నేను ఆయన్నే అన్నాను. (భయంగా కప్పులు తీసుకొని లోనికి వెళ్ళాడు. రాధకు సుబ్బయ్య మాటలతో కన్నీళ్లు పొడచూపాయి)

(ఆవేదనా పూరితమైన రాగం (Humming) మీద ఆందోళనగా రాధ మాటలు) గోపి! నిన్నుచూడాలని ఉంది. అదేగనక జరిగితే లోకులు కాకులై కలకాలం ఇలాగే కూస్తారేమో!

"పాట"

విరిసీ విరియని వెన్నెలలో- పూగితిమీ మోహాల పూయాలా
తీరీతీరని ఆశలతో- ఆగితిమీ తీయని బాధలా!

గడచిన స్మృతులే నామది కలచీ
వాడిన పూవులా వలవలవగచే
ఆ వెన్నెల తీరాల నీవూ
మరచిన మరుపేరావూ! ||విరిసీ||

రగిలెను గాథా మిగిలెనుబాధా
తీరనిఆశ తీయనిబాస

కలచే నామదిలో
మిగిలే నా హృదిలో ||విరిసీ||

(రాము నైట్ డ్రస్ మార్చి మామూలు దుస్తుల్లో వచ్చాడు. ఆమె దుఃఖంలో కుర్చీలోకూలబడింది. పాటఅయింది. రాము బాధగా చూశాడు.)

రాము: రాధా! ఒకపనిచేస్తావ్?

రాధ: (కన్నీళ్ళుతుడుచుకుంది. లేచింది. మాట్లాడదు.)

రాము: సమాధానము చెప్పడానికి కూడా బాధగావుందా?

రాధ : ప్రశ్న ఉన్నప్పుడే సమాధానము వస్తుంది. అడిగింది ప్రశ్న కాదు. (కొంత ఠీవిగానడచి) ఏమిటో అది చెప్పొచ్చు.

రాము: ఆజ్ఞాపిస్తున్నావా ?

రాధ : అర్థించవలసిన అవసరము నాకు లేదు.

రాము: అయితే ఆచరిస్తావనే నమ్మకమేమిటి ?

రాధ : నమ్మకంలేని దానిగురించి ప్రయత్నించడం ఎందుకు ?

రాము: మతిపోయి.

రాధ : (టక్కున వెనక్కితిరిగింది) ఎవరికి ?

రాము: నీక్కాదు. నాకు.

రాధ : ఊళ్ళోనే స్పెషలిస్టు ఉన్నాడు. ఒక్కసారి చూసి రావడం మంచిది.

రాము: (బిగ్గరగా) రాధా !

రాధ : ఏం ?

రాము: నువ్వు నా ఒక్క జీవితాన్నే కాదు మాకుటుంబాన్నే...

రాధ : సర్వనాశనం చేశానా ?

రాము: అవును.

రాధ : ఏమిటో ఆ నేరం ?

రాము: తెలీనట్టు అడుగుతుంది. నువ్వు నన్ను పెళ్ళాడ్డమే.

రాధ : ఓఁ! నిజంగా తెలీకే అడుగుతున్నా. నన్ను నువ్వు పెళ్ళాడావా ? నిన్ను నేను పెళ్ళాడానా బావా ?

రాము: బావ!...ఎవర్ని ఎవరు పెండ్లాడినా నీ కిష్టం లేనప్పుడు అత్తయ్యతో ఎందుకు చెప్పకూడదు?

రాధ : మీ నాన్నగారితో నీవు చెప్పావా?

రాము: మాటకు మాటనడం మంచిదికాదు. అడిగిన దానికి సమాధానం చెప్పు.

రాధ : ఎందువల్లనో ... ఓహో! మగమహారాజులుకదూ! అందులోను ఒక ఆడదానికి పుస్తికట్టి మగడనే గొప్ప తనాన్ని సంపాదించిన మనుష్యులుకదూ! అడిగినదానికే సమాధానం చెప్పాలి. బావా! నువ్వు మగవాడివికదా.

రాము: పటప్!

రాధ : మెల్లగా (ముందుకు చూసి) మావయ్య!

రాము: వస్తున్నారా!...(చూడకుండా వెళ్ళబోతాడు.)

రాధ : హుం! ధైర్యవంతుడు.

రాము: మరి నాన్నవస్తున్నారని చెప్పావ్.

రాధ : వస్తున్నారని చెప్పలేదు. మరీ బిగ్గరగా అరవడం మంచిది కాదు. మీ నాన్నగారున్నారు. "పటప్" అనే పదము నిన్నే ఆచరణలో పెట్టమని సలహా యిచ్చానంతే.

రాము: ఏమిటీ! నన్ను నోరుమూయమని సలహాయిస్తున్నావా?

రాధ : తెరచినా పరవాలేదు. బిగ్గరగా మాట్లాడవద్దని సూచించేనంతే. అయితే బావా నా సంశయం, మనసు లేని మనువుకి మగవాడవైనువ్వే మగువలా మాట్లాడక పోతే ఆడదాన్నయిన నేను మగవాడిలా మా వాళ్లతో

పెళ్ళి నాకిష్టంలేదని ఎలాచెప్పగలనుచెప్పు ?... అట్నే నావల్ల మీ సంసారమేదో చప్పగా చల్లారిపోతుందని సెలవిచ్చావులే. నాసర్వస్వం నాశనంకావడానికి కారణం ఎవరో తెలుసా ?

రాము: తెలుసుంటే నువ్వేచెప్పు.

రాధ : నువ్వు.

రాము: రాధా !

రాధ : లేదా, యుగయుగాలుగా ఆడవాళ్ళను నేలరాసి నలిపి నాశనం చేస్తున్న మీ మగవారు.

రాము: (కోపంగా నవ్వి) నేలరాయక నెత్తినపెట్టుకుంటారా ? ఛీ! ఛీ! తెలియక ఆడవాళ్ళలో కొందరు యోగ్యులున్నారని నమ్మేను ఒకనాడు.

రాధ : ఆ నమ్మకం యిప్పుడు వమ్మయిపోయింది. కారణం ?

రాము: ఏముంది, కోరిన ఆడది గుండెకోతకోసి దూరమైంది.

రాధ : కోరని నారి ఇల్లాలై ఆ గుండెలమీద కుంపటైంది !

రాము: అవును. ఇలాంటి వాళ్ళను యోగ్యులనుకోవటం బుద్ధి పొరపాటు.

రాధ : నిజం ! నిజం ! నేను మగవాళ్ళ విషయంలో అలా అనుకుంటాగాని...ఇంతకూ పెళ్ళికాని క్రితం ఒకామెను ప్రేమించావన్నమాట. ఆమె పేరేమిటి బావా !

రాము: అది నా ఆంతరంగిక విషయం.

రాధ : ఊఁ! (నిట్టూర్చి) అయితే నాలాగే జరిగిందన్నమాట.

రాము: (కోపంతో) ఏమిటీ! నువ్వుకూడా ఒకడ్ని పెళ్ళికాని క్రితం ప్రేమించావా? వాడిపేరు?

రాధ : మర్యాదిచ్చి మర్యాద తీసుకోవడం మంచిదిబావా!

రాము: (ఆక్షేపణగా) ఎక్స్యూస్ మి. మీ ప్రియులైన ఆ మహాశయు లెవరో తెలుసుకోవచ్చా?

రాధ : అది నా అంతరంగిక విషయం. (రామునే అనుకరించింది.)

రాము: రాధా! నీలాంటి ఆడదానిని నిలువునా కోసినా పాపం లేదు. ఒకర్ని ప్రేమించి మరొకర్ని పెళ్ళిచేసుకున్నావంటే నీకూ కులటకూ తేడాఏమిటి?

రాధ : (కోపంగా) ప్లీజ్!... తగ్గాలి!

రాము: ఆఁ!

రాధ : అవును. నేను బి. ఎ. చదివాను. నీకు పట్టికోపమేవుంది. నాకు కోపంలోఆలోచనకూడావుంది. మిస్టర్ రామూ! ఎటు కూడినా రెండూ, రెండూ నాలుగే! ఆకు ఏ నాటికీకాదు. శాస్త్రాలు ఆడవాళ్ళకు ప్రత్యేకశిక్షలు విధించాయి ఒకనాడు. కాని ఇది పాతకాలంకాదు. ఈ క్రొత్తలోకంలో ఎవరికైనా ఒకటేశిక్ష! ఒకటేబాధ! నీకు జరిగిందే నాకుజరిగిందంతే. నిలువునా చీలుస్తావేం? కానియ్యి చూద్దాం.

రాము: ఏం? పిరికివాణ్ణనుకుంటున్నావా? నీ ప్రియుడే నా కళ్ళెదురుగా కనిపిస్తే నిన్నూ, వాణ్ణీ......

(మాట పూర్తి కాకుండానే మెట్లమీదకొచ్చాడు రంగనాథం.)

రంగ : ఏమిట్రా రాము ?

రాము: (గతుక్కుమన్నాడు) అబ్బే ఏమిలేదండి. (కంగారుగా లోనికి వెళ్ళాడు)

రంగ : రాధా ! ఏమిటమ్మా వాడి హడావిడి. (క్రిందకు దిగాడు)

రాధ : ఏనుందండి. (ఆమెకూడా లోనికి వెళ్ళింది)

(ఆట శ్రద్ధతో చదరంగంపై పావులతో సహా భద్రంగా దిగాడు పాపయ్య)

పాప : రంగనాథం ! ఏది ? ఇది అన్యాయం. ఆటకడతానని అదిరి పారిపోయి వస్తావా ! ఏది ? ఈసారి ఆడు చూపిస్తా నా తడాఖా. నీ మంత్రిగాడు నా మంత్రాంగంలో పడి, ఏది ? పిల్లిలా మంత్రాలు వేయకపోతే నాపేరు పాపయ్యే కాదు.

రంగ : (కష్టంగా) పాపయ్యా !

పాప : అవును పాపయ్యే! ఏది ఆడవయ్యా చెబుతా నీ పని...

రంగ : రెండుసార్లు ఓడికూడా ఎందుకయ్యా ప్రతాపాలు.

పాప : రెండుసార్లు ఓడితే మాత్రం ఏది మూడోసారి గెలవకూడదని వుందా ఎక్కడైనా.

రంగ : ఇకవెళ్ళు నా మనస్సేం బాగాలేదు.

పాప : ఆ పప్పులు నాదగ్గర వుడకవు రంగనాథం. ఏది ? ఆటమధ్యలో ఆగితే వూరుకుంటానా ?

రంగ : ఏం చేస్తావయ్యా ?

పాప : ఏది? ఆడితే ఓడిస్తాను.

రంగ : ఛీ! చేతకాని కబుర్లు. (అట్టమీద కొట్టగా పావులు, అట్టా క్రిందపడ్డాయి. పాపయ్య నిర్ఘాంత పోయాడు. సుబ్బయ్య "ట్రే" తో వచ్చి మంచినీళ్ళగ్లాసు అతని ముఖముదగ్గర పెట్టాడు)

పాప : చాలా మంచివాడవు సుబ్బయ్యా! (గడగడా త్రాగాడు) ఏది?

సుబ్బ : ఇప్పుడు దారి అది బాబు.

పాప : కాఫీ త్రాగకుండానే! (కాఫీ తీసుకున్నాడు)

సుబ్బ: బాబుగారూ (ట్రే ముందు పెట్టాడు.)

రంగ : (అలోచనలోవున్నాడు) ఊఁ (చూశాడు) సరే! (కాఫీ అందుకున్నాడు. సుబ్బయ్య "ట్రే" ప్రక్కనపెట్టి, అట్ట, పావులు ఏరుతున్నాడు)

పాప : (కాఫీత్రాగి) జడ్జీగారూ! ఏది? ఇంతకుముందేం జరిగిందంటా రిక్కడ?

సుబ్బ : (ఏరుతూనే) మంచినీళ్లు త్రాగించడం జరిగిందండీ.

పాప : నువ్వూరుకోవోయ్! నేను పైనుంచి చతురంగబల సమేతంగా వచ్చేసి ఏది? నీ దగ్గర ధైర్యంగా నిలచి ఏదో వాగి, 'ఛీ' అనిపించు కున్నానా!

సుబ్బ : (సర్దుతూనే) అదృష్టవంతులుగాబట్టి అంతటితో సరిపోయింది.

పాప : (కోపంగా సుబ్బయ్యను చూసాడు) చూడు రంగనాథం. తద్దినం పెట్టేవాని తమ్ముడిలా వీడొకడు (వెధవ మొఖం పెట్టాడు)

రంగ : (నవ్వుతూ వీపుమీద చరచి) ఓడిపోయి గూడా గెల్చావు పాపయ్యా ! ఆc. సుబ్బయ్యా ! అవి పైన పెట్టిరా (సుబ్బయ్య వెళ్ళాడు)

పాప : (నవ్వి) వెధవది "ఇన్‌ట్రెస్టు" చూచావా రంగనాథం ఎంతపనిచేసిందో ఏది ? నాకు తెలియకుండానే ఏదో వాగడం, నీకు కోపం తెప్పించడం జరిగింది. ఏది ? అసలు "ఛస్" లో ఉండే ఎట్రాక్షన్ వుంది – చూచావ్ ఏది ? చతురంగానికి ఆడేవాళ్ళకు మధ్య ఉండే ఆకర్షణ ఏది ? ప్రేయసీ ప్రియులమధ్యవుండే వెధవ "లవ్" కన్నాఘనమైందయ్యా ? అయ్యోరామ ! అందుకేగా పానకాలరావు భార్య సుగుణకు "ఛస్" నేర్పి ఏది ? వెంకటరావుగాడు ఆమెను పట్టి దుర్గణనుచేసి విడిచి పెట్టాడు.

రంగ : ఆమె చాలా యోగ్యురాలని విన్నాను.

పాప : ఏది ? తెల్లనివన్నీ పాలనుకునే నీతో ఏమిచెప్పను. ఏది ? రంగనాథం ! టార్చిలైటువేసి వెదకితే ఆ వీధి మొత్తంలోనే ఒకళ్ళు కనిపించలా. ఆc !

సుబ్బ : (పైనుంచి వస్తాడు) వెధవ రేడియో ఒకటే వాగుడు.

రంగ : ఇందాక కట్టేశావుగా.

సుబ్బ : రాధమ్మగారు పెట్టారేమో బాబు !

పాప : అయ్యో రామ ! ఇప్పుడు రేడియో ఏమిటయ్యా ?

సుబ్బ : మా యింట్లో రేడియోకి లైసెంలేదు బాబు ! వద్దన్నా యెప్పుడు అవాకులూ చావాకులూ వాగుతు నేవుంటుంది.

పాప : ఏది ?

సుబ్బ : అదేబాబు రేడియో. ("ట్రే" తీసుకొని లోనికి వెళ్లాడు)

పాప : ఏదీ ? నీకర్థంకాలేదు. రంగనాథం ! వాడు రేడియో అన్నది నన్నూ-

రంగ : అలాగా!

పాప : అసలు ఈ పింజారివెధవను ఎందుకు పెట్టావయ్యా కోంపలో, ఏదీ ? నేనంటే కళ్ళతో చూడనేలేదు. మన చిన్ననాటి స్నేహం, బంధుత్వం ఈ బికారిగాడు గురించి మానుకుంటామా ఏదీ ?

రంగ : అదే జరిగిపోయిందిగా వూరుకో.
(రాధ లోపలనుంచి చేతులో సూట్ కేసుతో కోపంగా తొందరగా వెలుపలకొచ్చింది.)

రంగ : (ఆశ్చర్యపడ్డాడు) రాధా !

రాధ : (టక్కున ఆగింది. వెనుతిరిగి చూడ లేదు.)

రంగ : ఎక్కడికి ప్రయాణం ?

రాధ : (మాట్లాడ లేదు.)

పాప : అయ్యోరామ ! మావగారుఅడుగుతుంటే... పెద్దవాడు ...మాట్లాడ వేమిటమ్మాయ్!... ఒకవేళ పాత స్నేహితులింటికి వెడుతుందేమోలే రంగనాథం !

రంగ : పాపయ్యా!

పాప : ఏది? ఆఁ!

రంగ : వెంటనే ఇంటికి వెళ్ళు.

పాప : (తడుముకుని)రాధా! నిన్నే నమ్మా తక్షణం యింట్లోకి వెళ్ళమంటున్నాడు.

రంగ : ఆమెనుకాదు నిన్నే.

పాప : అయ్యోరామ! నేనింట్లోకెందుకు?

రంగ : (బిగ్గరగా) బైటకు వెళ్ళమంటున్నా. ఊఁ! వెళ్ళు!

పాప : ఏది? సరే భోజనానికుందామనుకున్నా! ఏది? మళ్ళీ వస్తాగా.

రంగ : వెళ్ళు... (తుళ్ళిపడి పాపయ్య వెళ్లాడు) ఇప్పుడైనా సమాధానం చెప్పచ్చుగా ఎక్కడికి వెడుతున్నావో?

రాధ : మా యింటికి.

రంగ : మీ యింటికా! మరి ఇది ఎవరిల్లు.

రాధ : ఇది నా యిల్లుకాదు. ఇక్కడ నాకేహక్కూ లేదు.

రంగ : అత్తింటిలోనే హక్కు లేనప్పుడు, పుట్టింట్లో పుట్టు కొస్తుందా? ఎవరున్నారక్కడ?

రాధ : అమ్మేకాదు. అన్నయ్యకూడా వున్నాడు.

రంగ : ఆదరిస్తారని నమ్మకముందా? లేక అధికారమిస్తారని ఆసక్తివుందా?

రాధ : నాకు కావలసింది అధికారం కాదండీ.

రంగ : మరి...

రాధ : మనశ్శాంతి.

రంగ : అంటే ?

రాధ : అబ్బ ! నేనేమీచెప్పలేనండీ. నా బాధ మీకు తెలీదు క్షమించండి. (తొందరగా వెళ్ళబోయింది)

రంగ : కాలుకదిపావా మర్యాదగావుండదు రాధా !

రాధ : (బాధ-కోపం) మావయ్యా !

రంగ : ఎవరిచ్చారు మీకీఅధికారం అని అడుగుతావా ? మన బంధుత్వం, అంతేకాదు నా పెద్దరికంకూడాయిచ్చింది. నా యింట్లో నా అనుమతిలేకుండా ఏ వక్కరూ కాలు కదపటానికి వీల్లేదు.

రాధ : ఆడదానికి తాళికట్టినవారిఆజ్ఞే ముఖ్యమేమో !

రంగ : వాడు నిన్ను వెళ్ళమన్నాడా ? (ముందుకెళ్ళి) రామూ ! రామూ !

రాము: (వచ్చాడు) పిల్చారా ?

రంగ : నేనుపిలిచింది వినికూడా మళ్ళీపిల్చారా అంటావేమిటి ? రాధ వాళ్ళ పుట్టింటికి వెళుతుంది.

రాము: అలాగా !

రంగ : ఏం తెలియదుపాపం. వెళ్ళమంటావాఅని అడుగుతున్నా.

రాము: మీయిష్టం.

రంగ : ఏమిటీ ?

రాము: మీ యిష్టమే నా యిష్టమంటున్నా...

రంగ : వ్యక్తిత్వంలేని వెంగళప్పలసమాధానంరాఅది. ఆనాడు కూడా ఇలాగనే యీ పెళ్ళిచేసుకున్నావ్. సరిగాచెప్పు.

రాము: ఆమె వెళ్ళడమే మంచిది.

రంగ : ఎందు కెళ్లాలామె ?

రాము: ఇక్కడ వుండటం ఆమెకిష్టంలేదు.

రంగ : నీ కిష్టముందా ? మాట్లాడవేం ? ఈవూరి కావూరు ఎంతదూరమో, ఆవూరి కీవూరు అంతేదూరమురా ! ఆకర్షించుకోగలశక్తివున్న మనస్సే అన్యుల ఆకర్షణకు కూడా లోనవుతుంది. ఆమె నా తోబుట్టువు కూతురు. అమె యిక్కడుంటం నీ కిష్టంలేనప్పుడు ఇష్టమున్న చోటుకి నువ్వే వెళ్ళడం మంచిది.

రాము: నాన్నా !

రంగ : ఆమెకి నువ్వు చెప్పిందే, నేను నీకు చెబితే అంత ఆశ్చర్యం ఎందుకు ?

రాము: ఆమె నేను సమానమా ?

రంగ : ఎందుకాదు ? మగవాడివనా - లేక బిడ్డవనా ? ఏమిటిరా నీ ఆధిక్యం ?

రాధ : ఎందుకండీ నాగురించి మీలో మీకు కలతలు ?

రంగ : ఓహో ! అక్కడికి మీరిద్దరు పెద్ద అన్యోన్యంగావున్నట్టు. రాధా ! ఇప్పటివరకు వాడినే తప్పనుకున్నా. ఆడదానిగా పుట్టిన నీలో సరళం, సహసం సహజంగా వుంటాయను

కున్నా. పెళ్ళిచేసిన పెద్దల గౌరవాన్ని నిలపటానికైనా సంసారాన్ని సరిదిద్దుకోగలవని తలచా.

రాధ : మీ వుద్దేశం ?

రంగ : దంపతులిద్దరూ అన్యోన్యంగావుండటమే. నా వుద్దేశమే కాదు. బిడ్డలకన్న తల్లిదండ్రుల ప్రతివాళ్ళ వుద్దేశం యిదేనమ్మా. భర్తవల్ల లోపాలుంటే భార్య సర్దుకోవాలి.

రాధ : ఆ బాధ్యత మగాళ్ళకిలేదా ?

రంగ : వుంది! రెండుచేతులూ కలసినప్పుడే చప్పుడౌతుంది.

రాము: రెండూ రెండూ నాలుగే.

రంగ : రామూ !

రాము: ఆమె అన్నమాటే. నా కెందుకు (లోనికి వెళ్లాడు)

రంగ : చూడురాధా ! సంసారం సరిదిద్దడంలో పురుషునికన్నా స్త్రీకే ఎక్కువ బాధ్యతలున్నాయని మనశాస్త్రాలు ఘోషిస్తున్నాయమ్మా. "కార్యేషు దాసీ, కరణేషు మంత్రి".

రాధ : నాకు తెలుసండీ !

రంగ : తెలుసుండేనా నువ్వీవిధంగా ప్రవర్తించడం ?

రాధ : నన్నుమీరు అర్థంచేసుకోలేదు.

రంగ : నిన్నునీవు సరిగా అర్థంచేసుకున్నావామ్మా !

రాధ : నాకు అర్థంకావడంలేదు.

రంగ : కాదు, ఎవరితత్వాన్నివాళ్ళు సరిగా అర్థంచేసుకుంటే

విశ్వాన్నే అర్థంచేసుకున్నట్టమ్మా. మనల్ని మనం అర్థం చేసుకున్నామా అని ముందు ఆలోచించాలి. ఆ తర్వాత తనను యితరులు అర్థంచేసుకోకపోయినా బాధపడ లేరు. (మెల్లగా) రాధా ! నీవే కాలేజీలో చదివావ్?

రాధ : గుంటూరు కాలేజీలో.

రంగ : నీ పెళ్ళి చాలా హఠాత్తుగా జరిగిందికదూ ?

రాధ : ఇవన్నీ అడుగుతారేం మీకేమీ తెలియనట్టు.

రంగ : పెళ్ళికావడం తెలుసు. అంతకు ముందు ఏంజరిగిందీ నాకేం తెలుసు ?

రాధ : అంటే అర్థం ?

రంగ : అంతకంగారుపడతావేం? చిన్ననాటినుండే రాము, నువ్వు బావా మరదళ్లుగా చనువుగా మసలేరే ! మరి భార్యాభర్తలుగా అన్యోన్యంగా వుండటానికి అభ్యంతరం?

రాధ : ఆ చిన్ననాటి చనువు అన్నగారనే భావాన్ని అతనిపట్ల నాకు కలుగచేసింది.

రంగ : (భయంతో బిగ్గరగా) రాధా ! ఏమిటీ ? అన్నగారా ?

రాధ : అవును. చిన్ననాడు చనువుగా వున్నాం. "బావా" అని పిలిచాను. అంత మాత్రాన భార్యాభర్తలమే అవుతామని మీరెందు కనుకోవాలి ? నోరులేనివి జ్ఞానంలేనివి కాబట్టి ఒక గూటిలోవున్న పక్షులు విధిలేక జంటకోసం భార్యాభర్తలు కావచ్చు. మానవుల్లో అతి చనువు, ప్రేమకన్నా వాత్సల్యాన్ని, అనురాగానికన్నా ఆత్మీయ

తనే అందజేస్తుంది, కాని భార్యాభర్తల స్థానాన్ని ఆక్రమించ లేదు. పెద్దలు ఆలుమగలుగా జేసినా వాళ్ళ అనుభూతులు మాత్రం మాలాగే వుంటాయి.

రంగ : (బాధగానవ్వాడు) ఇది నీ వూహతో చిత్రించుకున్న కల్పనా చిత్రమేమో ?

రాధ : అనుకున్నా యిబ్బంది లేదు. కానీ...కానీ...

రంగ : రాము నీ భర్త కాదంటావ్.

రాధ : అవును.

రంగ : అంతమాత్రాన కాకుండాపోతాడా ?

రాధ : శృతిమించితే పశులక్షణమంటారు.

రంగ : లేకపోతే ఇది మానవత్వమా స్త్రీ లక్షణమా ?

రాధ : అవును. ఇష్టంలేని పెళ్ళి చేసినప్పుడు స్త్రీ లక్షణం ఇదే కావాలి.

రంగ : ఆ ఉద్యమానికి ఆదర్శమూర్తిగా నువ్వే నిలవాలి. రాధా ! పెళ్ళయ్యేముందు నీలో ఈ తెలివి తేటలన్నీ ఏమయ్యాయి? ఎక్కడపాతరేశావు? ఈనాడు ధైర్యంగా నా ఎదురుగా సమాధానంచెప్పే నువ్వు, ఆనాడు నీ కన్నతల్లిముందు నోరు ఎందుకు విప్పలేకపోయావ్ ?

రాధ : (బాధగా) పెద్దవాళ్ళక్కడే కొనసాగిన తమకోర్కెలతో పసిహృదయాలను చిత్రవధచేస్తున్నారు. వాళ్ల బిడ్డలుగా పుట్టిననేరానికి, మనసులు వికసించకముందే పెళ్ళిగురించి మాటలుతీసుకుని, దగ్గరబంధువులమనో,

లేక ఇచ్చినవాగ్దానాలు నిలుపుకోవాలనో తాపత్రయ పడతారు. కాదంటే, నవమాసాలు మోసి పెంచిన దానికి ఫలితమిదేనా ? విద్యాబుద్ధులు చెప్పించినదానికి ప్రతిఫలం యిదేనా? మా పరువూ-ప్రతిష్ఠా సర్వనాశనం చేస్తావా ? నీ చేతులతో మా క్కాస్త విషమిచ్చి చంపరాదూ ? ఇలాంటి ధోరణితో చిన్నవాళ్ల వ్యక్తిత్వాన్ని చితకకొట్టి....

రంగ : (విసుగ్గా) ఏమిటిదంతా ?

రాధ : నాకు జరిగింది ఇదే కాబట్టి చెబుతున్నా. అందులో పెళ్ళికాని పిల్లలులేని సెంటిమెంట్సుకి విలువిచ్చి తమ విలువైన జీవితాన్ని నాశనంచేసుకుంటారు. నాకూ అలాగే జరిగింది. అమ్మ మంచం పట్టింది. ఆమె ఆత్మ శాంతికోసం ఈ పెళ్ళికావాలని కన్నీరు కార్చింది. ఆ స్థితిలో తెరచిన నా నోరు మూసింది. ప్రాణంలేని బొమ్మనుచేసి నా గొంతును కోసింది. నన్ను చంపి తాను బ్రతికి ఇప్పుడు సుఖాన్ననుభవిస్తుంది. (ఏడుపొచ్చింది.)

రంగ : ఆఁ! రాధా ! చూడమ్మా! మాటకన్నా మనస్సు బలమైంది. మననం చేసేకొద్దీ ఆశనిరాశలు మరింత బలిష్టమౌతాయి. గోటితో తొలగించేవి గొడ్డలి దాకా పోవడమంటే అదేనమ్మా !

రాధ : వివరంగా చెప్పండీ ?

రంగ : అందరూ ప్రేమించి పెళ్ళిచేసుకోడంలేదు. అసలు మీరంతా కల్పించుకున్న ఈ వ్యామోహాలకి 'ప్రేమ'ని పేరు పెట్టడం కూడా మంచిది కాదని నావుద్దేశం. నిజమైన ప్రేమ త్యాగాన్ని కోరుతుందిగాని, స్వార్థాన్ని కోరదు. ప్రేమనే దానికన్నా వ్యామోహమని పిలవడం సమంజసం. బాధపడవద్దు. నా స్వానుభవంతో చెప్పా లంటే నా భార్యను, అంటే మీ అత్తయ్యను ప్రేమించి పెళ్ళిచేసుకోలేదు. అసలు పెళ్ళినాటివరకూ ఆమెముఖం ఎలావుంటుందో తెలీదు. కాని మా అన్యోన్యతకు ఈ కల్పితప్రేమనే పదార్థాన్ని అడ్డుగాపెట్టుకుని ఆప్యాయ తను నటించనూలేను. దాంపత్య ధర్మాన్ని పాటించా మంతే.

రాధ : అలాంటి పెళ్ళిళ్లు విజయంపొందటంలోకూడా ఆశ్చర్యం లేదు.

రంగ : అంటే ?

రాధ : ఏనాడు ఎరుగనివాళ్లు దంపతులుగా నిలవడం, ధర్మాన్ని నిర్వర్తించడం ఘనంకాదు. చిన్ననాటినుండి తిట్టు కుంటూ కొట్టుకుంటూ చనువుగా వున్నవాళ్లు భార్యా భర్తలు కావడమే.

రంగ : భరింపరాని నేరమంటావ్... రాధా! అది అలావుంచు. పరస్పరంగా ప్రేమించుకుని పెళ్ళిచేసుకునేవాళ్ళు శాశ్వ తంగా దాంపత్యధర్మాన్ని పాటించగలరనే నమ్మకం నీకుందా ?

రాధ : అందుకే మన దేశంలో కూడా 'విడాకుల' చట్టాన్ని అమలులో పెట్టారు.

రంగ : అంటే నీ వుద్దేశ్యం ?

(రాము లోపలినుంచి విసురుగా వచ్చాడు)

రాము: స్పష్టంగా చెబుతూంటే ఎందుకండీ ఆమెను పదేపదే అడుగుతారు ? నేనుకూడా ఇలాంటిస్త్రీని ఎదురుగా పెట్టుకుని, భార్యాని చెప్పుకుంటూ బ్రతకలేను. ఇలాంటి నీచురాల్ని పతితను...

రంగ : నోర్ముయ్ ! బిడ్డలకు పెళ్ళిళ్లుచేయడమెందుకు ? అతకని మనస్సులతో గతుకులదారిలో కంగారుతింటూ బ్రతుకుతారనా ! జంటలువీడి మారుమనువు చేసుకుంటారనా ? విడాకులట విడాకులు. ఆ దేశాల్లో పెళ్ళిళ్లెంతసులభమో, విడాకు లంతే చౌక. ఎంత తొందరగా ప్రేమంటూ కలుస్తారో, అంత తొందరగానే విడిపోతారు. ఇదా పెళ్ళిళ్ళంటే అర్థం ? మన వివాహ వ్యవస్థే వేరు. అమరమైంది. ఆదర్శమైంది కూడా. ఒక మనిషికి ఒకేసారి పెళ్ళవుతుంది.

రాధ : మగాళ్లు మరో పెళ్ళిచేసుకోటానికి కారణం ?

రంగ : భార్యపోయిన తర్వాత.

రాధ : అది తప్పుకాదా ?

రాము: ఆడాళ్లూ చేసుకుంటున్నారుగా మొగుడు చచ్చాక.

రంగ : ఓహో ! నీవన్న రెండూ రెండూ నాలుగులో అర్థమిదేనా ?

రాము: నాకేం తెలియదు. నేనేం సమాధానం చెప్పలేను.

రంగ : నోరు ముయ్యమన్నందుకు బాధపడుతున్నావా ?

రాము: మీరు కొట్టినా బాధలేదు.

రాధ : నేను ఎదురుగా వుండడమే ఆయన బాధ.

రాము: అవును.

రాధ : విన్నారుగా ?

రంగ : విన్నాను, విన్నాను, విన్నాను.

రాధ : అయితే....

రంగ : వెళ్ళమంటున్నా లోపలికి. (కోపంగా లోనికి వెళ్ళింది.) (తెరలో పోష్టు అని పిలుపు వినిపించింది. రాము వెళ్ళ బోయి రంగనాథం వెళ్ళడం చూసి ఆగాడు. తిరిగి వుత్తరాలతో వచ్చాడు)

రంగ : ఇంతకూ నాకు లేదు. ఒకటి నీకురా (ఇచ్చాడు)

రాము: రెండోది ?

రంగ : అది నీ కనవసరం.

రాము: (ఉత్తరం చించి తొందరగా చదివాడు. వాచీ చూసు కుని) వాటే ఫూల్ ! ఒకరోజు ముందు వ్రాయ కూడదూ! అప్పుడే బండొచ్చే వేళయిందే !

రంగ : ఎవరితోరా మాట్లాడుతున్నావ్ ?

రాము: ఉత్తరంతో ... ఆహాం. మా ఫ్రెండ్ గోపీ వుత్తరం వ్రాశాడు నాన్నగారూ ! ఈబండికే వస్తాడట. అరే! టైం కూడా లేదు.

రంగ : రామూ ! ఎవర్రా గోపీ !

రాము: నా క్లాస్ మేటండీ. వాడు... వాడు... (వెళ్ళబోయి తిరిగాడు)

రంగ : ఒరేయ్!... ఏమిట్రా ఆ పిల్లిగంతులు ?

రాము: మెయిల్ కి టైం లేదు నాన్నగారూ !

రంగ : ఉంది.

రాము: ఉందా ?

రంగ : వస్తే కాస్త ఆలస్యంగా రావటం దాని కలవాటుగాని, చస్తే నీ అంత తొందరబడి ముందొచ్చిన రోజు ఒక్కటీ లేదు. ఇంతకీ విషయమేమిటో నేను వినకూడనిదా ?

(రాధ వచ్చి వింటుంది.)

రాము: అబ్బే! అదేమీ లేదండి. గోపీ పెళ్లాని కేదో కాస్త పిచ్చిపట్టిందట.

రంగ : సరే! నీ వరసచూస్తేఆపిచ్చి నిన్ను వరించేట్టుంది. తొంద రగా వెళ్లు. (రాము వెళ్ళబోగా) రామూ! (ఉసూరు మంటూ ఆగాడు) మరేం లేదు. ఆ దంపతు లిద్దర్ని తిన్నగా మనింటికి తీసుకురా.

రాము: థాంక్స్. వాడు రాయల్ లాడ్జిలో రూముతీసుకున్నట్టు రాశాడు. తప్పకుండా తీసుకొస్తాను.

(రాము తొందరగా కొంతవరకూ వెళ్ళి తండ్రి పిల్చా డని భ్రమించి ఆగి) పిల్చారా !

రంగ : నేను పిలవడం నీకు వినిపించిందా.

రాము: వినిపించింది... అహఁ! అనిపించింది.

రంగ: అనిపించిందల్లా వినిపించడం కాదూ. వినిపించిందంతా, కనిపించడంతో సమానమూ కాదు... మెయిల్ వచ్చి వెళ్లి వుంటుంది... వెళ్లు!

రాము: (భయం) ఆఁ! (పరుగెత్తాడు).

రంగ: ఏవమ్మా నీకేమన్నా అనిపించిందా? వినిపించిందా?

రాధ: అదే ఎవరో వస్తున్నారని విన్నాను.

రంగ: వాడి స్నేహితుడు 'గోపీ' అట.

రాధ: (ఆశ్చర్యంగా) గోపీ!

రంగ: అహఁ! ... నీకు తెలుసామ్మా?

రాధ: అబ్బే! కాలేజీలో ఒకబ్బాయి వుండేవాడు.

రంగ: అతనికి పెళ్ళయిందా?

రాధ: (బాధగా) అప్పటికి కాలేదు.

రంగ: అయితే ఇతను పెళ్లైన గోపీలేమ్మా. అతని భార్యకు పిచ్చట! అదికూడా ఒక విచిత్రమైన దాంపత్యమై వుంటుంది. అరె! మరచాను. నీకూ వుత్తరం వచ్చిందమ్మా. (రాధ తీసుకుని దస్తూరి ఆశ్చర్యంగా చూసి వుత్తరం చింపి ఆందోళనగా చూసింది. అది రంగనాథం గమనిస్తూన్నాడు.)

(సుబ్బయ్య లోపల్నించి వచ్చాడు.)

సుబ్బ: వడ్డనైంది బాబూ!

రంగ: ఆకలిగా లేదు.

సుబ్బ : అదేమిటిబాబు ! పొద్దున్న టిఫిన్ కూడా తీసుకోలేదు.

రంగ : తింటేనే కడుపు నిండుతుందా సుబ్బయ్యా ! ఉంటే చాలదూ ? మనింట్లో ఆకలికానంతఆహారం కళ్లెదురుగా వుంది ! (రాధ కంగారుగాచూసింది. చూడనట్టు రంగ నాథం) సరే ! ఆకలిగాకపోయినా ఆచారంవుందిగా పద...

సుబ్బ : చినబాబుగార్కి-కూడా వడ్డించానండీ.
(పాపయ్య వచ్చాడు.)

పాప : అభ్యంతరం ఏముంది సుబ్బయ్యా ! నేనువచ్చానుగా సమయానికి. ఏదీ ? చినబాబు మెయిల్ కన్నా స్పీడుగా నాకెదురయ్యాడాయే. ఏది ? ఇదుగో సుబ్బయ్యా ! అలవాటు కానిపని మా రంగనాథానికుంది చూశావ్ ఏదీ ?

సుబ్బ : ఏముందండీ చూడ్డానికి.

పాప : అయ్యోరామా ! అదే ఒంటరిగా భోజనంచేయటం మా రంగనాథానికి బొత్తిగా అలవాటులేదు.

సుబ్బ : జంటకుతయారయ్యారుగా (రంగనాథంతో) రండిబాబు! అన్నం చల్లారిపోతుంది. (వెళ్ళాడు) (ఉత్తరంచూస్తూనే రాధ కన్నీళ్ళతో వుంటుంది. పాపయ్యచూసాడు.)

పాప : ఏమిటి రాధమ్మా ఉత్తరంలో విషయం ? ఏది ? అరే ! కన్నీళ్లుకూడా !

రాధ : (కంగారుతింది) ఏమీలేదండీ.

రంగ : అయిన వాళ్ళెవరో ఉత్తరం వ్రాసి వుంటారు. అవన్నీ నీకెందుకు ?

పాప : ఏది ?

రంగ : అదే. భోజనానికి నేను వెళుతున్నాను. వస్తే తొందరగా రా (వెళ్ళాడు)

పాప : (కొంతవరకూ వెళ్ళి తిరిగివచ్చి రహస్యంగా) ఇదిగో రాధమ్మోయ్ ! రామున్నాడు చూశావ్ ఏది ? మీ ఆయనమ్మా ! మామూలు మనిషి కాడు. ఆc. అదేనమ్మా. కాలేజీలో చదువుతున్నప్పుడు ఒకపిల్లమీద కన్నేశాట్ట. కన్నేకాదులే, ఏది ? అసలు పెళ్ళేచేసు కోవాలనుకున్నాట్ట !

రాధ : ఈ విషయం నాతో ఎందుకు చెప్పడం ?

పాప : బాగుంది. ఇంకెవరితో చెబుతాను. పైకల్లా అంటున్నావు గానీ, నీ మనసు ఎంత కుళ్ళిపోతోందో నాకు తెలీదూ? ఇదిగో రాధమ్మా కుక్కకాటుకి చెప్పుదెబ్బలా...

సుబ్బ : (వచ్చేడు) ఇదిగో – పాపయ్యగారూ ! ఆ తినేదేదో లోపలికొచ్చి తినమన్నారు.

పాప : ఏది ? ఇక్కడ ఏమి తింటున్నానురా, గాడిదా ! గడ్డి తింటున్నానంటున్నావా ?

సుబ్బ : గాడిద గడ్డితినాలన్నా అన్నిచోట్లా దొరకదుబాబూ ! వట్టిగడ్డికూడా వల్లమాలిన ధరగా వుంది.

పాప : విన్నావా రాధమ్మా ! ఏది ? అసలు వీడి విషయ మేమిటంటే...

సుబ్బ : ఆలస్యమైతే టేబిల్ మీాద అన్నంవుండదు (వెళ్లాడు)

పాప : వీడిదుంపతెగ అన్నంతపనిచేస్తాడు. (వెళ్ళి తిరిగి) ఇదిగో రాధమ్మా !

రాధ : నాకేంచెప్పకండీ ! వెళ్ళండి.

పాప : ఏది ? గోడదెబ్బ, చెంపదెబ్బ నాకే! అయ్యోరామా ! మంచికి రోజులుకావులే. (వెళ్ళాడు)

(రాధ ఉత్తరం మెల్లగా చదువుతూంది.)

రాధా ! ఈ వుత్తరం నీకు కొంత బాధకలిగిస్తుందేమో. అయినా నా రాక తప్పనట్లే ఈవుత్తరం వ్రాయడంకూడా తప్పలేదు. (గోపీగొంతే; వినిపిస్తుంది.) గత జీవితాన్ని మళ్ళీ జ్ఞాపకం చేయదలచుకోలేదు. దానివల్ల లాభంకూడా లేదు. జీవితమేఒకకల ! కలలో మధురానుభూతులేకాదు, భయానక సంఘటనలుకూడా వుంటాయి. అలాంటి జీవితాన్ని గడుపుతూ చాలామంది శాస్వితంగా భ్రమిస్తారు. స్వార్థంకోసం అన్యాయాలు చేస్తారు. దానివల్ల వాళ్లు ఆనందాన్నిఅనుభవిస్తారో, దుఃఖాన్ని చవిచూస్తారో, మనకు అర్థంకాదు. అయినా అలాంటి బ్రతుకులకు దూరంగా వుండాలనే కోరాను. కాని అనుకోని బంధం కాళ్ళకేకాదు కంఠానికే తగిలించుకున్నాను. మరణించే సహృదయునికోసం మతిలేనిపిల్లను భార్యగా స్వీకరించాను. ఆమె బాగే యిప్పుడు నా బాధ్యత. ఈ స్థితిలో నా మిత్రుడి సహాకారంకోసం ఒక

నాడు "నా" అనుకోని దూరమైన నీయొక్క ఆదరణ కోసం ఆమెను తీసుకొచ్చాను. నీ గోపీ!

(గోపీవచ్చాడు. ఇద్దరూ అలాగే వుండిపోయారు)

గోపి : (తమాయించుకున్నాడు) మరచావా రాధా!

రాధ : గోపీ! ఇది కలకాదుకదా!

గోపి : మెలకువగా వుండే ఒకనాడు కల కన్నాం రాధా!

రాధ : నన్ను క్షమించలేవా గోపీ!

గోపి : ఎంతటివాణ్ని రాధా! క్షమించగల యోగ్యతనాకుందా?

రాధ : ఉంది గోపీ! నీపట్ల తీరని ద్రోహంచేసాను.

గోపి : లేదురాధా! నీపెళ్ళి నీ యిష్టంతో జరిగిందైతే, అలా నేను అనుకోవడం న్యాయం, కాని నువ్వు మనసారా నన్ను కాదని దూరం కాలేదని నిన్ను తెలుసుకున్న నాకు తెలుసురాధా!

రాధ : ఎంత సహృదయుడివి గోపీ!

గోపి : సహృదయత్వం సమాధి కానంతవరకూ సమాజంలో మనిషిగా మనలేమేమో; నా గొడవకేంగాని నువ్వు ఎలావుంటున్నావ్? రాము నా మిత్రుడు. నిన్ను ఆప్యాయంగానే చూస్తాడని నా నమ్మకం.

రాధ : నిజమే. అతనికి నేనంటే చాలా ఆప్యాయత.

గోపి : సంతోషం! జరిగినవన్నీ మరచావుకదూ? నాజ్ఞాపకంలో పరాధీనురాలవై, వాడికేమీ అనుమానం కలుగకుండా...

రాధ : వుంటున్నానుగోపీ! వుంటున్నాను! అంతేకాదు. గతాన్ని పాతిపెట్టి, గుండె రాయి చేసుకున్నాను. కట్టుకున్నవానిని కంటికి దూరంగా వుంచుతున్నాను. తండ్రిలాంటి మామగార్కి దుఃఖానికి కారకురాలయ్యాను. అందరికీ బరువుగా ఎవరికీ చెందని అస్పృస్యురాలుగా బ్రతుకుతున్నాను. గోపీ బ్రతుకుతున్నాను.

గోపి : (భయాశ్చర్యాలు) రాధా! ఏమిటీమాటలు! నేనేమైనా నా హృదయంనిండా నింపుకున్న నువ్వు, ఈ నాడు సుఖంగా వుంటున్నావని వూహించాను. నీ నుండి యిలాంటిమాటలు వింటాననుకోలేదు. నాఈరాక నీ ఆందోళనకు కారణమైతే నేను తిరిగివెళ్ళడమే మంచిదేమో రాధా!

రాధ : వద్దు! గోపీ వద్దు! కరువైన నీ దర్శనం కలిగిన నా మనస్సు, ఇక అన్నీ మర్చిపోతుంది. గోపీ! అన్నీ మర్చిపోతాను. నువ్వు చెప్పినట్లుగానే నడుచుకుంటాను.

గోపి : సంతోషం!

(రంగనాథం ఆ మాటలువింటూ వచ్చాడు. దగ్గరకు చేరిన యిద్దరూ కంగారుపడ్డారు)

రాధ : ఆఁ. మా మామగారు.

గోపి : నమస్కారమండీ!

రంగ : ఆఁ. నీపేరేనాబాబు గోపీ?

గోపి : అవునండీ. ఒకనాడు రాధ నా క్లాస్ మేట్.

రంగ : అనుకున్నాను.

(ఇద్దరూ భయంగాచూచుకున్నారు)

కాలేజీఅంటే నా చిన్ననాటి రోజులు జ్ఞాపకం వస్తున్నాయి. జీవితంలో మరువరాని రోజు లవేనేమో ! కొందరికి శ్రమించని డబ్బు, బాధ్యత లేని బరువైతే, మరికొందరికి ఇష్టంలేని చదువు కష్టంలేనిశ్రమ అవుతుంది. ఆం. అనుభవాలు చాలా విచిత్రంగావుంటాయి ! అందులో అందానికి యవ్వనం విందుచేస్తే, ఇక చూడు చూపుల్లో, చిరునవ్వుల్లో ఒకరి కొకరు పందేలు. దానిలో గెలిచేవాళ్లు తక్కువ. వోడిపోయేవాళ్ళే ఎక్కువ రేసుల్లాగ !... సారీ! ఏదో ధోరణిలో పడినట్లున్నాను కదూ ! రాధా ! అబ్బాయికి భోజనం ఏర్పాట్లు చూడు. (రాధ వెళ్ళింది) బాబూ ! రాధ క్లాస్‌మేట్ అని చెప్పావ్. మరి రామూ ఎక్కడ పరిచయం ?

గోపి : వాడు ఇంటర్‌లో క్లాస్‌మేట్‌ండీ! అంటే వాడు వైజాగ్‌లో వుండగా రాము నేను క్లాస్‌మేట్స్‌ం. తర్డుయ్యర్ అక్కడే పూర్తిచేసి, మా నాన్నగార్కి ట్రాన్సఫర్ కావడంవల్ల ఫోర్తియ్యర్ గుంటూరులో చదివా.

రంగ : అక్కడ రాధ నీ క్లాస్‌మేట్ అయిందన్నమాట. సరే మీా నాన్నగారి ఉద్యోగం ?

గోపి : కోర్టు మునిసిఫ్ చేసారు.

రంగ : అంటే, మాధవరావుగా. రబ్బాయివా ?

గోపీ : అవునండీ.

రంగ : పాపం ! మీనాన్నగారు...

గోపి : కాలంచేసి ఆరుమాసాలైందిలెండి. (బాధపడ్డాడు)

రంగ : అదే విన్నా చాలా మంచివాడు. ఏదో జరిగిపోయింది. ఆఁ. ఫామిలీతో వస్తున్నట్టు వ్రాశావ్ ?

గోపీ : అవునండి! ఇక్కడ వుండటానికి అవకాశం వుంటుందో లేదోనని ఆమెను లాడ్జీలో వుంచి వచ్చా.

రంగ : మంచిపనిచేశావ్! మావాడు నీ స్నేహితుడైతే మీ నాన్న నా మిత్రుడు. సరే! భోజనంచేసి వెడుదువుగాని ఆమెను తీసుకు రావటానికి, సుబ్బయ్యా!

(సుబ్బయ్య వచ్చాడు)

రంగ : పాపయ్య భోజన మింకా కాలా ?

సుబ్బ : మజ్జిగలో పడ్డారండీ.

రంగ : మజ్జిగలో పడ్డమేమిటి ?

పాప : (విసుకుగావచ్చి) ఇదిగో రంగనాథం! ఏది ? నేను యిక్కడభోజనం చేయటంవుంది చూశావ్ ఈ బోడి సుబ్బయ్యకు బొత్తిగా ఇష్టంలేదు. ఏది ? లేకపోతే అయ్యోరామా! గడ్డలాంటి పెరుగు ఎదురుగా పెట్టుకుని, వట్టి మజ్జిగనీళ్లు పోస్తాడూ అంట !

రంగ : అతిథు లొచ్చారు.

సుబ్బ: అందుకేనండి మీకు పెరుగు పోయలేదు.

పాప: ఏదీ? నాకంటే అతిథులెక్కువా? నాకూ రంగనాథానికుండే బంధుత్వం - స్నేహం -

సుబ్బ: అందుకే గదండీ నన్ను డబాయించి మరీ తింటున్నారు. కానివాళ్ళయితే గడపలోనే వుండేవారు.

పాప: విన్నావా రంగనాథం వాడిమాటలు. నాకసలు పెరుగెందుకు పోయలేదో అడుగు.

సుబ్బ: మజ్జిగనీళ్లు పోస్తుంటే నేరోజుకి మూడుసార్లు వస్తుంటే....

పాప: పెరుగుపోస్తే పదిసార్లు వస్తానంటావ్. ఇదిగో సుబ్బయ్యా! అసలు నీ విషయముంది చూశావ్...ఏది?

సుబ్బ: ఏముందిబాబూ! వెనకా ముందు లేనివాణ్ని. కట్టుకున్నది కళ్లుమూసిందిగాని నన్ను దగాజేసి ఎవడితోనూ లేచిపోలేదు. (గోపీతో) రండిబాబూ! రాధమ్మగారు వడ్డనచేశారు. (ఇద్దరూ వెళ్ళారు.)

పాప: చూడు రంగనాథం వాడేమని కూశాడో.

రంగ: తెలీకేదో అన్నాడు వూరుకో పాపయ్యా!

పాప: వాడు నీ నౌకరుకాబట్టి వాడిమాటే ఆడతావ్.

రంగ: అంటే నౌకరుకన్నా నిన్నే తక్కువచేశానంటావ్.

పాప: నువ్వుచేయడమేమిటి రంగనాథం. నా రాతేచేసింది. ఆ సిగ్గులేనిది ఆ పాడుపని చేసిందికాబట్టే; అడ్డమైన గాడిదకూ లోకువయ్యాను. లేకపోతే వాడికి ఎన్ని వేల గుండెలున్నాయి నన్నామాటనటానికి. ఆ మాటకొస్తే ఏది? టార్చిలైటువేసి వెతికితే ఒక్కళ్లు- ఒక్కళ్లు

రంగ : (కోపంగా) పాపయ్యా !

పాప : అవున్లే. వెర్రాడిపెళ్ళాం వూరందరికీ లోకువేనని, పద్ద వారు చెడ్డవారుకాదులే- ఇదిగో రంగనాథం! ఏది ? ఆ సుబ్బయ్య మనదగ్గరంటే అన్నాడుకాని మరెక్కడా పేలకుండాచూడు. (సుబ్బయ్య రాగా మెల్లగ) ఇప్పుడే చెప్పి వచ్చాడు. (బిగ్గరగా) రాత్రి ఫస్ ఆడ్డానికేకాదు భోజనానికీవస్తా. (వెళ్ళాడు)

సుబ్బ : ఏం బాగలేదు బాబుగారూ!

రంగ : ఏమిటది ?

సుబ్బ: ఈయన గోరేంటండీ బాబు ఈ యింట్లో. మీరొక్క-సారి చెప్పండి బాబు !

రంగ : పాపయ్యతోనా (నవ్వి) నీకుండే బాధేకాదు. భావం కూడా నాకు తెలుసు సుబ్బయ్యా ! అంతస్తుకు తగని చనువు, అంతరాలు కలియని పరిచయం, మంచిది కాదని నిజమేకావచ్చును కాని... అర్భకుడు ఎక్కడ బ్రతుకుతాడు. పాపం ! పాటి కులస్తుడు. కలిగినవాళ్ళ కులంలోవాడు. నోరున్నవాడైతే లేని బంధుత్వం కల్పించి, చాపమీదవాడు చంకెక్కుతాడు. కాదనలేని దౌర్బల్యం చాలామందిలో వుంటుందేమో; కాల క్షేపానికి పరికరంలా, కబుర్లకు రేడియోలా వాడు కుంటారు. ఒకోసారి ఖరీదుపెట్టి కొనాలన్నా ఇలాంటి పాత్రలు దొరకడం చాలాకష్టం. ఆఁ. అబ్బాయి భోజనం కాకుండానే యిలా వచ్చావ్.

సుబ్బ: నే నుండక పోవడమే మంచిదని...
రంగ : (ఆశ్చర్యం) సుబ్బయ్యా !
సుబ్బ: అవును బాబు ! ఇంతకాలంనుంచి చూస్తున్నాను. ఒక్క నాడుకూడ చిన బాబుగారికి వడ్డన చేయలే దమ్మగారు. ఇప్పుడెంత సంతోషమని చెప్పను బాబూ ! ప్రక్కన నే నున్నాననే సంగతికూడా మర్చిపోయి...
రంగ : (కోపంగా) ఊఁ !
సుబ్బ: బాబు !
రంగ : పెద్దవాళ్ళ విషయాలు చిన్న వాళ్లు గుండెల్లో పెట్టుకోవాలి. వెల్లడిచేస్తే వచ్చే అపాయం ఏమిటో తెలుసా ?
సుబ్బ: చిత్తం ! మనసు పట్టలేక...
రంగ : చూడు పంజరం తలుపు భద్రంగానే వుందికదూ... పరాకుగావుంటే పక్షులు జారుకుంటాయి. జాగ్రత్త ! (బాధగా నవ్వుకుంటూ వెళ్లాడు. సుబ్బయ్య అగమ్యంగా చూశాడు.)

(రంగనాథం నవ్వు. లైట్లు ఆరి వెలిగాయి) ఆడగొంతు నవ్వులా మారిలోపల ధ్వనిస్తుంది. ఒకమ్మాయి పగలబడి నవ్వుతూ రంగంమీద ప్రవేశించింది. వెనకాల రాము భయంగా వెనకాలే వచ్చాడు.)

రాము: (చేయిపట్టుకొని ఆపుచేస్తూ) సీతా !
సీత : (టక్కున ఆగుతుంది) ఏం ?
రాము: నూ్నా ... మా నాన్నగారు వింటారు.
సీత : ఏం వింటే ?

రాము: అబ్బ ! నీకు తెలీదు సీతా ! మానాన్నగారు చూస్తారు.

సీత : చూ స్తే ...

రాము: ఛ ! ఛ ! ఇంత మేడ్‌గా తయారయ్యావేమిటి సీతా !

సీత : ష్యూ ! బేడ్‌గా మాట్లాడ కూడదూ! నేను గూడ్ కండిషన్‌లోవున్నాను. ఎవరూ నవ్వుతున్నారు ? నవ్వు పువ్వులాంటిది, వాడిపోతే ఏడ్వాల్సివస్తుందీ. పిచ్చి రామూ ! నిజంగా ఏడుస్తున్నావా ?

రాము: లేదుసీతా. నువ్విలా మారిపోవటానికి కారణమేమిటి ?

సీత : నా తెలివి తెల్లారిందిగా-

రాము: అలాగేవుంది ! ఇది నీతప్పుకాదు. నిన్ను పెళ్ళాడిన ఆ మూర్ఖుడి తప్పు. నిన్ను కాకిలా పొడిచి నానా హింసలు పెట్టి వుంటాడు. నువ్వు పిచ్చిదానిలా తయారయి వుంటావ్.

సీత : తప్పు-

రాము: ఎవరిది ?

సీత : నీది.

రాము: ఆఁ !

సీత : కాదు. నా రామూది ! సీతను వంటరిగా విడిచి వెడితే రావణాసురుడు వూరుకుంటాడూ ? అసలు నీకు శూర్ప ణఖతో సరసాలేమిటి రామూ !

రాధ : (వస్తుంది) ఈమె ఎవరు ?

సీత : మండోదరి (నవ్వి) ఏం కోపమొచ్చిందా ? నీపేరుచెబితే గాని నా పేరు చెప్పను. చెప్పు.

రాము: కాదు రాధా !

సీత : స్సూ ! గప్‌చిప్. నీపేరుచెప్పు. చెప్పవా ?

రాధ : రాధ (భయపడింది)

సీత : రాధా...(నవ్వి) రాధా నీ వ్యధాపూరితగాథ నాకు బోధపడిందిలే, ఏం ఈమాటలంటే నీకు బాధా ?

రాము: మీరు కాసేపు వూరుకోండి.

సీత : అండి ! ఇదొక జీలిగబెండి !

రాము: మా ఫ్రెండ్ వస్తున్నాడని స్టేషన్‌కి వెళ్లా. రైలు వెళ్ళి పోయింది. ఉత్తరంలో వ్రాశాడుగా రాయల్ లాడ్జిలో వుంటానని. తీరా అక్కడికెడితే ఈమె గోపీ భార్యని తెలిసింది.

సీత : పాపం అంతకుముందు తెలీదు.

రాధ : మరి... ఇక్కడికెందుకు తీసుకురావడం ?

సీత : నీ కడ్డేమిటమ్మా !

రాము: అక్కడుండనంది. గోపీని చూడాలని గోలచేయడం ఆరంభించింది.

సీత : అవును. నిజభర్తను చూడాలని ఆవిడకి ఆత్రం కలగ డంలో ఆశ్చర్యం ఏముందీ ? అందుకే వచ్చాను. ఇదిగో అమ్మాయి ! గోపీ అనే అబ్బాయిని నువ్వు ఎరుగుదువా ? మనిషి మంచివాడే. బుద్ధిమాత్రం సుద్ద లాంటిది.

రాధ : ఏమిటీ మాటలు ?

రాము: రాధా ! ఈమెకు మతిస్థిమితం లేదు. రెట్టిస్తే మరీ

ఎక్కువౌతుంది. దిక్కులేని దానిలా భార్యను అక్కడ పడేసి ఎక్కడికిపోయాడో వాడు.

గోపి : (చేయి తుడుచుకుంటూ వచ్చాడు) ఇక్కడేవున్నారా!

రాము: అరె! ఎప్పుడొచ్చావ్ ?

గోపి : నువ్వు లాడ్జికి వెళ్ళి మా ఆవిణ్ని చూసేసరికి...

రాము: మా యింటికొచ్చి మా ఆవిణ్ని దర్శనంచేసుకున్నావ్.
(ఇద్దరూ నవ్వుతూంటారు. రాధ లోనికి వెళ్లింది)

రాము :చాల్లేరా వెధవ నవ్వులూ నువ్వూను.

గోపి : ఓహో! నీది మంచి నవ్వయినట్టు (సీతవైపు తిరిగి) ఏం సీతా నేనొచ్చేవరకూ లాడ్జిలోవుంటే బాగుండేదిగా.

సీత : అక్కడా వున్నాను. ఇక్కడా వున్నాను. ఎక్కడైనా వుంటాను. తప్పా ?

గోపి : తప్పొప్పులు తెలిసే స్థితిలో నువ్వుంటే, ఇక్కడకు రావలసిన పనే వుండేది కాదుగా –

సీత : చూడు! ఇక్కడకు వచ్చావని ఎలా మాట్లాడుతున్నాడో. నే నిప్పుడే వెళ్ళిపోతా (గోపి అడ్డు వస్తాడు)

గోపి : ఇక ఒక్కమాటకూడా అనను సీతా! ఇక్కడే వుందాం వెళ్ళకు.

సీత : ఒక్క క్షణం వుండను.

గోపి : క్షమించుసీతా! ఇక్కడ గొడవపడ్డం బావుండదు. నామాటవిను. లోపలకు పద.

సీత : నే నిక్కడుండనని చెప్పడంలేదు. అడ్డు తప్పుకో –

గోపి : (భరించలేక) సీతా!

సీత : చూడు ఎలా అరుస్తున్నాడో! ముట్టుకున్నావంటే మర్యాద దక్కదు తెలుసా!

గోపి : లోపలకు పద. ఊఁ...

సీత : నేను వెళ్ళను.

గోపి : (చేయిపట్టుకున్నాడు) రా! పోదాం లోపలికి.
(సీత భయంకరంగా అరచి సోఫాపై పడిపోయింది. అంతా ఆశ్చర్యంగా చూసారు. రంగనాథం పైనుంచి వచ్చి మెట్లమీద నిల్చాడు)

రాము: సీతా! సీతా!

గోపి : ఎందుకురా కంగారు. ఈ ఫిట్స్ కాస్సేపటికల్లా తగ్గిపోతాయి.

రాము: అరే బ్రూట్! ఎంతస్థాయిగా మాట్లాడుతున్నావురా. అన్నీ తెలిసిఇదా నువ్వుచేసేపని. వెధవ కేకలూనువ్వూను. (లోపలకుచూసి) సుబ్బయ్యా! సుబ్బయ్యా!

గోపి : ఒరే బ్రదర్! ఎందుకురా కంగారు?

రాము: నీలాంటి రాక్షసుణ్ణి కాదుకాబట్టి.

సుబ్బ: పిల్చారాబాబూ! (ఆత్రంగావచ్చాడు)

రాము: అర్జంటుగావెళ్ళి డాక్టర్నితీసుకురా.

గోపి : అవసరములేదు ఆగుసుబ్బయ్యా!

రాము: నేను వెళ్ళమనిచెబుతున్నాను వెళ్ళూ.

గోపి : అనవసరమని చెబుతుంటే వినవేంరా...

రాము: ఒరే నీకు బుద్ధివుందా లేదా?

గోపి : వున్నదే అది.

రంగ : కట్టుకున్నవానికిలేని కంగారు నీ కెందుకురా ?
(రాము చూసి కా స్త భయపడ్డాడు)

గోపి : తెలీదులెండి పాపం వాడికి. రామూ! మూర్ఛలో చాలారకాలున్నాయిరా. ఇదోరకం, వాళ్ళ దగ్గర అలవాటు పడ్డవాళ్ళకు ఏ ఆందోళనా వుండదు. చూడు "రాముణ్ని" వచ్చానని మెల్లగా అను.

రాము: అంటే.

గోపి : అనూ అంటున్నా చెవిదగ్గర...ఆఁ!

రాము: (దగ్గరకువెళ్లి) సీతా ! నేను రామూని వచ్చాను.

గోపి : రాముణ్ని ! ణ్ని !

రాము: ఏదన్నా ఒకటే లేవోయ్. సీతా ! రామూని, ఊహుఁ రాముణ్ని వచ్చాను.

సీత : (మెల్లగా కళ్లుతెరచి) రాముడివా - నారామూవే - ఎంతకాలంగా ఎదురుచూస్తున్నాను రామూ ! నన్ను విడిచి వెళ్లిపోవుకదూ ?

సుబ్బ : విచిత్రంగా వుందే.

గోపి : నూ్ ! విడవనని చెప్పరా.

రాము : అలాగే విడచివెళ్లను.

సీత : ఎప్పుడూ నాతోనే వుంటావుగా

రాము : (తండ్రిని చూశాడు భయం) చచ్చాం !

గోపి : అనరా—

రాము: నీతోనే వుంటాను.

సీత : మళ్ళీ మోసం చేయవుగా.

గోపి : చేయను: ఉహుఁ! (కంగారు) నువ్వనాలిరా !
రాము: చేయను. అన్నం తిందాంలే !
సీత : నాతో పాటు నువ్వుకూడా తింటావుగా—
రాము: (భయం) అలాగే ! పద !
సీత : ఎంతకాలానికి నా నోములు పండాయిరామూ (మీాదకు రాబోయింది)
రాము: మా నాన్నగారు !
రంగ : నేనున్నా ఫర్వాలేదురా ! వాళ్ళాయనున్నాడని చెప్పు.
సీత : ఎవరుంటే నాకేం ? నా రామూ నా అండగావుంటే ముల్లోకాలూ జయిస్తా రా! రామూ ! (చేయిపట్టు కుని లోనికి వెళ్ళింది)
రాము: (వెళుతూ) సుబ్బయ్యా !
రంగ : ఏదో జయిస్తాననంటోంది. నువ్వు వాళ్ళకి కాస్త అండగా వుండు సుబ్బయ్యా ! (సుబ్బయ్య వెళ్లాడు) చాలా విచిత్రంగా వుందే జబ్బు ! ఏం గోపీ ! మా 'రామూ' తెలుసా యీామెకు.
గోపి : ఎలా తెలుస్తుంది ?
రంగ : మరి రామూ అంటే...
గోపి : అదేకదండీ జబ్బు. ఆమె మహాపతివ్రత సీతట! రామూ కోసమే పుట్టిందట! ఆ పట్టాభిరామునికోసమే చూస్తుం దట ! హఠాత్తుగా నేను రావణాసురుడులా ఆమెని ఆ మాయదారి రాముడికి దూరంచేశానట.
రంగ : బాగుంది ! ఏం గోపీ ఈ అమ్మాయి నీ దగ్గరబంధువా ?

గోపి : (బాధగా) కాదండీ!

రంగ : ఓహో! మీనాన్నగారిష్టప్రకారం ఈ పెళ్ళి జరిగిందనుకుంటా.

గోపి : అదీకాదు. మా నాన్నగారుపోయి ఆరుమాసాలయింది. ఈపెళ్ళిజరిగి మూడుమాసాలే అయింది.

రంగ : అయితే మా రామూ పెళ్ళిసమయంలోనే నీపెళ్ళికూడా జరిగివుంటుంది. అయినా గోపీ! పిచ్చిపిల్లను పెళ్ళిచేసుకోవటమేమిటయ్యా?

గోపి : పెళ్ళిఅయిన తర్వాతనే ఈమెకు పిచ్చిపట్టిందండీ!

రంగ : అరె! పెళ్ళిచేస్తే పిచ్చికుదురుతుందంటారు. పెళ్ళయింతర్వాత పిచ్చిపట్టడం! చాలా విచిత్రంగావుందే!

గోపి : విచిత్రమేమీలేదూ. (బరువుగా) ఇలాజరగడం న్యాయంకూడానేమో; ఒకమూర్ఖుడికి మనసిచ్చినమ్మింది. దగాచేసి వాడు మరోపెళ్ళి చేసుకొన్నాడు.

రంగ : (ఆశ్చర్యం) ఆఁ!

గోపి : నేనొక అయోమయస్థితిలోవుండగా నా కళ్ళేదురుగానే ఈమె ఆత్మహత్యకుతలపడింది. కాపాడిననేరానికి ఈమె తండ్రి నన్నే పెళ్ళిచేసుకోమని కోరాడు. నా జీవితమేమైనా మరొకజీవిని బ్రతికించాలనే ఈ పనిచేసాను. తర్వాత ఈమెతండ్రి చనిపోయాడు. ఫలితంగా పెళ్ళినాడే యీామెకు పిచ్చిపట్టింది.

రంగ : ఏమైనా నువ్వు చాలా గొప్పపని చేసావు గోపీ!

(8)

ఇంతకూ నీ అయోమయ స్థితికి కారణం నాకు అర్థం కాలేదు.

గోపీ : క్షమించండీ ! నేనేం చెప్పలేను.

(రామూ కంగారుగా వచ్చాడు)

రాము: గోపీ ! అర్జంటుగా రావాలిరా !

గోపీ : ఏం ?

రాము: మళ్ళీ వచ్చిందిరా ఫిట్.

గోపి : మంత్రముందిగా.

రాము: నా మొఖముంది. నిన్ను రమ్మంటుంటే. నువ్వు దగ్గర లేకపోతే నాకు భయంగా వుందిరా !

గోపి : మంచి ధైర్యవంతుడివి. నువ్వేంభయపడకు. నేను చూచుకుంటాలే. (గోపీ వెళ్ళాడు. రామూకూడా వెళ్ళబోయాడు)

రంగ : రామూ !

రాము: (ఆగాడు)

రంగ : సీత నీకు ముందే తెలుసురా ?

రాము: నాకా ! ఎవరన్నారండీ !

రంగ : ఒకరనాలా ! నా అనుమానమే అడిగించింది. ఆమె నీకేమీ తెలియనప్పుడు ఇంత ఆందోళనపడ్డంలో అర్థం?

రాము: ఏదో అపాయంలో వున్నదని. . .

రంగ : హడావిడి చేస్తున్నావ్ . . . నన్ను మభ్యపెట్టలేవురా ! నిజం చెప్పలేకపోతే రహస్యంగానేవుంచు. కాని అబద్ధం మాత్రం చెప్పొద్దు. రాధ మీాద అయిష్టం! ఈమెమీాద

ఆప్యాయత! ఏమిట్రా యిదంతా ?

రాము: ఇప్పుడు నిజం చెప్పినా లాభంలేదు.

రంగ: ఓహో! అవసరమైనప్పుడు చెప్పలేకపోయానన్నేగా బాధ. నిజమే! చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకున్నా లాభంలేదు. మనం వైజాగ్‌లో వుండగానేనా ఈ గ్రంథాన్ని రచించింది. చెప్పరా. ఆఁ! ఈ అమ్మాయి నీ క్లాస్ మేటా ?

రాము: కాదు. మరోకాలేజీలో చదువుకొనేది. మన బంగళా వెనకాలే వీళ్ళయిల్లు. పెద్ద శ్రీమంతులుకారు. అప్పుడప్పుడు మనతోటలో పూవులు కోసం వస్తూండేది. (తన్మయత్వంలో తండ్రినే మరచి చెప్పుకుపోతున్నాడు) ఆమె ప్రవర్తన నన్నెంతో ముగ్ధుణ్ని చేసింది. ఒకనాడు పరధ్యాన్నంగా కూర్చున్నా. నా మీదకి పాము రాబోతుండగా 'కెవ్వు'న అరచి నన్ను ప్రక్కకు లాగింది. పాము వెళ్ళిపోయింది. నా ప్రాణాన్ని రక్షించింది. ఆనాటినుంచీ ఈమె నాకాబోయే భార్యగా మురిసాను. మనసిచ్చాను. పెళ్ళిచేసుకుంటానని మాటకూడా యిచ్చాను. ఆమె ఎంత ఆనందించిందో చెప్పలేను. కాని...కాని...

రంగ: చెప్పనంటూనే యింతవరకూ చెప్పావ్. చెప్పలేనంటూనే ఇంకా చెప్పబోతున్నావ్. చాలుగాని ఈ విషయం గోపీకి తెలుసా ?

రాము: తెలీదు. సీత గోపీభార్యఅవుతుందని నేనూఅనుకోలేదు.

రంగ : ఘనకార్యంచేసావ్ ! గుండెల్లోనే గుప్తపర్చుకో. వృథా ప్రయాసపడ్డావా గోపీకి అనుమానం కలుగుతుంది. ఆ తరువాత వచ్చే అపాయం నీకొక్కడికేకాదు. చాలా మంది అనుభవించాల్సి వుంటుంది. జాగ్రత్త!

(అంతకుముందే పాపయ్య వచ్చాడు)

పాప : అవ్వ ! రంగనాథం ! ఏది ? మొదటినుంచీ వింటే నా నా వెధవబుర్రకి కొంతైనా అర్థమయ్యేడ్చేది ! ఏది ? ఎవరిభార్యను మనరామూ ప్రేమించాడు ? (ఇకిలించాడు)

రాము: (బాధగా) మీ భార్యనుమాత్రంకాదు. (లోనికి వెళ్లాడు)

పాప : ఆఁ ! (అంటూ కుర్చీలో కూలబడ్డాడు)

(సుబ్బయ్య టీ ట్రేతో వచ్చాడు. మంచినీళ్ళిచ్చాడు)

పాప : (గడగడా త్రాగి) ఆ 'టీ'కూడా తగలెయ్యి.

సుబ్బ : ఇది అయ్యగారికిలెండి. తర్వాత తెస్తా.

పాప : (లేచాడు) ఇదుగో సుబ్బయ్యా ! ఏది ? నీకుకోపముంటే నిద్రపోతున్నప్పుడు బాకుతో నా గుండెల్లోపొడు. ఏదీ? అంతేకాని అసలు నాస్వవిషయం అందరితో చెప్పడంలో అర్థమేమిటీ అంట...

సుబ్బ : ఒకళ్ళసంగతి నా కెందుకు బాబూ !

పాప : ఏదీ ?

సుబ్బ : కందకు లేని దురద పెండ్లానికెందుకూ అంటున్నా...

పాప : అదిగో ఏదీ ? మళ్ళీ పెండ్లాం మాట ఎత్తుతున్నాడు చూడు రంగనాథం !

రంగ : (కష్టంగా) పాపయ్యా! (సుబ్బయ్యతో) ఆ 'టీ' పాపయ్య కివ్వు. తరవాత నాకు తీసుకురా. (సుబ్బయ్య కోపంగా యిచ్చి వెళ్లాడు)

పాప : ఏది ? నిజంగా నాకు తాగాలనిలేదు రంగనాథం !

రంగ : మానేయ్ !

పాప : అబ్బే! ఏది? నేను తాగకపోతే నువ్వు బాధపడతావుగా. (త్రాగేశాడు)

రంగ : గుమ్మడికాయలు దొంగంటే భుజాలుతడుముకున్నట్టు...

పాప : (ఆనందం) అయితే నా స్వవిషయం కాదన్నమాట...

రంగ : అదే! ఒకళ్ల విషయాలైతేమాత్రం చెప్పడానికి చెప్ప రానంత ఆనందం - నువ్వేకాదు. లోకుల విషయం చెప్పుకోవడంలో, లోకమే అలా మారింది లే. ఆ అబ్బాయి భార్య విషయమే మాట్లాడేది. ఆమె మనస్సు స్థిమితం లేదు.

పాప : అంటే పిచ్చి పట్టిందా ?

రంగ : అదే అనుకుంటాను.

పాప : శృతిమించితే అంతేలే రంగనాథం ! ఏది ?

రంగ : పాపయ్యా ! నువ్వేమీ అనుకోవద్దూ. నీ భార్య...

పాప : ఇదిగో రంగనాథమో !

రంగ : ఎంతదూరమైనా ఒకనాడు నీ భార్యేగా. ఆమెంటే అసలు నీకంత కోపం ?

పాప : కోపం ! ఏది ? పోలీసోళ్ళ భయమేస్తోంది కాని, లేక పోతే దాని ప్రాణాలు ఎప్పుడో తీసేవాణ్ణి కదూ! ఏది ?

జెండా ఎత్తింది ఎక్కడకన్నా పోకూడదూ? ఈవూళ్లో, నా కళ్లెదురుగానే డేరా వేసేయడమా?

రంగ : ఓహో! అందుకా కోపం. దాంపత్యం ఎలావున్నా కలిసి మెలిసి వున్నట్టు కనిపిస్తే.

పాప : దాని అందమే వేరు! ఏది? దాన్నెప్పుడైనా బాధపెట్టానా రంగనాథం? ఏది? పువ్వుల్లో పెట్టి పూజించాననుకో—

రంగ : అంత ప్రేమగా చూచిన నిన్ను ఎందుకు విడిచి పెట్టిందయ్యా?

పాప : కొవ్వు!... కొవ్వుబలిసి!... ఏది? అనుభవంమీద తెలుసుకున్నానులే రంగనాథం!

రంగ : ఏమిటది?

పాప : నెత్తిమీద పెట్టుకు పూజించేవాణ్ని చస్తే ప్రేమించ రనుకో. కొందరు ఆడాళ్లు బాగా చితకతన్నేవాడే కావాలి. ఏది? ఆ నౌబత్ రావుగాడు దాన్ని వేరే పెట్టాడా? కూచుంటే గుద్దు. నుంచుంటే గుద్దు. దాన్ని తాసామర్బాచేసి విడ్చిపెడ్తున్నాడనుకో— ఏది? వాడు తన్నుతున్నాడని విని నేను బాధపడుతున్నా. కాని దానికా... చీమకుట్టినట్టుకూడా లేదు. (తెలివిలో పడ్డాడు) ఇదుగో! రంగనాథం! ఇవన్నీ ఏదో ఆవేశంలో చెప్పేశాను. ఎక్కడా...

రంగ : చెప్పడానికెవరు మిగిలారయ్యా!

పాప : ఏది? అందరికీ వెల్లడై పోయిందన్న మాట.

రంగ : ఆసంగతి ఇంతవరకూ నీకు తెలియదన్న మాట.

రంగ : (కష్టంగా) పాపయ్యా ! (సుబ్బయ్యతో) ఆ 'టీ' పాపయ్య కివ్వు. తరవాత నాకు తీసుకురా. (సుబ్బయ్య కోపంగా యిచ్చి వెళ్లాడు)

పాప : ఏది ? నిజంగా నాకు తాగాలనిలేదు రంగనాథం !

రంగ : మానేయ్ !

పాప : అబ్బే! ఏది? నేను తాగకపోతే నువ్వు బాధపడతావుగా. (త్రాగేశాడు)

రంగ : గుమ్మడికాయలు దొంగంటే భుజాలుతడుముకున్నట్టు...

పాప : (ఆనందం) అయితే నా స్వవిషయం కాదన్నమాట...

రంగ : అదే ! ఒకళ్ల విషయాలైతేమాత్రం చెప్పడానికి చెప్ప రానంత ఆనందం – నువ్వేకాదు. లోకుల విషయం చెప్పుకోవడంలో, లోకమే అలా మారింది లే. ఆ అబ్బాయి భార్య విషయమే మాట్లాడేది. ఆమె మనస్సు స్థిమితం లేదు.

పాప : అంటే పిచ్చి పట్టిందా ?

రంగ : అదే అనుకుంటాను.

పాప : శృతిమించితే అంతేలే రంగనాథం ! ఏది ?

రంగ : పాపయ్యా ! నువ్వేమీ అనుకోవద్దూ. నీ భార్య...

పాప : ఇదిగో రంగనాథమో !

రంగ : ఎంతదూరమైనా ఒకనాడు నీ భార్యేగా. ఆమెంటే అసలు నీకంత కోపం ?

పాప : కోపం ! ఏది ? పోలీసోళ్ళ భయమేస్తోంది కాని, లేక పోతే దాని ప్రాణాలు ఎప్పుడో తీసేవాణ్ణికదూ! ఏది ?

జెండావెత్తింది ఎక్కడకన్నా పోకూడదూ? ఈవూళ్లో, నా కళ్లెదురుగానే డేరావేసేయడమా?

రంగ : ఓహో! అందుకా కోపం. దాంపత్యం ఎలావున్నా కలిసి మెలిసి వున్నట్టు కనిపిస్తే.

పాప : దాని అందమే వేరు! ఏది? దాన్నెప్పుడైనా బాధపెట్టానా రంగనాథం? ఏది? పువ్వుల్లో పెట్టి పూజించాననుకో—

రంగ : అంత ప్రేమగా చూచిన నిన్ను ఎందుకు విడిచి పెట్టిందయ్యా?

పాప : కొవ్వు!... కొవ్వుబలిసి!... ఏది? అనుభవంమీద తెలుసుకున్నానులే రంగనాథం!

రంగ : ఏమిటది?

పాప : నెత్తిమీద పెట్టుకు పూజించేవాణ్ని చస్తే ప్రేమించ రనుకో. కొందరు ఆడాళ్లు బాగా చితకతన్నేవాడే కావాలి. ఏది? ఆ నౌబత్ రావుగాడు దాన్ని వేరే పెట్టాడా? కూచుంటే గుద్దు. నుంచుంటే గుద్దు. దాన్ని తాసామర్బాచేసి విడ్చిపెడ్తున్నాడనుకో— ఏది? వాడు తన్నుతున్నాడని విని నేను బాధపడుతున్నా. కాని దానికా... చీమకుట్టినట్టుకూడా లేదు. (తెలివిలో పడ్డాడు) ఇదుగో! రంగనాథం! ఇవన్నీ ఏదో ఆవేశంలో చెప్పేశాను. ఎక్కడా...

రంగ : చెప్పడానికెవరు మిగిలారయ్యా!

పాప : ఏది? అందరికీ వెల్లడైపోయిందన్నమాట.

రంగ : ఆసంగతి ఇంతవరకూ నీకు తెలియదన్నమాట.

పాప : అంటే. నా పరువూ ప్రతిష్టా నాశనమయ్యాయంటావ్.
రంగ : లేనివి ఉన్నయనుకోవటం అంతమంచిదికాదుపాపయ్యా!
పాప : ఏది ? అదిలేనివాణ్ని నేనొక్కడ్నే నన్నమాట ! ఇదుగో రంగనాథం ! ఏది ? ఈవీది చివర్నించి ఆవీధి ఆఖరువరకు టార్చిలైటువేసి పంచాంగం విప్పానంటే...
రంగ : (కోపం) పాపయ్యా !
పాప : ఏది ?
రంగ : నువ్వు మర్యాద స్తుతివేనయ్యా ! లేకపోతే ఇంతబాధెం దుకు పడతావ్.
పాప : లక్షలు ఖరీదుచేసే మాటన్నావ్ ఏది ? అయినకుటుంబంలో పుట్టానా ? ఆక్టింగ్అయితేమాత్రం కలక్టరాఫీసులో హెడ్‌క్లర్కుపదవి వెలిగించానా ? లంచం తీసుకున్నానని కిట్టనివాడు డిస్మిస్‌చేస్తేమాత్రం పదిమందిలో పెద్దమనిషిలా ఎన్నికయ్యానంటావా లేదంటావా? ఏది? ఈనాడు దాన్నిగురించి నా మనస్సులో ఎంతకుళ్ళిపో తున్నానో నీకేంతెలుసు రంగనాథం !
రంగ : జరిగిందేదో జరిగింది. లేనిపోనిది వాళ్ళను వీళ్ళను వీధిని పడాస్తావెందుకు ? వెనకటికి ఓ సామెతుందిలే, తాజెడ్డ కోతి వనమెల్లా చెరిచిందని.
పాప : ఇదిగో రంగనాథం ! నువ్వు ద్వంద్వంగామాట్లాడి నా కొంపతీస్తున్నావ్. నాకసలు పరువు, మర్యాద, లేదని నీ వుద్దేశమా ? ఏది ? రకీమని ఒక్కమాటలో తేల్చు.
రంగ : (నవ్వి) ఎందుకుపాపయ్యా ! అంతబాధపడతావ్. ఆ

పదాలకే పరువు మర్యాదా ఏనాడో పోయింది...

పాప : ఇది మరీ జటిలం.
(నవ్వుకుంటూ 'సీత' పిచ్చిగా వచ్చింది. వెనకాలే రామూ వున్నాడు)

రాము: సీతా! మానాన్నగారు!

సీత : నమస్కారమండీ.

రంగ : ఎలాగుందమ్మా!

సీత : ఏమిటీ ?

రంగ : నీ ఆరోగ్యం.

సీత : ఆఁ!

పాప : (రంగనాథంతో) పిచ్చమ్మా యన్నావ్ ఈఅమ్మాయేనా? ఏది ? వాలకం చూస్తే అలాగేవుంది.

సీత : (హఠాత్తుగా) పిచ్చి! నీకుపిచ్చి! మీ అమ్మకిపిచ్చి! నీ పెళ్లానికిపిచ్చి!

పాప : (కోపం) ఇదుగో అమ్మాయ్ ఏది ? నేనసలూ...

సీత : మనిషివి కాదా ?

పాప : ఇదేవిటి రంగనాథం!

సీత : అదే సింగినాథం ...

పాప : ఇదుగో అమ్మాయ్! నాకు కోపంవస్తే ఏది ? ఆగనే ఆగదు. ఎంతచెడ్డా పెద్దా చిన్నా తారతమ్యం చూసుకు మాట్లాడాలి.

సీత : డబ. డబ. డబ. డబ్బా!...ఫో యింటికి —

పాప : నిలబడి చూస్తావేమయ్యా రంగనాథం!

రంగ : నాకు పిచ్చి పట్టలేదు.

పాప : మరి నాకు పట్టిందా ?

సీత : నీకే పట్టింది. వెళతావా లేదా? లేకపోతే ముక్కులాగేస్తా! కళ్లు పీకేస్తా! కాళ్లు విరగగొట్టేస్తా. (కేకలువిని గోపీ వచ్చాడు)

పాప : బాబోయ్! (కొంతవరకు వెళ్ళి ఆగి) రాత్రి భోజనానికి వస్తా! ఈ అమ్మాయిని లోపలే వుంచాలి సుమా! ఏదీ?

సీత : పట్టుకో దొంగని. (పాపయ్య పారిపోయాడు)

రంగ : ఇలా చేయటం బావుండలేదమ్మా!

సీత : బాగంటే ఏమిటీ ?

రంగ : ఇది మరీ బావుంది. గోపీ ఈమెను హాస్పిటల్‌కు తీసుకెళ్ళడం మంచిదేమో!

సీత : నేను రానుగా —

గోపి : సీతా పెద్దవారి దగ్గర అలా మాట్లాడకూడదు.

సీత : అసలు నేను మాట్లాడనుగా.

గోపి : మరి ఆసుపత్రి కెడదాంపద...

రంగ : కారు కూడా సిద్ధంగావుంది. రామ్మా!

సీత : (కొంతవరకూ వెళ్ళి ఏడ్చింది. భయపడింది.) నేను రాను. నాకు భయమేస్తుంది. నన్ను చంపడానికి తీసుకెడుతున్నారు. నేనీ యింట్లోంచి కదలను నన్ను తీస్కు వెళ్ళద్దు. మీకు నమస్కారం పెడతాను. (లోనికి పారిపోయింది)

రాము: సీతా ! (వెనక వెళ్లబోయాడు).

రంగ : రామూ! ఆడవాళ్ళకి ఆడవాళ్ళే సహాయంగావుండాలి. ఆ బాధ్యత రాధ తీసుకుంటుంది. గోపీ! నేను వెళ్ళి వివరాలుచెప్పి డాక్టరుతో సంప్రదించి వస్తాను.

గోపి : మీకు చాలా శ్రమిస్తున్నాను.

రంగ : అలవాటుగా ఏర్పడ్డవాక్యం అది. దీనికి అర్థంలేదనను. కాని నిజంగా ఇది శ్రమకాదు. ఆమె మనస్సు బాగు పడితే మన మనస్సులూ బాగుపడతాయి. శరీరశ్రమ కన్నా మనోశ్రమే ఘనమైంది గోపీ! (సుబ్బయ్యతో) రా! సుబ్బయ్యా! (సుబ్బయ్య, రంగనాధం వెళ్లారు)

గోపి : మీనాన్న చాలా తెలివైనవాడురా!

రాము: ఆ. ఆ. అందుకే నేనిలా తయారయ్యాను.

గోపి : తండ్రి తెలివైనవాడైతే బిడ్డ గర్వించాలిగదరా!

రాము: ఆ తెలివి బిడ్డలమీద ఎక్స్పరమెంట్ చేస్తే నాలాంటి దద్దమ్మలు తయారౌతారు.

గోపి : నువ్వు దద్దమ్మ వటరా?

రాము: నీకు తెలీదు గోపీ! ఆయన ముందు మాట్లాడటమే పెద్ద భయం! మాటకి పదర్థాలుతీస్తారు. మనిషి చూపు లోనే ఏదో శక్తివుంది. ఆయన బిగ్గరగా మాట్లాడితే మనవాయిస్ బంద్! ఎర్రగాచూస్తే చమట్లుపడతాయి. మాట్లాడలేను.

గోపి : (నవ్వుతాడు)

రాము: నీకు నవ్వుగానే వుంటుందిలే.

గోపి : ఏడవలేక నవ్వారా! అంతే; నీఅవస్థ నాకు తెలుసు

లేరా. ఈ కారణంగానేకదూ? ప్రేమించి పెళ్లాడతానని చెప్పి ఒకమ్మాయిని దగాచేసావు.

రాము: నేనా!

గోపి : సూటిగాచూడరా. గుండెలమీద చేయివేసుకుని యదార్థంచెప్పు. సీత బ్రతుకుని బుగ్గిపాలుచేసింది నువ్వేకదూ! ఆమెతండ్రిచావుకీ సీతయిలాకావడానికి కారణం నువ్వే కదూ!

రాము: నీకెలా తెలుసు?

గోపి : నువ్వు చెప్పకపోతే తెలీదా! తెలుసుకోలేనా! అసలు ఆమెను నేను పెళ్ళి చేసుకోడానికి కారణం ఏమని వూహించావ్!

రాము: అదే నాకర్థంకాలా!

గోపి : అందుకే మీ నాన్నముందు గొర్రెవయ్యావ్.

రాము: గోపీ!

గోపి : కోపం బాగావుంది. కాని పాపభీతిలేదు.

రాము: ఎందుకుచేసుకున్నావో చెప్పరా!

గోపి : నీ కోసం.

రాము: ఆఁ!

గోపి : నువ్వు చేసిన పాపానికి శిక్షింపబడింది నేనురా! ఒక విధంగానే కాదు. నేనూ నీలాగే ఒకామెకు హృదయార్పణచేసాను. నీలాగే నన్నూ ఆమె ద్రోహంచేసింది. మరొకణ్ని పెళ్లి చేసుకుంది. ఆమె గురించి కలలుకన్నాను. అన్నీ కరిగిపోయాయి. హతాసే మిగిలింది. బ్రతుకు

మీద ఆశపోయింది. ఎటుచూచినా అంధకారమే. ఇక జీవించడం నేరమను కున్నా, తిన్నగా నదివొడ్డుకి వెళ్లి ప్రాణాలు విడవాలను కున్నా.

రాము: చెప్పరా తర్వాత

గోపి : ఏముంది ? ఆ క్షణంలోనే నేను చేయఃబోయే పని సీతే చేసింది. హఠాత్తుగా నదిలో దూకింది. ఆమెను బ్రతికించడానికి నేను బ్రతకడంతప్పని సరైంది. చేతులమీద ఆమెను వాళ్లింటికి చేర్చాను. చావు బ్రతుకుల్లో వున్న ఆమె తండ్రి నా చేతులు పట్టుకుని కన్నీరుకార్చాడు. ఒక నీచుడు తనబిడ్డ బ్రతుకుని నాశనం చేసాడని వాపోయాడు..

రాము: ఇంతకూ...

గోపి : ఏముంది; నామిత్రుడు చేసిన పాడుపనికి కృంగిపోయాను. ముసలివాని మనశ్శాంతికోసం సీతను బ్రతికించడంకోసం నేను ఆమెను పెళ్లి చేసుకుంటానని వాగ్దానం చేసాను. ఆ మాటే ముసలివానికి అమృత ప్రాయమైంది. సీత వుద్దేశాన్ని యెవరము తెలుసుకోలేదు. ఆ కంగారులో మంగళసూత్రం కట్టాను. అది కళ్లారాచూసి సంతృప్తిగా ఆమె ముసలి తండ్రి కన్నుమూసాడు. వెంటనే స్పృహ తప్పి పడిన సీత, మతితప్పిన మనిషై బ్రతికింది.

రాము: గోపీ! నిజంగా నువు మనిషివేనా ? స్నేహానికింత విలువిచ్చే వ్యక్తులింకా వున్నారా ? నిజంగా నా మతి పోయిందిగోపీ! ఇప్పుడు నన్నేం చెయ్యమంటావ్ ?

గోపి : నాకూ అదే అర్థంకావడంలేదు. ఆమెను తీసుకురావట మైతే తీసుకొచ్చాను. నిన్ను చూడగానే ఆమెకు గతం కు ర్తుకువచ్చి మతి మామూలుస్థితిలో పడుతుందను కున్నాను. రామూ! మీరిద్దరూ మనసిచ్చి మసలు కొన్న మధుర ఘడియలు ఏమైనా పునశ్చరణచేస్తే...

రాము: (భయం) ఇక్కడా?

గోపి : మీ నాన్నగారుకూడ లేరు. రాధకూడా స్త్రీయే కాబట్టి అపార్థం చేసుకోదనుకుంటాను.

రాము: గోపీ !

గోపి : చాటుగా అయితే ఎంతటి నీచానికైనా దిగజారడం, ఎదురుగా ఎవరైనా వున్నారంటే పెద్దమనుషులుగా పోజుపెట్టడం, దీనికట్రా నువ్వు అలవాటుపడ్డవి.

రాము: ఛ! ఛ! నన్ను మిస్ అండర్‌స్టాండు చేసుకున్నావురా.

గోపి : లేదురా! రోగినిబట్టి డాక్టర్‌కూడ ఒక్కోసారి యాక్టర్‌గా మారాలి. రోగి అనాదరణకు లోనై అనారోగ్యానికి గురైనప్పుడు ఆదరణ, ఆప్యాయతే ఆమెకు, మందు కన్నా ముందుగాపనిచేస్తుంది. ఆశయం పవిత్రమైందయి నప్పుడు ఆచరణలో తాత్కాలికమైన లోపాలున్నా అవితప్పుగా లెక్కలోకిరావు. అందుకేచెబుతున్నాను. మీ యిద్దరి జీవితగ్రంథంలో జరగనీ, చెరగనీ...పుట లేమైనావుంటే పఠించు. అదే ఆమెకు దివ్యౌషధం కావచ్చు.

రాము: నిజమేరా! నదీతీరంలో, పచ్చనిచెట్లలో పుచ్చపువ్వు ల్లాంటి వెన్నెల్లో పాడుకుంటూవుంటే వచ్చి, తనవెచ్చని

హృదయాన్నిచ్చి, తాను ఈ లోకాన్నే మరచి ఆడిం
చింది పాడించింది సీత...

పాట

రాము: నా మనసే– నీమనసూ !
నీవలపే– నా తలపూ !
ఆ రేయీ– ఆ వెన్నెలా
మరచేదెలా– నా జవరాలా !
(సీత దూరంనుండి వింది. మెల్లగావచ్చింది)
ఏనాడు వీడనీ– ఎడబాటే లేనీ
వెలుగునీడలా– పూవూ తావిలా
వుందాము ఏకమై
అందాల బృందావనానా
ఆనంద సుందరవనానా ! ॥ఏనాడు॥

(సీతకి ఆపాటవింటూ తన్మయంలో తనూపాడుతుంది)

సీత : నా మనసే– నీ మనసూ
నీవలపే– నా తలపూ !
ఆ వెన్నెలతోటా– ఆపూలబాటా
కన్నులవిందుగా– కలలూకందుమా
(గోపీ ఆనందంగాచూస్తూ లోనికివెళ్ళాడు)
వుందాము ఏకమై
అందాలబృందావనానా
ఆనంద సుందరవనానా ! ॥నామనసే॥
(ఇద్దరూ తన్మయులయ్యారు)

రాము: సీతా !... సీతా !...

సీత : ఆఁ.

రాము: ఆనాడు మనమిద్దరం ఆనందంగా గడిపినరోజులు గుర్తు కొచ్చాయా సీతా !

సీత : ఆఁ.

రాము: ఒకళ్ళనొకళ్ళు విడిచినక్షణం ఒకయుగంగా, బాధగా గడిపిన ఆ రోజులు పూర్తిగా మర్చిపోయావాసీతా !

సీత : నేనా ?

రాము: కాదా !

సీత : నువ్వేమర్చిపోయావు రామూ ! నీ కోసం నన్ను నేనే మర్చిపోయాను. ఆనాడు మీనాన్నగారితో కలిసి మా వూరువిడిచి వెళ్ళిన తర్వాత నాకంతా శూన్యమైంది రామూ ! మళ్ళీ నువ్వువస్తావని, మనసారా చూడాలని ఒళ్ళంతా కళ్ళుచేసుకుని ఎదురుచూశాను రామూ !

రాము: నిజమే సీతా ! నాన్న అధికారయ్యారు. నాకు ఇల్లే జైలయింది. నా శరీరంతోపాటు నా యిష్టాల్ని, ఆలో చన్ని ఖైదు చేశారు. నేను తింటున్నానో లేదో, నాకంటి మీద నిద్దరుందో లేదో చూచేవారెవరు? అమ్మే వుంటే ఆ బాధ్యత తీసుకునేది. నాకా అదృష్టం లేదు. అయినా అమ్మవుంటే నువ్వునాకు దూరం కాలేవు సీతా !

సీత : లేని అమ్మకన్నా, ఉన్న నాన్నే మంచివారేమో !

రాము: సీతా !

సీత : అవునురామూ ! మీనాన్నంటే నీకెందుకంత భయం ? కొడతాడా ?

రాము: లేదు తిడతాడు.

సీత : తిట్టుకు వట్టుకు భయపడేదీ ఒక్క ఆడవాళ్లేఅనుకున్నాను.

రాము: నువ్వేమనుకున్నా ఇబ్బందిలేదుసీతా !

సీత : రామూ ! నీకన్నా మీనాన్నే మంచివారేమో ? (మనిషి మారింది) నువ్వు నీచుడివి. రాక్షసుడివి. నా తండ్రిని చంపి నా జీవితాన్ని సర్వనాశనం చేసిన దుర్మార్గుడివి. నిన్నేంచేసినా పాపంలేదు.

రాము: సీతా !

సీత : (కోపం) ఔను ! నీలాంటి నీచులు ఎంతమంది మాన వతుల జీవితాలను బుగ్గిపాలుచేస్తున్నారో ఉదాహరణకు నా ఒక్క జీవితంచాలు. నిన్నేం చేసినా పాపంలేదు. నిన్ను బ్రతకనివ్వను. నిన్నూ ... నిన్నూ...

గోపి : (పరుగున వచ్చాడు గోపి) సీతా!... సీతా!... (పట్టుకున్నాడు)

(సీత కెవ్వున అరచి ఫిట్ వచ్చి సోఫాలో పడింది)

గోపి : ఏం జరిగింది ? (రాధకూడా వచ్చింది)

రాము: హఠాత్తుగామారిపోయింది. నిజంగా భయంగావుందిరా!

గోపి : అసలే పిరికివాడివి. భయపడ్డంలో పెద్ద ఆశ్చర్యంలేదు.

రాము: గోపీ !

గోపి : ఏం ? కోపమొచ్చిందా? మంచిదే. అదే పౌరుషంగా మారితే నీ ఆరోగ్యమే బాగుపడుతుంది. (తిన్నగా సీత దగ్గరకు వెళ్ళాడు) సీతా! సీతా! నీ రామూ వచ్చాడు చూడు.

సీత : (మూర్ఛనుండి లేచింది) రామూ! నా రామూవే

గోపి : ఇప్పుడైనా అర్థంచేసుకున్నావట్రా.

సీత : ఏయ్! నా రామూని ఏమన్నా అంటే నేను వూరుకోను తెలుసా ?

గోపి : రాధా ! ఈమెను లోపలికి తీస్కువెళ్లు.

సీత : ఒకళ్లు నన్ను తీసుకెళ్లే దేమిటి. నాకేంభయమా ? నేనే వెడతాను. (వెళ్ళింది)

(గోపి బరువుగా నిట్టూర్చాడు)

రాధ : చాల విచిత్రంగావుంది. ఆమె స్థితికి ఎవరు కారణమో; వాళ్ళకులేని బాధ నీకెందుకు గోపీ !

రాము: నీ సలహా ఎవరూ కోరలేదు.

రాధ : కోరకపోయినా ఒకస్త్రీ అన్యాయానికి గురైతే అడగటానికి మాలాంటి అందరికీ అధికారముంది.

గోపి : రాధా! మీా ఘర్షణకిది సమయంకాదు. ప్లీజ్... రామూ ! నేను ఒక్కటే కోరుతున్నా. నేనిక్కడినుంచి వెళ్ళిపోతా. సీతను నీదగ్గరే అట్టిపెట్టుకో.

రాము: నా దగ్గిరా !

గోపి : మరి.

రాము: ఇంపాస్‌బుల్ !

గోపి : (కోపం) రామూ !

రాము: అవునురా ! ఆమె అంటే నాకు ప్రేమఃంది. కావాలంటే ప్రాణాన్ని కూడా యిస్తా. కాని ఈ స్థితిలో నేనుమాత్రం ఎలా కాపాడ గలను ?

గోపి : ఇంతకన్నా మరొక మార్గంలేదురా ! నీగురించి యిన్ని

విధాల నాశనమైన నాగురించికాదు. ఆమెగురించి నిన్ను చేతులు పట్టుకొని అర్థిస్తున్నా...ఒక్క నెలరోజులు...

రాము: నీకూ్కడా మతిపోయిందా ?

గోపి : నీకు హృదయం లేదురా ?

రాధ : అది ఏనాడో రాయిగా మారింది.

రాము: రాధా !

గోపి : ఆమె అన్నమాటల్లో తప్పేముందిరా బ్రూట్ !

రాము: జాగర్తగా మాట్లాడరా గోపి !

గోపి : నిన్ను అజాగర్తగా సమాధానం చెప్పద్దంటున్నా.

రాము: ఆవిషయం నన్నడగవద్దు. మా నాన్నగారిసంగతి నీకు తెలీదు.

గోపి : రామూ !

రాము: నేనుచేయలేను.

గోపి : రామూ ! (చొక్కాపట్టుకున్నాడు కోపంతో చేయెత్తాడు) (అప్పుడే రంగనాథం, సుబ్బయ్యావచ్చారు. అంతా నిర్ఘాంతపోయారు)

గోపి : అయామ్‌సారీ. (ఎత్తినచేయి దించాడు)

రంగ : ఏంజరిగింది ? రాధా ! (అందర్నీ పరిశీలనగాచూశాడు) అరె ! ఎవరూ మాట్లాడ రేం ? సరే ! సుబ్బయ్యా అవసరమై అడిగినప్పుడు వెంటనే యివ్వు. (రివాల్వరు యిచ్చాడు)

గోపి : మా సమస్య అంతవరకూ పోదులెండి.

రంగ : ఛ ! ఛ ! నేను అనుకుంటానా ? అయినా ఈపిస్టలు నీకోసమే సిద్ధంగా వుంచానని నువ్వెందుకనుకోవాలి ?

మరొకళ్ళకోసంకూడా కావచ్చుగా (రాధభయం) లేదా! నాకే అవసరం కావచ్చు!

రాము: నాన్నా!

రంగ: మరేం భయంలేదు. ఆఁ గోపీ! ఉదయమే మీ ఆవిణ్ని డాక్టరు తీసుకురమ్మన్నాడు. (గంభీరంగా) ఒక పగలు పూర్తికాబోతుంది. రాత్రి మిగిలింది. అంతా జాగ్రత్తగానే వుంటారని తలుస్తాను. తిరిగి మనమంతా వెలుగు చూడ్డానికి ప్రయత్నిద్దాం. (మెల్లిగా కదులుతూ)

గోపి: మీమాటలు అర్థంకావటంలేదు.

రంగ: కాని వ్యర్థమైన మాటలుకావు గోపీ! నీ రాకలో వుండే రహస్యం ఏమిటో నాకు తెలీదు. కాని నాకు తెలిసిందల్లాఒక్కటే. అగ్నిసాక్షిగా పెళ్లాడినతర్వాత ఎవరైనా దాంపత్య ధర్మాన్ని నిర్వర్తించవలసిందే; స్వార్థమెంత భయంకరమైందో, ఒకోసమయంలో త్యాగంకూడా అంతే భయాన్ని కలిగిస్తుంది. దానివల్ల లాభనష్టాలు నేను అంచనా వేయడల్లేను. ఏది శృతిమించినా అపాయమని మాత్రం హెచ్చరిస్తున్నాను!... నా యింట్లో ధర్మవిరుద్ధంగా ఏమి జరిగినా సహించనని పరాకు చెబుతున్నాను!... (కొంతవరకువెళ్ళి) సుబ్బయ్యా! అజాగ్రత్తగా వున్నావా పక్షులవిషయంలో నువ్వు అపాయానికి గురి అవుతావు జాగ్రత్త... (వెళ్లాడు)

లైట్లు ఆరాయి.

తెరపడింది.

విశ్రాంతి.

## రాత్రిభాగం

మొదటిరంగంలాగే వుంటుంది. పెద్దమార్పేమీవుండదు. అయితే యిదిరాత్రి. ఇంట్లో కరెంటులైట్లు వెలిగుంటాయి. ఒక చిన్నటేబిల్, దానిపై చదరంగంవుంది. అటు యిటు రంగనాథం, పాపయ్య కూర్చుని శ్రద్ధగా ఆడుతున్నారు. గోపి ఎదురుగావున్న మధ్యగుమ్మం ప్రక్కన నీడలో ఒక చోట నిలచి విషాదపూరితంగా పాట పాడుతుంటాడు.

గోపి : పాట

సాకీ : ఏది సుఖం ?
ఏది దుఃఖం ?

పల్లవి: సుఖ దుఃఖముల- చిత్రగమనమే
రాత్రిపగలుకు- యాత్రాస్థలమా !

వేదనలోనే మోదమా- బాధలలోనే సుఖమా
చీకటిలోనే వెలుగా- చూచినవారే ధన్యులా !
గతము మరచే మతమే - మానవజాతికి గమ్యమా
పూజించిన ఆప్రతిమే - పాషాణమనా న్యాయమా !
ప్రేమించిన ఓపడతీ - పయనించేవా జగతీ
మరచేవా మధురానుభూతీ-మనుటే సుఖమా యీగతీ!

(ఆపాటువింటూ రాధ మెల్లగా గుమ్మంలోంచే బాధగా ముందుకు వచ్చింది. ఆమెకళ్ళల్లో నీళ్లుతిరిగాయి. పాట పూర్తికాబోయేముందు ప్రక్కగదిలోనుంచి రాము విసుగ్గా, విసురుగావచ్చి రాధస్థితిగమనించాడు. ఒక రకమైన అనుమానం దానితో ఆవేశం తలెత్తింది.)

రాము: గోపీ !

గోపి : ఏరా

Acc NO. 11351



రాము: ఏం లేదు...ఇప్పుడు పాడుతున్నావేం ?
గోపి : ఎప్పుడు పాడాలో నిర్ణయం లేక
రాధ : అతను పాడితే నీ కెందుకు ?
రాము: నాకెందుకో తరువాత చెబుతాను. ఆపాటవిని నీకెందుకు దుఃఖం పొంగుకొచ్చింది ?
రాధ : వచ్చింది. అనుకోకుండానే వచ్చింది.
పాప : నీ గుణ్ణం చచ్చింది. (ఆటశ్రద్ధతో)
రాము: పాపయ్యగారూ ?
పాప : అయ్యోరామా ! ఏదో కొంపలంటుకున్నట్లు అరుస్తావేం ? ఏది ? మే మాడుకుంటూంటే...
రాము: మీరు ఆడుకుంటున్నారు. మా ఫ్రెండ్ పాడుకుంటున్నాడు. ఇక్కడ నిద్రపట్టక చావల్సింది మేము.
రంగ : (లేచాడు) మేమాడుకుంటున్నది నిజమే; ఇంతవరకూ పాడింది రేడియోకదూ ! ఎవరూ అంత అద్భుతంగా పాడిందీ ?
గోపి : ఆ నేరం చేసింది నేను[illegible]
రంగ : నేరమూ !
రాము: కాక అర్ధరాత్రిపూట పాటేమిటండీ.
రంగ : పిచ్చినాయనా! ఆటకూ, పాటకూ అర్ధరాత్రే[illegible]రా.
రాధ : అర్ధరాత్రికాదు. అయింది పదిగంటలే.
పాప : అయితే ఆట ఎలాగా ఆగింది కాబట్టి... ఏది ? నువ్వు మరొక్క పాట పాడొచ్చునాయనా.
రంగ : చక్కటి సూచన. కానీ గోపీ—
రాము: నాన్నగారూ !

V. R. NARLA MEMORIAL LIBRARY
V.R NARLA
D.P.R.I.
Acc. No.

రంగ : అతను పాడితే నీకెందుకురా ?

రాము: నాక్కాదు. ఏడుపొచ్చిందీ మెకు.

రంగ : గోపీ పాడితే రాధ దుఃఖించడమెందుకు ?

రాధ : బాగుందనే ఏడుపు నాక్కాదు... (లోనికి వెళ్ళింది. సుబ్బయ్య అంతకుముందే వచ్చాడు)

సుబ్బ: (గోపీతో) పొద్దుపోయింది బాబూ! భోజనానికి లేస్తారా?

రంగ : గోపీ! నువ్వూ రామూ కలసి భోజనం చేశారనుకున్నానే.

గోపి : లేదండీ. నాకు ఆకలిగా లేదు.

రంగ : సరే! నీ యిష్టం.

రాము: ఏరా! భోజనం మానవలసిన అవసరమే మొచ్చింది ?

రంగ : ఆకలి కావడంలేదని చెప్పగా విన్నావు గదరా.

రాము: మీకు తెలియదు నాన్నగారూ! వీడికి నామీద చాల కష్టం కలిగింది.

గోపి : అందుకు అన్నం మానేసంటావ్ ? అదికూడా మంచి దేరా, మనసులో కష్టంగా వున్నప్పుడు, మనలో అసహ్యామైనకోపం తలెత్తినప్పుడు, భోజనం మానడమే చక్కటిమందు.

రంగ : చక్కగా చెప్పావ్ నాయనా! రామూ! నీలా అన్నం మీద కోపగించే తత్వం అతనిలో లేదనుకుంటా. నిద్ర పాడవుతుందన్నావ్... వెళ్ళిపడుకోరాదూ!

రాము: సరే! (విసురుగా లోనికి వెళ్లాడు)

పాప : ఇకనువ్వు పైకి వెడతావా రంగనాథం ? ఏది ?

రంగ : పైకి వెడదామనుకుంటూనే కూర్చున్నా. ఆరోజు ఎప్పుడొస్తుందో పాపయ్యా!

పాప : అయ్యోరామ!... ఏప్పైకి ?... మేడమీదకయ్యా !

రంగ : ఓహో! అలాగా ! ఆఁ సుబ్బయ్యా ! గోపీ యికభోజనం చెయ్యడు. నీ పని నువ్వు చూసుకో. పాపయ్యా ! నీ భోజనం అయిందిగా.

పాప : అయ్యోరామ! ఏది ? నీతో నేకదయ్యా భోజనంచేసింది. అంటే పట్టి భోజనానికే వస్తున్నానంటావ్.

రంగ : అంతేకాదులే. 'ఛస్' ఆడడానికికూడా.

పాప : నిజంచెప్పావ్ రంగనాథం- వెధవది మనస్సుందిచూసావ్ ...ఏది ? మరొక్కఆట ఆడాలనిపిస్తుంది- ఏది ?

రంగ : 'ఛస్'

పాప : బస్ ! ఒక్కఆటచాలు.

రంగ : సరే! మనకు ఉదయం పనీపాటు ఏమీలేదుగా...... సుబ్బయ్యా ! ఇవితీసికెళ్ళి పైనపెట్టిరా. చూడు. పాపయ్యకికూడా ప్రక్కఏర్పాటుచెయ్యి. (సుబ్బయ వెళ్లాడు)

పాప : ఏది ? చచ్చి నీకడుపునపుడతాను రంగనాథం.

రంగ : ఎందుకూ ? పుట్టినవాళ్ళంతా ఉద్ధరిస్తున్నారుగనుకనా.. ...పైగా నువ్వు తిరిగిపుట్టేఛాన్సు ఏదయ్యా !

పాప : ఏది ?...అవును. భార్యావిహీనుడవు కదూ !

రంగ : నడేలే... భార్యలుండికూడా లేనివాళ్లెంతమందయ్యా!

పాప : ఇదిగో రంగనాథం...ఏది ? మళ్ళీ నన్ను...

రంగ : అవమానిస్తున్నానంటావ్. నీవేకాదుపాపయ్యా ఆలాంటివాళ్లు లోకంలో చాలామంది వున్నారు.

గోపి : ఇక్కడకూడా వున్నారేమో (లోనికివెళ్ళాడు)

పాప : ఏది ? రంగనాథం ! ఏది ? నాసంగతి యీ కొత్తగా వచ్చిన ఇతని కెలా తెలిసింది అంట. ఏది ?

రంగ : పాపయ్యా ! నువ్వొక్కడివే కాదూ అన్న.

పాప : ఇదిగో...నువ్వుచాలాద్వాందంగా మాట్లాడతావు రంగనాథం ! అయ్యోరామ ! అర్ధరాత్రి పూట శివాలయం వీధిగుండా వెళ్లటం చచ్చేంత భయంగా వుంది అందుకూ...

రంగ : చచ్చి నాకడుపున పుడతా నన్నావ్ ! భయం దేనికి ?

పాప : భయం దేనికంటా వేమిటయ్యా ! ఏది...భయానికే... అయ్యోరామ ! బండారం భజగోవిందం లేదూ, ఎవరు?

రంగ : భజగోవిందం ?

పాప : (నవ్వి) నీకూ తెలుసన్నమాట... ఏది? వాళ్ళ విడో సిస్టర్ విమలమ్మ లేదూ... ఏది ?

రంగ : ఉండలేవయ్యా ! పదపైకి.

పాప : అయ్యోరామ! మాట పూర్తి కాకుండానే. ఏది ? ఆ అమ్మాయి గురించి అర్ధరాత్రిపూట ఎవడో విటచక్రవర్తి వేంచేసీ, సూర్యోదయం ముందే గప్‌చిప్‌గా చటాయిస్తున్నాట్ట. అది పసిగట్టిన భజగోవిందం, పది మంది రౌడీలను పెట్టాట్ట వాడి భజననిమిత్తం...

రంగ : మరి నీకెందుకయా భయం.

పాప : బాగుందయ్యోయ్. వాడనుకుని నాకు చేస్తే ఆకాస్త భజన...

రంగ : అదా...

పాప : ఏది ? అసలు ఆడదానికి బుద్ధుండాలిగాని, వచ్చేమగాణ్ణి తన్నితే లాభం ?

రంగ : ఆడాళ్ళని తన్నాలంటావ్. ఎంతలోకువయ్యాదయ్యానీకు. అసలు తన్నేవాళ్ళకు బుద్ధులున్నాయా అని...ఏది ?

పాప : అయ్యోరామ. అదినాది...ఏది ?

రంగ : తన్నులువల్ల ఎవరికీ బుద్ధులురావు పాపయ్యా ! పొర పాట్లకు కారణాలేమిటో తెలుసుకోవాలి. మనస్సులో మలినాన్ని కడుక్కోవాలి. ముఖ్యంగా చెప్పరానిమాటలు, తప్పుడుమాటలు పలక్కుండా తన నోటికి తాను తాళం వేసుకోవాలి.

పాప : ఏది ? మూశా ! (నోరు మూశాడు)

రంగ : పదపైకి. (రంగనాథం, పాపయ్య పైకి వెళుతుండగా సుబ్బయ్య క్రిందికి దిగివచ్చాడు. అప్పుడే రాధ తోచని దానిలావచ్చి సోఫాలో కూలబడింది. సుబ్బయ్య అను మానంగా చూస్తాడు)

సుబ్బ : అమ్మగారూ !

రాధ : ఏం సుబ్బయ్యా !

సుబ్బ : లోపలకి వెళ్ళి పడుకోండమ్మా.

రాధ : కాస్సేపు యిక్కడే విశ్రాంతి తీసుకుంటాను. నువ్వు వెళ్లు సుబ్బయ్యా !

సుబ్బ : అంతా నిద్రపోతున్నారమ్మా !

రాధ : కళ్లుమూసుకున్న వాళ్ళంతా నిద్రపోరు సుబ్బయ్యా !

సుబ్బ : అమ్మగారూ !

రాధ : ఏం ? (కోపంగా) నీకేం కావాలో చెబుతున్నది ?

సుబ్బ : అదికాదండమ్మా.

రాధ : ఏదికాదు. ఎప్పుడూ గదిలోనే బందీలుగా పడివుండ టానికి ఆ పంజరంలో పక్షులమేమీకాదు. మనుష్యులం.

(సుబ్బయ్య భయంగా వెళ్ళాడు)

(రాధ మెట్లప్రక్కనున్న సోఫాలో అలాగేకూర్చొనివుంది. శ్రమతో కూడిన ఆవలింతకూడా వచ్చింది. కళ్ళుమూతలుపడ్డాయి. ఆమెను నిద్ర ఆవే శించింది. అనుగుణంగా ఒక్కలైటుమాత్రం ఆమె ముఖంపై పరిభ్రమించింది. మిగతాలైట్లు ఆరిపోయాయి. దాని ననుసరించి సంగీతంకూడా నిద్రను స్ఫు రింపచేస్తూ ధ్వనించింది. వున్న ఒక్కలైటు ఆరిపోగా 'సెట్' రెండు విభా గాలై అటొకటి యిటొకటిగా వెళ్ళిపోయింది.)

(నీలికాంతిగల తెరపై చంద్రుడువున్నాడు. చిన్నచిన్న గుబురులతో లతలలో అదిఒక ఉద్యానవనంగా మారింది. వింతకాంతులీనే దుస్తులతో 'రాధ' దేవతాస్త్రీలా గానాలాపనచేస్తూవచ్చింది. ఆమెకలలో గంధర్వుడిలా 'గోపి' ప్రత్యక్షమై ఆమెతో చేరి అతనుకూడా పాట ఆరంభించాడు.)

పాట

రాధ :

పల్లవి : ఈ పాలవెన్నెలా– వన్నెలా
నీకన్నులా– పూగేను పూయలా!

గోపి : ఈ పాలవెన్నెలా– వన్నెలా
చెలికన్నులా– పూగేను పూయలా!

1 చరణం

గోపి : నీచూపులె బంధాలు నాకూ– నీ ప్రేమ బందీనీ నీకూ

రాధ : మధురాలపంటా– మనప్రేమజంటా!
ఔనాప్రియా– ఆహాహాహా! ॥ఈపాలవెన్నెలా॥

2 చరణం

రాధ : నీ వలపే పన్నీటిజల్లూ- నీ తలపేకాదా హరివిల్లూ

గోపి : నీ పలుకే గానం- నీవే నాప్రాణం

ఓ నాప్రియా- ఆహాహాహా! ॥ఈపాల వెన్నెలా॥

3 చరణం

గోపి : ఈ జాబిలి పూచింది మనకై

రాధ : ఈవెన్నెల కాచింది మనకై

గో: రా: లోకాల అందం- మనకింక సొంతం

ఓ నాప్రియా- ఆహాహాహా. ॥ఈపాల వెన్నెలా॥

(ఆ ప్రేమగానంలో తనువులుమరచి తన్మయత్వంతో కూర్చునివుండగనే లైట్లన్నీ ఆరిపోయాయి)

(తిరిగ 'సెట్' యథాప్రకారంగా రూపొందింది. రాధయింకా నిద్రలోనే వున్నట్లుగా పరిభ్రమిస్తున్న కాంతి, సంగీతధ్వని వ్యక్తంచేస్తున్నాయి. గోపీ లోపల్నించివచ్చి ఆశ్చర్యంగా చూసాడు)

గోపి : రాధా! రాధా!

రాధ : (తేరుకుని ఆనందంగా) ఆ. ఎంతమంచి కలకన్నాను గోపీ! ఆకలే నిజమైతే ఎంత బావుండును...

గోపి : అంత మంచికలా!

రాధ : అవును గోపీ. మరుపురాని మరువలేనికల.

గోపి : రాధా! కలలు నిజమైతే కలియుగమే ద్వాపరమౌతుంది. ఫలించని ఆశలకు ప్రాణంపోసే మనస్సు ఆడించే అంతర్నాటకమే కలగా కనిపిస్తుంది. ఆకాసేపూ అది నిజమా అని భ్రమింపజేస్తుందికూడా. సరే చాలా ప్రొద్దుపోయింది. నువ్వులోపలకు వెళ్ళి పడుకో. (వెళ్ళ

బోయి ఏదో జ్ఞాపకం వచ్చిన దానిలా ఆగి తిరిగి గోపీని చూసి)

రాధ : భోజనం మానిందెవరికోసం ?

గోపి : నాకోసమే.

రాధ : ఇదేం బాగాలేదు గోపీ!

గోపి : బాగుందని నేనన్నానా. ఏమీ బాగాలేదు. అందుకే బాధపడుతున్నా. ఒకామె ఆరోగ్యం కోసం వచ్చాను. మరొకామె అనారోగ్యాన్ని పెంచాను. ఆశించింది దక్కకపోగా అనుకోనిది ఎదురైంది.

రాధ : ఇది బుద్ధిపూర్వకంగా జరిగింది కాదు గోపీ!

గోపి : అవును. పెద్దల బుద్ధుల మీదే ఆధారపడి నీపెళ్ళిజరిగింది. ఆ సంగతి నాకు తెలుసు. ఎవరి కోరికతో నీవీత్యాగాన్ని చేసావో దాన్ని యీనాడు బూడిదలో పోసిన పన్నీరు చేసావు.

రాధ : నీ వుద్దేశ్యం ?

గోపి : నీకర్థమైకూడా అడగడం మంచిది కాదు రాధా! నీ సుఖమేకాదు నాస్నేహితుని సుఖంకూడా నేను చూస్తు న్నాను. వికసించాల్సిన వాడి హృదయం నీ సహకారం లేకమరీ ముకుళించుకుపోతుంది. నేను కోరేది ఒక్కటే! జరిగింది మర్చిపోయి వాడితో ఆనందంగా కాపురంచేయి. నీ కిష్టం లేకపోయినా నిన్ను నమ్ముకున్న వాళ్ళకు కష్టం కలిగించడం మంచిదికాదు రాధా!

రాధ : (కన్నీళ్ళతో) అది అంతసులభంకాదు గోపీ !

గోపి : నేను సంతోషిస్తా ననుకుంటున్నావా ?

రాధ : ఎప్పుడూ అనుకోను. నువ్వు సంతోషించ లేవు. నీతత్వమే విచిత్రమైంది. విషాన్ని తింటూనే అమృతంగా భావించే యోగ్యుడివి. కన్నీరు కారుస్తూనే పరుల ఆనంద బాష్పాలు చూడాలని ఆశించే అదృష్టవంతుడివి. అందుకే నీ బ్రతుకు ఎందుకూ కాకుండా చేసుకున్నావ్. నీ ఆశయాలను సర్వనాశనం చేసుకున్నావ్.

గోపి : ఎవరంటావ్ కారణం ?

రాధ : నేనే! గోపీ నేనే! నువ్వుకాదన్నా నేను నమ్మలేను. ఆ పాపమే నన్ను యిలామార్చింది. హృదయం స్థాణువై యింది. ఎంతదూరంలోవున్నా నీ ఆకర్షణ నానుండి దూరం కాలేకపోయింది. అందరిలాంటివాడివే నువ్వూ అయితే, నీ కోరిక ఎప్పుడో నెరవేరేది. నిన్ను మరవలేను గోపీ! మరవలేను. నీ అమృతమూర్తిని నా హృదయం నుండి తుడుచుకోలేను. గోపీ! నీకునేనుదూరంకాలేను.

గోపి : (బరువుగా నిట్టూర్చాడు) ఈ పొరపాటు నీదికాదు రాధా! నాది. నేను బ్రతికుండడమే నేరమైంది. ఇలా జరుగుతుందని నాకు తెలుసు. నేను లేననుకున్నప్పుడు గాని నువ్వు సుఖించలేవు. అందుకే ప్రయత్నించి విఫలున్నాయ్యా! ఇప్పుడు నీబ్రతుకుకోసం ఆపనిచేయాలన్నా–

రాధ : వద్దు! గోపీ వద్దు.

గోపి : లేదు. ఆ అవకాశం లేదు రాధా! ఆమెకోసమే బ్రతకాలి. నా చావువల్ల నువ్వు మారగలవంటే సాహసించాలనే వుంది. రాధా! ఒకపనిచేస్తావ్ ? ఆమెను నీ దగ్గరే వుంచుతా నేనులేసనుకొని...

రాధ : గోపీ !

గోపి : నేనెందుకు బ్రతకాలి రాధా ! ఎవరికోసం ?

రాధ : భవిష్యత్తుకోసం.

గోపి : రాధా !

రాధ : అవును. నాకోసమన్నా బ్రతకాలి గోపీ ! మరొక్కనాడైనా నీ చల్లని నీడలో సేదతీర్చుకోవాలనే నా కోరిక ఎండమావులు కాకూడదు గోపీ !

గోపి : రాధా ! ఏమిటి యీ అర్థంలేని కోరిక ? చేసింది చాలదూ ? నన్నింకా పతనం చేయాలనా ? మిత్ర ద్రోహిగా నిరూపించాలనా ?

రాధ : గోపీ !

గోపి : రాధా! నిజంగా నామీద నీకు ప్రేమవుంటే నా చిన్న కోరిక నీవు నెరవేర్చాలి. నా రామూ అర్థాంగిగా మసలుకుని, వాడి ఆనందానికి కారణంకా. ఇదే నా ఆఖరి కోరిక. ఇకేమీ మాట్లాడను. వెళ్లు రాధా ! లోపలికి వెళ్లు. (అంతకుముందే "రాము" వచ్చి కొంత వరకు విన్నాడు. అప్పుడే రాధ చూసించి. గోపీచూడ లేదు)

రాము: గోపీ !

గోపి : ఆం !

రాము: రాధ నీకు ముందే తెలుసా ?

గోపి : తెలుసు.

రాము: అయితే ఆమెను నువ్వు ప్రేమించావా ?

గోపి : అవేమీ ప్రశ్నించకు రామూ !

రాము: లేదుగోపీ ! నిజం తెల్సుకోలేనిదే నిలబడలేని స్థితిలో వున్నాను. రాధా ! నువ్వయినా చెప్పు. ఒకనాడు ఎవరినో ప్రేమించానని అన్నావ్.

రాధ : అవును. అతనే యితను.

రాము: రాధా ! (కోపంగా)

రాధ : అవును బావా ! నేను ప్రేమించిన ప్రియుడు నీకళ్లెదురుగానే కన్పిస్తున్నాడు.

రాము: సిగ్గు లేక.

రాధ : సిగ్గుపడాల్సిం దెవరు ? తండ్రి ఎదుటతల ఎవరు వూపారో వాళ్లు సిగ్గుపడాలి.

రాము: పొరపాటు చేసింది నువ్వు. నన్ను నేరస్థుడంటావా ! (మీదికి వెళ్లాడు)

గోపి : రామూ ! (అడ్డుగా వెళ్లాడు) రాధా ! నువ్వు లోపలికి వెళ్లు.

రాధ : (వెళ్ళింది).

రాము: (కన్నీళ్ళతో) నువ్వుమాత్రం ఏంచేశావురా ? స్నేహమంటే అర్థమిదేనా ? నాన్న అంటే నాకు భయమే కావచ్చు. నీమాట మాత్రం ఎప్పుడు కాదన్నాను. ప్రక్కదారి బట్టిన నన్ను, నిజం తెలిసిన నువ్వు, నాలుగు తన్ని ఎందుకు బుద్ధిచెప్పలేకపోయావురా !

గోపి : రామూ !

రాము: గోపీ ! (చేతులు పట్టుకుని భుజంమీద తలవాల్చాడు) ఛ ! ఛ ! వెధవబ్రతుకు బ్రతుకుతున్నాను.

గోపి : దీనికింత బాధపడతావేంరా ! ఇద్దరము ఒకే శిక్ష అనుభ

విస్తున్నాము. మన మిద్దరమేకాదు. మరోయిద్దరుకూడా ఏనేరం లేకుండానే శిక్షింపబడ్డారు. అంతేకాదు; ఈ దేశంలో యీలాంటి శిక్షలు చాలామంది అనుభ విస్తున్నారు. ఆశించినవాళ్ళనే పెళ్ళాడ్డానికి అందరికీ అవకాశాల్లేవు. అందుకే అనుకున్నట్టు జీవితాలు సాగడల్లేదు. మనం మాత్రం ఎందుకు బాధపడాలి? బాధపడి ఏంజేస్తాం ? ధైర్యంగానే వుందాం. ఒకవిధంగా చూస్తే కొందరికన్న మనమే అదృష్టవంతులమేమో.

రాము: (బాధగా నవ్వి) అదృష్టం !

గోపి : అవును. దీనినే గుడ్డిలో మెల్ల అంటారు. ప్రేమపేరుతో ఎవరం పతనంకాలేదు. పెళ్లయ్యేవరకు అందరం శీల వంతులమే. ఆ తరవాతే అర్థంలేని పట్టుదలలతో ఆత్మ ద్రోహం చేసుకోవటం ఆరంభించాము. ఇది యింకా సాగితే మానవులుగా మరిచిపోయి దానవులుగా తయా రవుతామేమోనని భయంగావుంది...ఓ రేయ్ రామూ!

రాము: నీవు చెప్పబోయేది నాకు తెలుసురా. కాని అంత సులభమైంది కాదు.

గోపి : ఏమిటది ?

రాము: రాధను అర్థాంగిగా భావించి ఆనందంగా సంసారం చెయ్యడం —

గోపి : అసంభవమంటావా ?

రాము: అవును, నువ్వు ఆమెను గురించే ఆలోచిస్తున్నావ్. నేను కూడా అంత నీచుణ్ని కాను.

(మాటలువింటూ పైనుంచి రంగనాథం వచ్చాడు
రాము చూసి వెళ్ళబోతాడు)

రంగ : రామూ! నేను రావడం, నీవు వెళ్ళడం అనే అలవాటుంది చూశావ్ కాస్త తగ్గించు. తండ్రేకాదు దేవుడొచ్చినాసరే, ధైర్యంగా తలెత్తి మాట్లాడటం నేర్చుకో. ఏంగోపీ! నీ మిత్రుడు పదిగంటలకే నిద్రపాడవుతుందని గోలచేసాడు. పన్నెండు గంటలవరకూ ఏమిటీ సమాలోచన.

గోపి : చాలా కాలానికి కలసిన స్నేహితులంకదండీ !

రంగ : కష్టసుఖాలు మాట్లాడుకుంటున్నారు... సంతోషం...

పాప : (మేడమీాదనుంచి దిగుతూ) ఇది చాలా అన్యాయంగా వుందయ్యా ! ఏది ? ఇదివరకంత బాగా ఆట్టంలేదు నువ్వు. పైగా ఆడుతూ ఆడుతూనే మధ్యలో ఆగిపోయి క్రిందికి దిగి వచ్చావ్. నేను పావులవంక చూస్తూనే వున్నాను. తీరా చూస్తే నువ్వు లేవక్కడ. ఏది? వెధవ యింట్రస్టు ఎంత బాధపడుతుందో నీకేం తెలుసు...ఏది?

రంగ : దారి అది. నేను వచ్చేవరకూ వుంటే యిది.

పాప : ఏది ?

రంగ : నేను చెప్పిందే.

పాప : అయ్యోరామ! అయితే యీాదారే చూచుకుంటాను. కాని వెంటనే వచ్చెయ్యాలిసుమా! ఏది ? వెధవది... లేకపోతే... ఇద్దరాటా ఒక్కణ్నే ఆడాల్సివుంటుంది. ఆఁ...ఏది? (అంటూ పైకివెళ్ళాడు)

రంగ : నా ప్రాణానికి ఇతడొకడు దాపరించాడు.

గోపి : నాలాగ !

రంగ : నువ్వెందు కనుకోవాలి గోపీ ఆమాట

గోపి : అన్యాయం సరిపోయిందికాబట్టి. నేను వచ్చిందగ్గర్నుంచి మీాకు మనశ్శాంతి లేకుండాచేశాను.

రాము: మానాన్నగారిని నువ్వు సరిగా అర్థంచేసుకోలేదురాగోపీ!

రంగ : మావాడు నన్ను బ్రహ్మాండంగా అర్థంచేసుకున్నాడు.

రాము: అదికాదు నాన్నగారూ !

రంగ : పిచ్చినాన్నా! నన్ను నేనేఅర్థంచేసుకోలేదురా. నువ్వెల్లా అర్థంచేసుకున్నావ్ ? నేను అన్నమాటల్లో అబద్ధంలేదు గోపీ! మరుక్షణంలో మనం ఏంచెయ్యబోతామో మనకే ఒక్కోసారి తెలియదు. సాధారణంగా ఆవేశా లకు, ఆవేదనలకు లోనయినవాళ్లు వ్యక్తిత్వాన్నే మరచిపోతారు. ఏంచేస్తార్లో వాళ్ళకే తెలియదు. ఉదా హరణకు కావాలంటే నన్నుచూసినవాళ్లు చాలామంది శాంతమూర్తి ననుకుంటారు. ఆకారంకావచ్చు. అంత రంగంమాత్రం అదికాదు. ధర్మానికి దగా, న్యాయానికి అన్యాయం జరిగిందంటే ఒక్కక్షణం సహించను. అప్పుడు కొడుకేకాదు, కోడలేకాదు ఎవరైనా నాసరే.

గోపి : (నవ్వి) ఏం చేయడానికైనా వెనుదీయరు.

రంగ : అంతేకాదు గోపీ! తప్పుదారి తొక్కుతున్నారని తోచిన అతిథుల్ని కూడా సహించను.

రాము: మీారు తొందర పడుతున్నారేమో ?

రంగ : లేను. పడబోతానేమోనని అనుమానంగావుంది. నిజంచెప్పొద్దూ, చెప్పకపోతే తెలుసుకోలేరేమోకూడా.

సెషన్ జడ్జిగా గద్దెఎక్కిన రోజుల్లో నాహృదయానికే ముందు వురిపోసుకోవలసి వచ్చింది. అంతే చేసాను. ఆ తరువాత నేరస్తులనుకున్న వాళ్లను నిర్దాక్షిణ్యంగా శిక్షించాను. ఆ అలవాటు నానుండి యింకా నానుండి దూరంకాలేదు. అందుకే మీరంతా జాగ్రత్తగా వుండాలని నేనుచెబుతున్నాను.

గోపి : క్షమించాలి. అనుమానమే మీ ఆవేశానికి కారణము మవుతుందేమో

రంగ : నా అనుమానానికి ఆధారాలు లేవని నువ్వుచెప్పగలవా గోపీ!

గోపి : ఒక్కొకసారి ఆధారాలుకూడా అపార్థాలు కల్పించవచ్చు.

రంగ : యదార్థమనేది తెలుసుకోలేనప్పుడు. గోపీ! నాకళ్లెదురుగాపుట్టిన బిడ్డలు మీరంతా. నా అనుభవాలకన్నా మీవయస్సు తక్కువేనేమో. మాటల్లో చెడ్డనుమభ్యపెట్టినా మంచి ఏనాటికీ కాదు. పొంచిన మంచికి మసిరాసినా బైటపడకపోదు. అందుకే చెబుతున్నా. భిన్నభిన్న మనస్తత్వాలతో చిత్రవిచిత్రంగా ప్రవర్తిస్తున్న మీఅందరికి ఒక్కటేచెబుతున్నా. నాయింట్లో ఏలాంటి అఘాయిత్యాలకూ స్థానంలేదు. ఇది నాయిల్లు. తరతరాలుగా హిందూపవిత్రతనూ, శీలగుణసంపదనూ, కాపాడుకుంటూవచ్చిన పూజానిలయం! ఇక్కడ ఏ చీకట్లు కమ్ముకున్నా చీల్చి చెండాడి వెలుగులునింపే అధికారం నాకుంది. అందుకే చెబుతున్నా తెల్లవారే లోపున ఏ ఒక్కరూ వాళ్ళ గదులనుండి బైటికి రావ

డానికి వీలులేదు. (బిగ్గరగా) వెళ్ళండి! ఎవరిగదుల్లోకి వాళ్ళు వెళ్ళండి. (మధ్యలోవచ్చి రాధ, రాము, గోపీ భయంగా చూస్తూ వాళ్ళ వాళ్ళ గదుల్లోకి వెళ్ళారు)

(పాపయ్య పైనుండి దిగి వచ్చాడు)

రంగ : సుబ్బయ్యా!

సుబ్బ : (వచ్చాడు)

రంగ : ఊఁ. సిద్ధంగా వుంచావా?

సుబ్బ : చిత్తం! (రివాల్వరు యిస్తాడు)

పాప : ఏది? (చూసి) అమ్మో! (అనిపారిపో బోతాడు)

రంగ : ఆగు.

పాప : (భయంగా) ఏది?...ఇదిగో రంగనాథం! నువ్వూ నేను ప్రాణస్నేహితులం. బాబ్బాబు. నన్నేం చెయ్యకు.

రంగ : పాపయ్యా! ఇంకా నీకు బ్రతుకుమీద ఆశవుందా?

పాప : అయ్యోరామ! బ్రతుకుమీదఆశఅనేది నాకేకాదయ్యా! ఏది? చిన్నచీమకుకూడా ఉంది. చూడు రంగనాథం ఏది? ఆయుధవిసర్జన అత్యావసరంఅని ప్రపంచంఅంతా ఘోషిస్తూంటే ఏది? మాయదారి మారణాయుధాన్ని నువ్వు బట్టావేమయ్యా! నీకు దణ్ణంపెడతాగాని దాన్ని అలా అలావిసిరి అలాపడెయ్యి.

రంగ : అయితే అందుకో—

పాప : అమ్మో! అలా...అ...లా... ఏది? సుబ్బయ్యపైకి విసురు.

సుబ్బ : నా ప్రాణమేనాబాబూ అంతతేలిగ్గావుంది. అవును నా కెవరున్నారు? పెళ్లాంకూడాలేదు.

పాప : (కోపం) అదిగో ఆఁ...నిన్ను ఆపేడుపే ఏడవద్దన్నా.
రంగ : ఊ...!
పాప : నాకెందుకో కాళ్లువణుకుతున్నాయి. ఇక్కడ ఒక్క క్షణం వుండలేను రంగనాథం.
రంగ : పన్నెండుదాటింది. ధైర్యంగా వెళ్ళగలవా ?
పాప : ఏం వెళ్ళకేం (కొంతవరకెళ్ళాడు)
సుబ్బ: బాబూ ! దారిలో బండారం భజగోవిందం...
పాప : (టక్కన ఆగాడు) నీదుంపతెగ ! నా భజనచేస్తాడంటావ్. ఏది ? ముందుచూస్తే నుయ్యి, వెనుకచూస్తే గొయ్యి. నేనువెళ్ళను పైకిరాను. ఏది ? నేనీ సోఫాలోనే నడుం వాలుస్తాగాని నువ్వెళ్ళి పడుకో రంగనాథం.
రంగ : అదేం వీలులేదు. పైకేరావాలి. ఈ రాత్రినేను నిద్రపో దలచుకోలేదు.
పాప : ఇప్పుడు మరీభయంగావుంది. ఇంతకూ కారణం ఏమిటి రంగనాథం !
రంగ : మరేంలేదు. చెస్ ఆడాలనుకొన్నాంగా.
పాప : నేను నమ్మను.
రంగ : నీ ఖర్మ.
పాప : విషయంచెప్పు రంగనాథం. నువ్వెప్పుడూ పిస్తోలు పట్టుకోవడమే నేను చూడలేదు. ఏది ? అసలు మీయింట్లో ఇదున్న సంగతే నాకు తెలీనే తెలీదు. పైగా రిటైర్డ్ అయిన పెద్ద ఉద్యోగివి ! ఇప్పుడసలీ యుద్ధమెందుకయా !
రంగ : పాప పరిహారార్థం !
పాప : ఏది ? పాపయ్య పరిహారార్థమా ?

రంగ : కాను! పాపపరిహారార్థం అంటున్నా —

పాప : ఆ 'పాపయ్య' అనే మాటంటూ నా ప్రాణాలు తియ్యకు రంగనాథం!

రంగ : అసలు నీపేరుకు అర్థమేమిటో తేలుసా పాపయ్య!

పాప : అసలు అర్థంగాకే ఏడుస్తున్నా. మా అమ్మా నాన్నా ఏమి ఆలోచించి పెట్టారో - ఏది?

రంగ : నీ భవిష్యత్తు అలోచించే పెట్టి ఉంటారు.

పాప : (కోపంగా) రంగనాథం!

రంగ : (ఎర్రగా చూశాడు) ఏం?

పాప : ఈరోజు నువ్వు చాలా విచిత్రంగా కనిపిస్తున్నావ్. ఏది? ఆ పిచ్చి అమ్మాయి వచ్చింది. అంటు వ్యాధిలా నీకు కూడా సోకిందా అని నా అనుమానం?

రంగ : నాకూ అలాగే అనిపిస్తోంది.

పాప : ఏది...అనుకున్నంతా జరిగింది. సుబ్బయ్యా!

సుబ్బ : ఏంబాబూ!

పాప : మీ అయ్యగారికి పిచ్చిపట్టిందిట. డాక్టర్ దగ్గరికి వెళదాము.

సుబ్బ : సాయముంటే జారుకుందామనా! నాకుమాత్రం పిచ్చి పట్టలేదు.

పాప : అయితే నాకు పట్టిందంటావా?

సుబ్బ : కాకపోతే పిచ్చిపట్టినవాళ్లు పిచ్చిపట్టిందని చెబుతారా పాపయ్యగారూ!

పాప : అయితే నాకు పిచ్చిపట్టింది. కాబట్టి పట్టలేదంటున్నా నంటావ్.

సుబ్బ: అదికాదు. అయ్యగార్కి పిచ్చిపట్టలేదు. కాబట్టి పట్టిం దని చెబుతున్నారు.

పాప : నువ్వూ మీ అయ్యగారిసేవచేసి మాటల్లో ద్వంద్వాన్ని నేర్చుకున్నావ్ ! వస్తాను రంగనాథం.

రంగ : ఎక్కడికి ?

పాప : ఇక్కడ చచ్చేదానికన్నా, బయటచస్తే పదిమందన్నా చూస్తారు.

రంగ : శవాన్నా.

పాప : ఇదిగో రంగనాథం. అసలే హడలిచస్తున్నా. ఏమ్మాటలివి ?

రంగ : ఏముంది... ఇక్కడ జరిగే ప్రళయానికి నువ్వే ప్రత్యక్ష సాక్షివి కావాలి ! అందుకే ఎక్కడికీ వెళ్ళడానికి వీల్లేదు ! ఊఁ పద !

పాప : అయ్యోరామ! నేను వేళాకోళంగా అన్నమాట నిజంగా జరుగుతుందన్నమాట. ఏది ? యిదిగో రంగనాథం ? నాకు దేనిమీద అంతప్రేమలేదు, కాని వెధవ ప్రాణ మంటే పడి చస్తాను.

రంగ : చచ్చిం తర్వాత ప్రాణమేమిటయ్యా !

పాప : ఏవి ? మళ్ళీ అదేమాటా !

రంగ : అదే; నీ ప్రాణానికేమీ భయంలేదు. సరేనా ?

పాప : అలా అన్నావ్ నచ్చింది. పద...పైన ఆభగవంతుడే వున్నాడు.

(ఆంజనేయదండకం చదువుకుంటూ మెట్ల మధ్యకి వెళ్ళి చతికిల పడ్డాడు)

రంగ : పాపయ్యా !

పాప : అయ్యోరామ ! వస్తున్నా ! (లేచివెళ్లాడు)
(సుబ్బయ్య వెళ్లాడు లోనికి. లైట్లు ఆరిపోయి మళ్ళీ వెలుగుతాయి)

(సీత పిచ్చిగా పాడుకుంటూ నాట్యంచేస్తూ స్టేజీ మీాదికి వచ్చింది)

"పాట"

సీత :
నవ్వింది—నవ్వింది
పువ్వులాంటిపిల్లా
మువ్వల్లా గలగలా ॥నవ్వింది॥

కోరుకున్న దారిలో
చేరుకున్నాయ్ దెయ్యాలు
పారుతున్న యేరంతా
బీటువారి పోయింది !
పక పక పక నవ్వింది
వికి వికి వికి నవ్వింది ॥నవ్వింది॥

మంచి చాటుకు వెళ్లి
పొంచి చూడగానే
పంచి కట్టినవాడే
కంచి చీరగమారే !
పక పక పక నవ్వింది
వికి వికి వికి నవ్వింది ! ॥నవ్వింది॥

దోసాల దొడ్డిలో
మోసాలవారుంటే
కాసాయి వాడొచ్చి
దాసోహ మన్నాడు!
పక పక పక నవ్వింది
వికవికవిక నవ్వింది ॥నవ్వింది॥

(పాట పూర్తయ్యేముందు వచ్చి సుబ్బయ్య విచిత్రంగా చూసాడు)

సీత : (అతన్ని గమనించదు. పాట ఆఖరిని పిచ్చిగా నవ్వుతుంది)

సుబ్బ : అమ్మా! ఓ సీతమ్మతల్లీ !

సీత : ఏం ఆంజనేయులూ ?

సుబ్బ : దశరథమహారాజుగారు పైనున్నారుతల్లీ! ఆయనవింటే కొంపమునుగుతుంది. లోపలికిపదండి.

సీత : (నవ్వి) నీకూ-డా వుందిసుమా!

సుబ్బ : 'పిచ్చి' నాకులేదు తల్లీ !

సీత : మరి నేనుపిచ్చిదాన్నా ?

సుబ్బ : లేకపోతే కోడికూసే వేళయింది. అర్ధరాత్రి మద్దెల దరువులా, ఈ గొడవేమిటమ్మా !

సీత : నేనుపాడుకుంటే నీకేం ?

సుబ్బ : పాటయితే ఫరవాలేదమ్మా! ఆటకూడ మొదలెట్టావు. అయ్యగారువింటే, కొంపమునుగుతుంది.

సీత : అయితే నాకిక్కడకూడా స్వేచ్ఛలేదా ?

సుబ్బ : ఆడవాళ్ళకి బైటెక్కడా స్వేచ్ఛవుండదమ్మా! వుంటే

మనస్సులోనే వుండాలి. అవునుగాని తల్లీ! మా 'రాం బాబు' అంటే మీకంతయిదేవిటి ?

సీత : అది నీకు తెలియదులే. ఆయన మా ఆయనేగా...

సుబ్బ : తప్పమ్మా ! పెళ్ళయిన ఏ ఆడది అలా అనకూడదు.

సీత : నేనసలు పెళ్లే చేసుకోలేదుగా !

సుబ్బ : బాగుంది.

సీత : బాగుంటే యింకా స్త తిను. ఓ ఆంజనేయులూ !

సుబ్బ : కాదు తల్లీ ! నాపేరు సుబ్బయ్య.

సీత : సుబ్బయ్యేవిటి బొబ్బయ్యలా. రామయ్య అనే పేరు ఎంత బావుంటుందో తెలుసా గోవిందూ ?

సుబ్బ : చాలా పసందుగా వుందమ్మా! వెనుకటికెవరో తొండం బొజ్జవుంటే వీరభద్రుడనుకున్నాను. వెంకటేశ్వర్లు వటోయ్ పోతరాజూ! అన్నాట్ట, అలావుంది తల్లీ !

(రంగనాథం పైనుంచి వచ్చాడు)

సుబ్బ : (చూసాడు) అమ్మా ! అయ్యగారొస్తున్నారు.

రంగ : సీతా ! ఏమిటమ్మా గొడవ. వెళ్ళి పడుకోరాదూ !

సీత : పగలెవరైనా పడుకుంటారేమిటి ?

రంగ : పగలు కాదమ్మా యిది రాత్రి.

సీత : మీకు కావచ్చు. నాకు కాదుగా. అంతా చీకటే !

రంగ : (ఆలోచనగాచూసి) సీతా !

సీత : ఏం ?

రంగ : చూడమ్మా ! మీ నాన్న నీకు గుర్తున్నాడా?

సీత : (బాధగా) నాన్న !... మానాన్న !

రంగ : అవునమ్మా !

సీత : (ఏడుస్తూంది) నాన్నా !

రంగ : ఏడవకమ్మా !

సీత : మా నాన్నని మీరెరుగుదురా ?

రంగ : చూశానేమో గుర్తులేదు.

సీత : మానాన్న చాలా మంచివాడు. నిజంగా దేవుడు. ! అమ్మలేకపోయినా అమ్మలా చూసిన నాన్నను నే నే చంపేశాను.

రంగ : నువ్వు కాదమ్మా !

సీత : నేను నమ్మను. నాకారణంగానేగా నాన్న చచ్చి పోయాడు.

రంగ : పెద్దవాళ్ళ కిష్టంలేకుండా మరొకళ్లకు మనస్సు యివ్వడం అంత మంచిది కాదమ్మా !

సీత : మనస్సివ్వడమా ! (నవ్వి) ఇవ్వడాని కెక్కడవుంటుంది ? అసలు మనస్సు ఎలా వుంటుంది ? నల్లగావుంటుందా ? తెల్లగావుంటుందా ? ఐన మనసిస్తే తీసుకునేవాళ్లెవ రుంటారు ? ఒకవేళ పుచ్చుకున్నా, నొచ్చకుండా, దానికి ముల్లు గుచ్చుకోకుండా జాగ్రత్తగా చూచుకోగలరా ?

రంగ : సీతా ! నీ విలా ఎందుకయ్యావ్ ? ఎవరినన్నా ప్రేమించావా ? అతను దగా చేసాడా ? కారణం చెప్పమ్మా !

సీత : (నవ్వి) కారణం ? కారణానికి వీరణం ఎందుకూ ? పువ్వులు ఎందుకు పూస్తున్నాయి ? కోయిలమ్మ "కూ" అని ఎందుకు కూస్తుంది ? చంద్రుడికోసం చకోరి ఎందుకు కాస్తుంది? వీటన్నిటికి మీరు కారణాలు చెప్పగలిగితే,

నేనెందుకు ప్రేమించానో, ఎవరిని ప్రేమించానో, చిటికలో చెప్పేస్తా. చెప్పుకోండి చూద్దాం! ఏం ? కోపంవచ్చిందా ?

రంగ : లేదమ్మా లేదు.

సీత : మరి ఆ కళ్ళల్లో నీళ్లేమిటీ ?

రంగ : ఆనందబాష్పాలు.

సీత : ఆనందబాష్పాలకు, అశ్రుబిందువులకూ తేడా ఎంతుందంటారూ ?

రంగ : నువ్వు చాలా తెలివైనదానవమ్మా !

సీత : చెప్పలేనప్పుడు తప్పించుకోటాని కిదేమార్గంలే... ఓ... ఓడిపోయారు (నవ్వి సోఫాలో కూర్చుంది)

రంగ : సీతా! ఎప్పుడూ ఇక్కడే వుండాలని వుందా ?

సీత : వుంటేమాత్రం వుంచుతారా ? నాకెవ్వరూ లేరుగా. అంతా విడిచి వెళ్ళిపోయారు. నాన్న లేడు. అమ్మ లేదు. ఉంటారనుకున్న ఆయనకూడా దూరంలో వున్నారు. నన్ను ఎవరు ఆదరిస్తారు. నన్ను హృదయంలో ఎవరు దాచుకుంటారు ? ఇక చల్లని నీడనిచ్చి సేదతీర్చే వారెవరు ? అంతా అయిపోయింది. నా జీవితమంతా నాశనమైపోయింది. (బావురుమంది)

రంగ : సీతా ! నేనున్నానుగా.

సీత : మీరున్నారా ? నా తండ్రిలా నన్ను చూడగలరా! నాకు బాధకలిగితే అంతకన్నా మీరు బాధపడగలరా ? మాట్లాడరేం ? మనస్సులేనప్పుడు తపస్సుచేస్తేమాత్రం తండ్రిహృదయాన్ని పొందగలరా ? అందుకే యిచ్చి

పుచ్చుకోడానికి మనస్సు వస్తువూకాదు. పంచుకోడానికి ప్రేమ తేగబడ్డాకాదు. (నవ్వుతూ వెళ్ళింది. సీతవెళ్ళిన వైపు చూస్తూ రంగనాథం బరువుగా నిట్టూర్చాడు. నేపథ్యంలో పాట వినిపిస్తోంది. పాటననుసరించి రంగ నాథం ముఖంలో భావాలు వ్యక్తమౌతున్నాయి.)

నేపథ్యంలో పాట

శపించే విధాతా! స్త్రీజాతినంతా!
యిదేనా సమాజం? సహించేబాధా!
పసివారివలపు- తనవారి తలపు
వివాహాల కోలాహలం- ఇంటింట రేగే హాలాహలం!
ఈ ఘోర నేరాలరూపం- దేశాన పాపాల కూపం
చల్లారేదెలా దావానలం- చల్లారదేలా దావానలం!

(పాటపూర్తి అయింది. ఆందోళనగా సుబ్బయ్యవచ్చాడు)

సుబ్బ: (భయంగా) బాబుగారూ!

రంగ: అమ్మాయిమాటల్లో అర్థాన్ని గుర్తించావా? చిన్నవాళ్ళనుకున్న వీళ్ళగుండెల్లో గుప్తబడ్డ ఆశలూ, ఆశయాలూ అర్థంచేసుకున్నావా?

సుబ్బ: ఏదో పిచ్చిపిల్లగదా బాబూ!

రంగ: పిచ్చివాళ్ళ మాటలలోనే సత్యం తలెత్తి చూస్తుందేమో సుబ్బయ్యా. అసలు వీళ్ళను పిచ్చివాళ్ళుగా చేసిందెవరంటావ్? హుఁ. నీకర్థంకాదులే. ఇది ఎవరి తప్పో నిర్ణయించడంకూడా కష్టమే; కాని ఒకటి మాత్రం నిజం సుబ్బయ్యా! కన్నబిడ్డల జీవితాన్ని

కన్నులపండువ చేసుకోకుండా పెళ్ళనేపేరుతో కఠినంగా కర్కశంగా నరకంలోకి తోస్తున్నారేమో ననిపిస్తోంది. నాలాంటి పెద్దలు !

సుబ్బ: (ఆశ్చర్యం) బాబూ !

రంగ : నీకు ఆశ్చర్యం కలిగించినా నేనబద్ధం చెప్పలేదు. నేనూ బిడ్డనుకన్న తండ్రినే. మానవుణ్నే. నాకూ హృదయ ముంది. ఈ పసివాళ్ళ మనసులు ఏలాంటి చిత్రవధను చవిచూస్తున్నారో అర్థంచేసుకున్న ఎంత ఆచార సంపన్నుడైనా కదలకుండా వుండగలడా ? కన్నీరు కార్చకుండా మనగలడా సుబ్బయ్యా !

('రాధ' అప్పుడేవచ్చి ఆమాటలు వింది. రంగనాథం చూసాడు. చూడనట్టుగా నటించాడు)

సుబ్బ: అందుకేమి చేద్దామంటారు ?

రంగ : ఒక పొరపాటు చేశాను. సరిదిద్దుకోవడానికి మరొక పొరపాటు చేస్తాననుకున్నావా ? అది జరగనిపని. ధర్మ విరుద్ధంగా ఎవరు ప్రవర్తించినా నేను సహించలేను. దానికన్నా చావుని అందరి ముందుకూ ఆహ్వానించ డమే మంచిదిగా భావిస్తాను.

(ఆ మాటలు విన్న రాధ ఆందోళనగా చూసి భయంగా లోనికి వెళ్ళింది)

రంగ : (పక్షులకేసి చూసి బాధగా నవ్వుతాడు) అలజడి తగ్గినా అంతరాన ఆందోళన హెచ్చింది సుబ్బయ్యా ! ఫర్వాలేదు. పారిపోవాలని ప్రయత్నించినా వాటికి చీకట్లో కళ్ళు కనిపించవు. వెలుగువచ్చే వరకూ అలా

పడివుండవలసిందే. నీవు వెళ్ళి పడుకో సుబ్బయ్యా!

సుబ్బ : ఎవరి గురించి బాబూ మీరు....

రంగ : అన్న దిపక్షులగురించి... విన్నది మనుషులైనా యిబ్బంది లేదు. (ఇద్దరూ వెళ్లారు).

(ముసుగు వేసుకుని భయంగా హేండ్ బాగ్ తీస్కుని 'రాధ' మెల్లగా గోపీవుండే గదిదగ్గరకు వచ్చింది)

రాధ : గోపీ! గోపీ!

గోపి : (వెలుపలికి వచ్చి ఆశ్చర్యంగా చూసాడు)

రాధ : (Bag లో కొంతడబ్బుతీసి) ఇది నీ దగ్గరుంచు గోపీ!

గోపి : (తీసుకోడు) ఎందుకు?

రాధ : (అటు యిటు చూచి) తర్వాత చెబుతా. ముందు బైటికిపద!

గోపి : వివరం చెబితేగాని నేనురాను.

రాధ : ఇక్కడుండి చావడానికి సిద్ధమౌతావా?

గోపి : ఎక్కడుంటేమాత్రం మానవుడు చావు తప్పించుకుంటాడు రాధా! అసలు చావంటే ఎందుకు భయపడాలి? చావురావాలేగాని సంతోషంగా స్వీకరించడానికి సిద్ధంగావున్నా.

రాధ : (బాధగా) గోపీ! నీగురించి కాకపోయినా నా గురించన్నా బ్రతుకు. నా ప్రార్థన మన్నించి తొందరగా బయటికిరా!

గోపి : నీకోసం నేనెందుకు బ్రతకాలి? మనిద్దరం బ్రతికితే ప్రపంచానికి వచ్చే లాభం?

రాధ : వేదాంతం మాట్లాడకు గోపీ!

గోపి : జీవితాంతం కాబోతున్న దన్నప్పుడు వేదాంతమే శరణ్యాం రాధా!

రాధ : చచ్చి ఏం సాధిస్తాం?

గోపి : బ్రతికిసాధించేది ఏమన్నా వుందిగనకనా? రాధా! బ్రతుకుమీదఆశ, బ్రతకాలనేకోరిక నాలో ఏనాడో బ్రతుకును చాలించాయి! నీ బ్రతుక్కీ నీ వాంఛలకీ నా బ్రతుకును ఆధారంగా పెట్టుకోవాలన్నా అందుకు సిద్ధంగాలేను. అసలు నీకీభయం కలగడానికికారణం?

రాధ : నీకు తెలియదుగోపీ! మా మామయ్య...

గోపి : మనల్ని చంపడానికి సిద్ధమౌతున్నారా?

రాధ : అవును.

గోపి : ఇంతకన్నా సంతోషించాల్సిన విషయం ఏముందీ! మనంకూడా సిద్ధంగానే వుందాం.

రాధ : గోపీ! ఇందుకేనా మనం పుట్టింది. ఎన్నోతీయనికలలు కన్నాం. మనసులు విప్పి మసలుకున్నాం. దంపతులు కావాలని కోరుకున్నాం. దారులు మారాయి. దగా పడ్డాం. ఎన్నోపరీక్షలకు నిలిచాను. నీ కర్పించిన నా హృదయం మలిన మవకుండా కాపాడుకున్నాను. మనస్సు నీమీదే నిలుపుకుని తపస్సు చేశాను. నీ రాకే నా సుదినంగా, నీఆమోదమే నా వరంగా భావించాను. ఎంతకాలంగానో, ఎదురుచూస్తున్న అవకాశమిప్పుడు చిక్కింది. ఈ దివ్యమైన క్షణాన్ని అలక్ష్యం చేయడం బాగుందాగోపీ! నన్ను అవమానించి, హతాశురాలిగా చేయడం నీకు మంచిదా గోపీ! (ఏడుస్తుంది)

గోపీ : (నవ్వి) ఒక పిచ్చిదాన్ని తీసుకువచ్చాను. మరొక పిచ్చి మనిషిని తయారు చేసాను. నువ్వన్న మాటలన్నీ నిజమే! కాని రాము నేంచేస్తావ్? సీతగతేమిటి? నీ ఒక్కదాని సుఖంకోసం వాళ్లిద్దరి జీవితాలు నాశనం చేస్తావా? నన్ను నీతిమాలిన వాణ్ని కమ్మంటావా? రాధా! నాకు తెలుసు. ఆడదానిలో సహనం, సాహసం, రెండూసమానంగానే వుంటాయని. కాలుజారిన స్త్రీ శీలవతినని గుండెలు బాదుకున్నా లోకంమాత్రం గుడ్డిది కాదు. నమ్మించాలన్నా నమ్మలేదు. పద లోపలికి! ఇంతవరకూ పవిత్రంగానే వున్నావు. నీచురాలిగా నిన్ను నువ్వు చేసుకోవద్దు. వెళ్లురాధా!

రాధ : గోపీ!

గోపి : అవును గోపీనే! ఆనాడుగోపీ యీనాడులేడు. ఆతను చచ్చిపోయి చాలాకాలమైంది. వెళ్ళు రాధా! లోపలికి వెళ్లు... వెళ్లూ (ఆమెను గెంటివేసి సోఫాలో జుట్టు పట్టుకుని కూలబడ్డాడు)

రాము: (కంగారుగా వచ్చాడు)

రంగ : (వచ్చాడు)

రాము: (రంగనాథాన్ని చూచి వెళ్ళిపోయాడు)

(వెనక సుబ్బయ్య వున్నాడు)

రంగ : (సుబ్బయ్యను వెళ్ళిపొమ్మని సంజ్ఞచేసి తాను పైకివెళ్ళిపోయాడు. సుబ్బయ్యకూడా వెళ్లాడు)

(కన్నీళ్ళతో వంచిన తలయెత్తి గోపీ తనలో తనే

గొనుక్కుంటున్నాడు. అదే సమయంలో సన్నగా ఒక పాటకూడా వినిపిస్తుంది. ఈ పాలవెన్నెలా॥)

గోపి : మధురమైన మనస్సులు, సున్నితమైన మన ఆశయాలు, ఎంతకర్కశంగా, కఠోరంగా రూపొందాయి రాధా! ఆనాటి మన కోరికలు మధ్యలోనే తారకలై దూరదూరాలు సాగిపోయినప్పుడు కంటికి దూరమైనా, మనసు కంటివున్నాయనేది మరవలేకపోయినా, మరచినట్లు భ్రమించాను. నీతికోసం నిజాన్ని పాతిపెట్టాను. మంచికోసం మానవత్వాన్ని మభ్యపెట్టాను. నీకోసం యెదవ్యథపడుతున్నా, గుండెలు బావురుమంటున్నా, గంభీరంగానే వున్నాను. నువ్వు మనిషిగానే వచ్చి నిజాన్ని నిర్భయంగాచెప్పావ్. దానవునిలా దౌర్జన్యంగా నిన్ను సాగనంపాను. ఎంత బాధపడుతున్నావో రాధా! ఎంత ఏడుస్తున్నావో !

(సీత మెల్లగా లోపలనించివచ్చింది. అతన్ని రాముగా భ్రమించింది)

సీత : రామూ !

గోపి : ఊఁ !

సీత : బాధపడుతున్నావా ?

గోపి : నేను రామూనికాను సీతా !

సీత : (భయంగా) నువ్వా !

గోపి : నన్ను నీ రామూలా చూసుకోలేవా ? నేను నీకేం అపకారం చేసాను ? నన్ను ఎందుకింత విరోధిగా చూస్తావ్ సీతా !

సీత : నువ్వు నాకు ద్రోహంచేశావుగా.
గోపి : నేనా !
సీత : లేకపోతే నా రామూని నాకెందుకు దూరంచేసావ్ !
గోపి : లేదుసీతా ! నీ బ్రతుకుకోసం నే నేమేమో చేశాను. లాభంలేకపోయింది. రాము దగ్గరకుచేర్చాను. నీ మనస్సు బాగుపడుతుందని వూహించాను. ఫలితం శూన్యం కాగా ప్రతిఫలం భయంకరంగా ఎదురు నిలిచింది. ఇక మనం యిక్కడుండొద్దు. సీతా! వెళ్ళిపోదాం.
సీత : నేను రానుగా.
గోపి : వచ్చితీరాలి.
సీత : కొడతావా ?
గోపి : ఎప్పుడన్నా కొట్టానా ?
సీత : మరి యిప్పుడు అలావున్నావేం ?
గోపి : ఏమీలేదు. నామాటవిను.
సీత : నేను రాను.
గోపి : ఇక్కడుండే అర్హత నీకూ నాకూ కూడాలేదు. పద (చెయ్యిపట్టుకున్నాడు)
సీత : (ఏడూస్తూ) నేనురానని చెప్పటంలా.
గోపి : నన్ను మనిషిగా బ్రతకనివ్వవా సీతా! నామాట మన్నించవా ?
సీత : (బిగ్గరగా ఏడుస్తూ) రామూ! రామూ!
రాము: (తొందరగా వచ్చాడు) గోపీ! ఏమిటిది ?
గోపి : నువ్వుఅడ్డురాకు. నేనిప్పుడామెను తీసుకువెడుతున్నాను.

రాము :ఏంవొచ్చిందిరా ?
గోపి : ఏమీరారాలేదు. రాబోతోంది. రాసీతా !
సీత : రామూ !
రాము: ఆగరా గోపీ !
గోపి : అడ్డు వచ్చావా నేను సహించను.
రాము: అడ్డురాకుండా వుండ లేను.
గోపి : తప్పుకో !
రాము: ఆమెను తీసుక వెళ్ళడానికి వీల్లేదు.
గోపి : ఉంచడానికి వీలుందా !
రాము: ఉదయం మాట్లాడుదాం.
గోపి : చేతగాని చవట (అనిసీతను ముందుకు తీసుకువెళు తుండగా రాము అడ్డువచ్చాడు)
గోపి : "Getout" (అనిరాముని తోయ్యగారాముక్రిందపడ్డాడు)
రాము: (కోపంవచ్చింది. సీతచెయ్యిపట్టుకుని) విడిచిపెట్టు–
గోపి :లాభంలేదు.
రాము: గోపీ !(గోపీ దగ్గరకి వెళ్ళి కడుపులో ఒకగుద్దుగుద్దాడు.)
గోపి : (సోఫాలో కూలాడు)
సీత : (కెవ్వున కేక వేసి దొడ్లోకి పారిపోయింది)
(రాధ సుబ్బయ్య వచ్చారు. రాముని శ్చేష్టుడయ్యాడు)
రాధ : (భయంగా) గోపీ ! (అటుయిటుచూసి లోనికిపరుగెడు తుంది, రంగనాథం పాపయ్య క్రిందికి దిగివచ్చారు.)
రంగ : రామూ ! ఏవిటిది ? ఏంజరిగింది ? మాట్లాడ వేంరా ?
రాము: వాడు సీతను దౌర్జన్యంగా తీసుకు పోతున్నాడు.
రంగ : అయితేనేం ? తీసుకొచ్చిందతనేగా. తిరిగి తీసుకు

వెళ్లడంలో తప్పేముంది. ఆపుచేయాల్సిన అవసరం నీ కేమిటి ?

రాధ : (నీళ్లుతెచ్చి గోపీముఖం మీాద కొట్టింది. సుబ్బయ్య కేదో అనుమానం తగిలి దొడ్డి వైపుకి వెళ్లాడు.)

రంగ : నీ భార్యని ఏమన్నా తీసుకు పోవడానికి ప్రయత్నించాడా? ఇంటికి వచ్చిన స్నేహితుణ్ని ఎందుకురా చెయి చేసు కున్నావ్ ?

గోపి : (తేరుకున్నాడు) ఏమిటండీ! నన్ను వాడుకొట్టాడని ఎవ రన్నారు ? ఎవరుచూశారు ?

రంగ : ఏవిటి గోపీ!

గోపి : (లేస్తూ) క్షమించాలి. చూడనివన్నీ వూహించుకుని మీారు తొందరపడడం మంచిదికాదు. వాడివల్ల ఏ పొరపాటులేదు. నేనే కాలుజారి సోఫాలోపడ్డా. (రాము దగ్గరికివచ్చి) ప్రొద్దుపోయింది పడుకోరాభాయి. (రంగ నాథాన్ని చూస్తూ) **I am sorry.** మీా కందరికీ చాలా ట్రబుల్‌యిచ్చాను. Good - Night ! (లోపలికివెళ్లాడు. అంతా కాస్సేపు ఆశ్చర్యపోయి ఉండిపోయారు)

పాప : ఏది ? నాకసలు ఏవిటో తెలియలేదు. అంతాఅగమ్యంగా ఉంది.

రంగ : హుఁ. నీకర్థంకాదులే పాపయ్యా! విషపూరితమైన 'నిజాని'కన్నా- దయతోకూడిన అబద్ధమే మంచిదని ఆ అబ్బాయివుద్దేశం. అతన్నికన్న తల్లిదండ్రులు చాలా ధన్యులు. రామూా! నీ లాంటివాడికి యింత మంచి స్నేహితుడెక్కడ దొరికాడురా! రాధా! నీకుకూడా

ఇతను ఒకనాడు పరిచయమే అనుకుంటూ. అబ్బే! ఏమీ లేదు. ఇతన్నిచూచి నేర్చుకోవాల్సిన విషయాలు చాలా వున్నాయి. అలాగేజరిగితే మీ జీవితాలు ఎప్పుడో బాగుపడి వుండేవి.

సుబ్బ: (ఆయాసంతో పరుగున వచ్చాడు) బాబుగారూ! బాబుగారూ! సీతమ్మ ఏటిగట్టుకి పరుగు తీసారుబాబూ!

రాము: ఆః. సీతా! (అంటూ పరుగెత్తాడు)

పాప: కొంప మునిగిందే! ఏది? (అంటూ వెళ్ళాడు)

రంగ: తొందరగా పద సుబ్బయ్యా!

(రాధ, సుబ్బయ్య, రంగనాథం కూడా వెళ్ళారు)

(అవకాశముంటే, **Dreem** లాగే లైట్లు ఆరిపోగా Set అటూఇటూ విడిపోగా, మధ్యలోసముద్రంగాని, నదిగాని ప్రవహిస్తున్న **Affect** తీసుకు రావాలి. గట్టుపైనుండి వంటరిగావచ్చిన సీతదూకడం ఆ తర్వాత రామూ వచ్చి, ఏటిలోదూకి సీతను ఎత్తుక గట్టుకుచేరడం జరగాలి. దూరమునుండి రంగనాథం, పాపయ్య, సుబ్బయ్యలు ఆందోళన వ్యక్తమయ్యేట్టుగా "సీతా సీతా" "రామూ" అనేమాటలు అవిరామంగా అంటూనే వుండాలి.

లేదా లైట్లు ఆరిపోయి, అరనిమిషం తరువాత వెలగాలి.)

(సీత సోఫామీదవుంది. రాము గోపి ఆత్రంగా చూస్తున్నారు. పాపయ్య కూర్చున్నాడు. రంగనాథం సుబ్బయ్య నిల్చివున్నారు. పాపయ్య లేచివెళ్ళి ముక్కు దగ్గర వేలుపెట్టి)

పాప: రంగనాథం! ఏది? బ్రతికింది.

రంగ: పూర్తిగా.

పాప: ఏది? సగం బ్రతికినవాళ్లు కూడా వుంటారా?

రంగ: సగం చచ్చి బ్రతికినవాళ్లు చాలామంది పాపయ్యా!

పాప: ఏది?

రంగ : నీకర్థం కాదులే.

(సీత కదిలింది. అంతా ఆనందాశ్చర్యాలతో చూచారు)

రంగ : సీతా ! చూడమ్మా !

సీత : (వెర్రిగా చూస్తూ లేచింది)

రాము: (ఆనందంగా) సీతా !

రంగ : ఒరేయ్ నేను చెబుతాగా. వీడేనమ్మా నదిలోనుండి పైకి తీసింది. (రాము భయపడి వూరుకున్నాడు)

సీత : (లేచింది) ఏమిటిదంతా ! ఇక్కడికి నేనెలావచ్చాను ? ఎవరు తీసుకు వచ్చారు ?

గోపి : (ఆశ్చర్యంగా) సీతా ! నేనే తీసుకొచ్చాను. వారు రామూతండ్రి. ఇది వారి ఇల్లు.

రాము: ఇప్పటికైనా గుర్తించ గలిగావా సీతా !

సీత : ఎవరిని ?

రాము: అహాఁ. అందర్నీను.

సీత : గుర్తించాను.

పాప : పిచ్చిపోయిందేమిటి ఖర్మ ! ఏది ?

సుబ్బ: ఉంటే మీా కొచ్చే లాభం ? ఊరుకోండి !

పాప : సుబ్బయ్యా ! ఏది ?

రంగ : స్స్. సీతా ! చూడమ్మా ! నీకోసం గోపీ ఎంతో త్యాగంచేసాడు. చాలాశ్రమించాడు కూడా. ఈ నీ మార్పు మాకందరికీ ఎంతో సంతోషంగావుంది. ఒక్క నీ గురించేకాదు గోపీశ్రమ ఫలించినందుకు. గోపీ ! క్రితం నదిలో వురికినప్పుడే ఈమెకు మతి చెలించిందా ?

గోపి : అనుకుంటాను. పెళ్ళయ్యేవరకూ ఆమెమాటాడనేలేదు.

రంగ : మళ్ళీ అలాంటి సంఘటనవల్లే మనసు దారిలో పడిం దనుకుంటా. ఏమోలే ఒకరోగం ఎలావస్తుందో, ఏ కారణంగా తగ్గుతుందో పెద్దపెద్ద డాక్టర్లే ఇంకా నిర్ధారణ చేయలేకపోతున్నారు. అమ్మా! కాస్సేపు విశ్రాంతి తీసుకుంటావా ?

సీత : వద్దండీ. వెళతాను.

రంగ : శుభం ! గోపీ ! జాగ్రత్తగా తీసుకెళ్లు.

సీత : వారికింతవరకూ చాలాశ్రమిచ్చాను. ఇక వారిఅవసరం లేదు.

గోపి : సంతోషం సీతా ! నీ అవసరంకోసంకాదు. నేను శ్రమించింది. నీ తండ్రికిచ్చినమాటకోసం. నీపిచ్చితగ్గింది. అంతే చాలు. ఎక్కడికెళతావో తెలుసుకోవచ్చా ?

సీత : అనవసరం.

రంగ : అవసరం సీతా ! చావటానికి సిద్ధంగావున్న నిన్ను కాపాడాడు.

సీత : అందుకే బాధపడుతున్నా. బ్రతకాలనుకున్నవాళ్ళకు చావురావడం, చావుకోసం తపించేవాళ్లు బ్రతకడం జరిగింది. నాలాంటివాళ్ళను బ్రతికించినవాళ్లు చేసింది పుణ్యంకాదు. మహాపాపం !

పాప : కోప్పడకుతల్లీ ! ఏది ?...ఇంత చిన్నవయసులో అంత విరక్తి కలగడానికి...ఏది ? కారణంఏమిటి ?

సీత : చెప్పలేను.

రాధ : చెప్పుసీతా !

సీత : మీరెవరు ?

రంగ : మాకోడలు.

సీత : అంటే...

రంగ : మా రాముా భార్య.

సీత : రాముాభార్యా! వద్దమ్మా. నాగాథ నీ బాధకు కారణం కావచ్చు. శలవ్.

రాధ : ఆగండి. అధికారం చెలాయిస్తున్నానని ఆవేశపడద్దు. ఒకనాడు రాము మిమ్మల్ని ప్రేమించి పెళ్లాడతానని మోసంచేసి మీ సర్వనాశనానికి కారణమయ్యాడు కదూ?

పాప : ఏమిటీ! రాముా ప్రేమించిన అమ్మాయి గోపీభార్యా! అవ్వ ...

రంగ : అంతేకాదు. గోపీ ప్రేమించిన అమ్మాయి రాముా భార్యకూడా.

పాప : అయ్యోరామ! ఏది? ఘోరకలి! నేను వస్తాను రంగనాథం.

రంగ : మరచావా?

పాప : ఏది? మరువ లేదుగానీ...

రంగ : పాప భూయిష్టమైన నాకొంపలో ఇకవుండటం మంచిది కాదని చెబుతున్నావే...అంతేకదూ!

పాప : ఏది? నిజం చెప్పొద్దూ. నాకు చాలా బాధగావుంది. రంగనాథం ఏది? ఆడపిల్లలకు యింగ్లీషు చదువులున్నాయ్ చూశావ్! మన కొంపలు ముంచుతున్నాయి. చిన్నా పెద్దా ఏది? మడీ ఆచారం అన్నీ

మట్టికొట్టుకు పోతున్నాయంటేనమ్మ్! ఏమైనా ఈఅన్యాయాన్ని నేను సహించను.

రంగ : ఏంచేద్దాం ?

పాప : ప్రాయశ్చిత్తం జరగాల్సిందే. ఆఁ.

గోపి : పాపయ్యగారూ! మీ భార్య ఎంతవరకు చదివారు ?

పాప : ఏది? దానిమాటే ఎత్తొద్దన్నా !

రంగ : తప్పేవుంది పాపయ్యా ! మనిషి గురించికాదుగా. చదువుగురించి అడిగిందామె చెప్పు.

పాప : చాకలిపద్దుకూడా రాయఁలేదు. పట్టె చవట. ఏదీ ?

గోపి : ఏమీ చదువులేకుండా మీ ఆవిడ అంత అనాచారానికి గురైందే ?

పాప : ఏదీ ? ఏమిటయ్యా అసలు నీ వుద్దేశ్యం ?

రాధ : చదువుకున్న ఆడవాళ్లు పాడవుతున్నారన్నందుకు చక్కగా సమాధానమిచ్చారు చాలదూ ?

పాప : ఓహో నువ్వేచెప్పాలి. ప్రేమించింది ఒకణ్ని, పెళ్ళి చేసుకున్నది మరొకణ్ని !

రాధ : పాపయ్యగారూ! వయసులోనేకాదు బుద్ధికికూడా పెద్ద కావాలి. పెద్దవాళ్ళకోరికతో మెడకు మంగళసూత్రాలు కాదు ఉరిత్రాళ్లు పోసుకున్నాం. మమతలు చంపుకొని మనుషుల్లాగే జీవిస్తున్నాం. పేరుకు భర్తయినా పెడ బుద్ధులు మాలో చేరలేదు. ప్రకృతికే ఎదురుతిరిగాం. క్షణిక సుఖాలకు కళ్లుమూసుకు ప్రవర్తించనూలేదు. ప్రక్కన భర్తవుండికూడ పరాయి పురుషులకోసం ప్రాకులాడే పాపిష్టిజాతికి చెందినవాళ్ళంకాదు.

పాప : ఏది ? విన్నావా రంగనాథం. ఎంతమాటందో నీకోడలు. ఇదిగో రాధా ! మీ బ్రతుకులన్నీ రేపుబజార్లో పెట్టక పోతే నా పేరు పాపయ్యేకాదు.

గోపి : ఒకడోలుకూడా కొనిమ్మంటారా ?

పాప : విధంచెడ్డవాళ్లు ఎన్నన్నా అంటారు.

రంగ : నిజం పాపయ్యా ! విధంచెడ్డవాళ్లుకాబట్టే ఇంతగా ఎగిరి పడుతున్నారు.

పాప : ఇదిగో రంగనాథం. నువ్వు ద్వంద్వంగా మాట్లాడు తున్నావ్.

రంగ : కాదు పాపయ్యా ! నిజమే అన్నా.

పాప : ఏమినిజం ? నాగురించి, నా సంసారంగురించి ఏది ? ఈ సంతలో చింతకాయగాడికెందుకూ అంట.

రంగ : పాపయ్యా నోరు జారడం మంచిదికాదు. నా కొంపలో ఇలాంటిది జరగడం నాకు సంతోషమనుకుంటున్నావా ? నా కొడుకూ కోడలు పెళ్ళయిన దగ్గర్నుంచి విరోధుల్లా కీచులాడుకుంటూ, వేరువేరుగదుల్లో వుండటం నాకు వినోదమనుకుంటున్నావా ? ఈ బాధాకర సంఘటనవల్ల నా హృదయం ఎలా క్రుంగిపోతోందో, ఈ కారణంగా నా శక్తీ, నా ఆయుపూ ఎంత తరిగి పోయిందో నీకేం తెలుసు ? ఈలాంటి విపత్కర పరిస్థితి ఎప్పుడొస్తుందా అని ఎదురు చూశాను. సమయం మాసన్నమైంది. ఈ విషమ సమస్య పరిష్కరించడానికి సంఘుస్వరూపంలో నువ్వు నాకు సహకారిగా దొరకడం నా అదృష్టం ! గోపీ ! కాస్తో, కూస్తో ఇంగితమున్న నువ్వుకూడా

ఈసాలెగూడులో ఈగలా చిక్కు కున్నందుకు బాధగానే వుంది. చావుకోసం ఏనాడో తెగించిన నువ్వు, బ్రతుకు కోసం ప్రక్కదారి పట్టవనే అడుగుతున్నా. ఇప్పుడు నేనేం చేస్తే న్యాయంగావుంటుంది ? పెద్దలు ఆర్జించిన కీర్తిని ఎలా నిలబెట్టుకోగలను ? తప్పుచేయని పెద్ద మనిషిలా పదిమందిలో ఎలా తలెత్తుక తిరగగలను ?

గోపి : నిర్భయంగా తిరగవచ్చు.

రంగ : ఎలా ?

గోపి : మీరు ఒక్కరు చేసిన పొరబాటుకు.

రంగ : పొరబాటా ?

గోపి : మీ దృష్టిలో కాకపోవచ్చు. న్యాయం దృష్టిలో మాత్రం అవును.

రంగ : అర్థమయ్యేటట్టు చెప్పు.

గోపి : ఆదినుండీ రాముకు మీముందు మాట్లాడ్డమే భయం. మాట్లాడినా మీరు వినరనే అనుమానం. ఆకారణం గానే అతనిలో వ్యక్తిత్వం నశించింది. ఈ సంగతి మీకు తెలుసు. పెళ్లిచేసేముందు అతని మనస్సు పసిగట్టడం మీ ధర్మం. అలాజరగలేదు. మీ మాటే అతనికి శాసనమైంది. అందుకే యింత అఘాయిత్యం ఏర్పడింది.

రంగ : ఇంతకూ పెళ్ళిచేసే పెద్దలు బిడ్డలమనస్సును అర్థంచేసు కోవాలంటావ్, వాళ్లు చెప్పకపోయినాసరే. ఒప్పుకున్నా. ఇప్పుడు చేయాల్సినపని ?

గోపి : రాముకి సీతనిచ్చి పెళ్ళిచేయండి.

రంగ : గోపీ !

పాప : ఎంతదారుణం !

గోపి : ఇంతకు మించి నేనేమీ చెప్పలేను.

రంగ : ఆ తర్వాత రాధను నీకిచ్చి పెళ్ళిచేయాలంటావ్.

గోపి : అనను. నాకోసం కాదు. అమాయకుడైన నామిత్రుని కోసం, అనాథురాలైన ఆ సీతకోసం. ఆ తర్వాత నేనే మైనా, ఆరాధ ఏమైన మాకు బాధలేదు.

రంగ : ఆమెను కూడా వెనకేసుకు మాట్లాడుతున్నావ్ ?

రాధ : అతను అన్నమాట ఆచరించడంలోనా అభ్యంతరంలేదు. వాళ్ళిద్దరి పెళ్ళి చెయ్యండి. మీ కళ్ళెదురుగా మేము ప్రాణత్యాగం చేయటానికి కూడా సిద్ధమే.

పాప : ఏది ? విడ్డూరంగానేవుంది.

సీత : నాకు పెళ్ళివద్దూ. పెటాకులువద్దు. క్షమించండి. నేను వెడతాను.

రంగ : ఆగు సీతా !

సీత : ఆపుచేయడానికి మీరెవరు ?

రంగ : ఎవరినో తర్వాతచెబుతా. నువ్వు ఎక్కడికి వెడతావ్ ?

సీత : నాయిష్టం వచ్చిన చోటికి.

రంగ : అది కూడదనే చెబుతున్నా. ఆడదానికి హద్దులు లేక పోతే; వచ్చే అపాయాన్ని గుర్తించే, పెద్దలు శాస్త్రాలు సృష్టించారమ్మా !

సీత : వాటిఆధారంతోనే స్త్రీజాతినంతనీ చిత్రవధచేస్తున్నారు.

పాప : అదికాదు రంగనాథం ! మీ అబ్బాయినిచ్చి మరోపెళ్లి చేస్తే హాయిగా యిక్కడుండాలనే ఈమెకోరిక...ఏది?

గోపి : పాపయ్యగారూ! ఈ విషయంలో మీ ప్రసక్తి అనవసరం. ఈ మూర్ఖ సిద్ధాంతాలతోనే సమాజాన్ని జీవశ్ఛవాన్ని చేసారు. సీతకు అలాంటివుద్దేశ్యంవుంటే తప్పేముంది?

పాప : ఏది? అయితే ఇష్టం లేనప్పుడల్లా ఒక్కొక్కణ్ణి మారొచ్చుగా.

రాము: పాపయ్యగారూ! బుద్ధిలేకుండా మాట్లాడకండి. వీళ్ళ బ్రతుకులుకూడా మీ భార్య బ్రతుకులాగా కాలిపోతే మీ పెద్దలంతా అప్పుడానందిస్తారు.

పాప : విన్నావా రంగనాథం!

రంగ : విన్నాను. ఇకనువ్వు మాట్లాడకు.

పాప : అంతేలే కొడుకుమాట కాదంటావా ఏమిటి? ఈ రాత్రి శివరాత్రి అయింది. తూర్పు తెల్లారుతోంది. ఇక నాకు భయంలేదు. వెడతాను రంగనాథం.

రంగ : మరచావ్.

పాప : అమ్మో! మరచిపోలేదు. ఏ నేరంలేని నాకెందుకయ్యా శిక్ష. సరే! ఇక్కడే కాస్సేపు కునుకుతీస్తా. (సోఫాలో కళ్ళుమూశాడు)

రంగ : గోపీ! వీళ్ళందరికన్నా నువ్వేదో తెలివైనవాడవనుకున్నా. నువ్వుకూడా వీళ్ళ దారిలోనే పడ్డావ్. నేను మొదట్లోనే చెప్పాను. అనాచారం నా కొంపలో జరగడానికి వీలు లేదని.

గోపి : ఇంతకూ మీ వుద్దేశ్యం ఏమిటో?

రంగ : అర్థంకాలేదు. మీ అందరికీనా?

రాము: నాకూ కాడా !

రంగ : నీ కర్థంకాదని నాకు తెలుసు. అమ్మాయి సీతా !

సీత : మీరు చెప్పబోయేది అర్థమైనా ఆచరించడానికి ఇక్కడ ఎవ్వరూ సిద్ధంగా లేరు.

రంగ : పిచ్చిదానివల్లా ఒకేసారి ఎంత తెలివైనదానవయ్యావమ్మా ! ఆచరణ అనేది దేనిమీద ఆధారపడి వుంటుందో చెప్పగలవా ?

సీత : అభీష్టంమీద.

రంగ : అభీష్టానికి మూలమేదో నువ్వుచెప్పు రాధా !

రాధ : భావం !

రంగ : భావముత్పన్నమయ్యేచోటు. . . గోపీ !

గోపి : మనస్సు.

రంగ : మనస్సు కోరినదంతా మంచిదనుకోవడం మంచిదా రామూ !

రాము: కొందరికి కాకపోవచ్చు. నాకు మంచిదే.

రంగ : అంధుడు చూడగోరేదంతా అందంగానే అనిపిస్తుందిరా! కాని కనిపించదు.

గోపి : "ఆత్మ బుద్ధీ సుఖంచైవా" అని మీలాంటి పెద్దలు చెప్పడంలో అర్థం ?

రంగ : అనర్థం తెచ్చుకోవద్దనే. బుద్ధి, మనస్సు ఒకటేనని భ్రమించడం పొరబాటు గోపీ !

రాము: బుద్ధికీ మనస్సుకీ తేడా వుందంటారా ?

రంగ : ఉంది. కాస్తా కూస్తా కాదు. రాక్షసులకీ దేవతలకీవున్నంత తేడావుంది. మనస్సు కోరిందల్లా మానవుడు చేయదలిస్తే

జంతువుగా మారడంలో ఆశ్చర్యంలేదు. మనస్సుమీద బుద్ధే పెద్దరికాన్ని పొందకపోతే, ఆటంబాంబులతో, హైడ్రోజన్ బాంబులతో ప్రపంచం ఈనాటికే పూర్తిగా నాశనమయ్యివుండేది. మీనలుగుర్లో బుద్ధులు పూర్ణంగా పూర్ణానుస్వారమై మనస్సులు ప్రాణంపోసుకు మసులు తున్నాయి కాబట్టే, ఈ అవక తవకలకు ఆధార మయ్యాయి.

రాధ : కానిపనులు మేమేం చెయ్యలేదు.

రంగ : అవునన్న పని చేయగలిగారా అని అడుగుతున్నా.

గోపి : మీకు నచ్చనిదల్లా కాని పనిగా భావిస్తే బాధ్యత మాదికాదు.

రంగ : ఎవరిది ? మాట్లాడరేం ? మాట్లాడే సాహసంలేదు. మీరు చేసిన చేయబోతున్న ప్రతిపనికీ మీరేబాధ్యులు. భగవంతుణ్ని అడ్డుపెట్టుకుని దాటాలన్నా, పెద్దలు మొద్దులని నిరూపించాలన్నా దారుల్లేవే! ఉన్నతమైన మన సాంఘిక కట్టుబాట్లనూ, పవిత్రమైన వివాహ వ్యవస్థనూ పంకిలం చేయాలని పక్కదార్లు పట్టారా ? జాగ్రత్త !

గోపి : అంటే !

రంగ : యథాప్రకారం మీ మీదంపతులు అన్యోన్యంగావుంటే ఆనందిస్తాం !

రాము: లేకపోతే.

రంగ : హతం చేస్తాం.

రాము: నాన్నా !

గోపి : ఏమిటండీ మీ దౌర్జన్యం?

రంగ : లేకపోతే అరాచకాన్ని అభినందిస్తా మనుకున్నావా! నీచాన్ని ప్రోత్సహిస్తామనుకున్నావా?

రాధ : మావయ్యా!

రంగ : పవిత్రులుకోరే కోరికేనాయిది. పతివ్రతలు వాంఛించే పరమార్థమేనాయిది? మనదేశంలో స్త్రీమూర్తి పొందిన గౌరవం ఏదేశంలోనూ, ఏ ఆడదీ పొందలేదు. ఒక్క స్త్రీగురించేకాదు నేను చెప్పేది. పురుషులుకూడా. అదుపాజ్ఞలున్నప్పుడే హద్దులు తెలుస్తాయి. హద్దులు తెలిసినప్పుడే విధ్యుక్తధర్మం బోధపడుతుంది. ధర్మాన్ని తలదాల్చినప్పుడే దేవత్వం సన్నిహితమౌతుంది. అప్పుడే ఆడదిగాని మగవాడుగాని ఆదర్శమూర్తులవుతారు. గోపీ! మీ కోరిక సమంజసమూ కాదు. న్యాయ సమ్మతమూకాదు. అందుకే అందరి శ్రేయస్సుకోరి అగ్నిసాక్షిగా పెళ్ళాడిన మీరు అనుకూల దంపతులు కండి.

గోపి : ఇది జరిగే పనేనా!

రాము: కాదు. మనసులు కలవని కాపురం చేయలేం.

రాధ : నిజమే.

సీత : నా వుద్దేశ్యం కూడా అదే!

రంగ : (వెర్రిగా) ఆగండి. చెవిటి వాళ్ళకు చిన్నగా చెప్పినా, గుడ్డివాళ్ళకు పెద్దవెలుతురు చూపినా ప్రయోజనం వుండదు. అందుకే గట్టిగా అరిచాను. కాదు శాసిస్తున్నా. పురోహితుల పవిత్ర మంత్రాలతో దంపతులైనమీరు,

ఆ దాంపత్యాన్ని విస్మరించి, మంగళసూత్ర ప్రాధాన్య తను మంటగలప సిద్ధమయ్యేవాళ్లు ... మట్టిలో కలవ డానికి కూడా సిద్ధంగా వుండాలి.

రాము: ఏవిటండీ !

రంగ : నిజమైన ప్రేమ త్యాగాన్ని కోరుతుందని ఎప్పుడో చెప్పా మీకు. అది ఒక్క గోపీలోనే చూశా! అతన్ని కూడా మీ దారిలోనే మలచుకున్నారు. మీ మీ వాంఛలు సమర్థనీయమూ కాదు. సహజమూ కాదు. మీ మీ స్వార్థాలకోసం సర్వనాశనం కోరడంకన్నా మీరు నలుగురూ ఒక్కసారే నాశనం కావడం మంచిది. ఏమంటారు? మాట్లాడరేం? ఈ స్వల్పత్యాగానికే భయపడే మీ ప్రేమ నిజమైన ప్రేమని చెప్పడం వట్టి భ్రమ. వ్యామోహాన్ని 'ప్రేమ' అని చెప్పుకు మురుస్తున్నారు.

రాధ : కాదు. కాదు. మీరలా మాట్లాడకండి.

రంగ : ఎలా మాట్లాడాలి? నిజమే అంతబాధకలిగిస్తే, మీ అబద్ధానికి నేనెందుకు బద్ధుడనుకావాలి. ఏవమ్మాసీతా!

సీత : నేను సిద్ధంగానే వున్నాను. మీరు కోరిన త్యాగానికి.

రంగ : శభాష్! ఏరా రామూ! ఇంతప్రేమించే నీ ప్రియురాలు పోతే నువ్వు సుఖంగా వుండగలవా?

రాము: ఉండలేను.

రంగ : ఏం గోపీ!

గోపి : చావంటే నాకు భయంలేదు. ఆ సంగతి మీకు తెలుసు.

రంగ : (రివాల్వర్ తీసాడు) రాధా!

రాధ: కానివ్వండి. మీకోరిక అదే అయితే కానివ్వండి. బ్రతికి బాధపడేదానికన్నా చావడమే సుఖమని ఎప్పుడో నిర్ణయించుకున్నాను.

రంగ: (గురిచూసి) ఇదిపరీక్షా కాదు. ప్రమోదమూ కాదు నేను సెషన్ జడ్జీగా ఉద్యోగంలో వున్నప్పుడు వచ్చిన ఎక్కువ హత్యా నేరాలు వ్యామోహకారణాలే. అందుకే ప్రేమని పరవళ్లు త్రొక్కి పరపురుషునికోసం మగణ్ని చంపిన ఆడదాన్ని, అన్యస్త్రీ కోసంహత్యచేసిన మగ వాళ్లను వట్టినే క్షమించలేదు. అందర్నీ వురికంబాల కెక్కించాను. వాళ్లు గిజగిజా తన్నుకు చచ్చినవార్తవిని కూడాచలించలేదు. అందుకే ఈధైర్యానికి పూనుకున్నా. నాచేతులు మీకుగా మీనలుగురూ: మరణించిన తర్వాత నేను నేరస్తుణ్ని కావచ్చు. కాని (జేబులో నుండి బాటిల్ తీసి) ఇది "పొటాషియంసైనేట్" ఇది నాలుక్కి తగలగానే నేనూమరణిస్తాను.

(పాపయ్య, సుబ్బయ్య భయంగా చేరారు)

పాప: (వణకుతూ) రంగనాథం!

రంగ: నువ్వేం మాట్లాడకు

పాప: ఈ దారుణాన్ని నా కళ్ళతో చూడలేనయ్యా!

రంగ: వెళ్ళడానికికూడా వీల్లేదు.

పాప: అయితే అంతా చచ్చినతర్వాత.

రంగ: పోలీసులు నిన్ను పట్టుకపోతారని భయమా (ఉత్తరం తీసి) నీకూ, సుబ్బయ్యకూ ఏంఘర్వాలేదు. వివరాలన్నీ యిందులోవున్నాయ్.

రాము: నాన్నగారూ !
రంగ : ఏం ? బ్రతకాలని ఆశవుందా ?
రాము: లేదు.
రంగ : మరెందుకా పిలుపు ?
రాము: ఇంత దారుణంగా చంపే దానికన్నా...
రంగ : ఏం చేయమంటావ్ ?
గోపి : ఆ 'పొటాషియం సైనేట్' మాకిమ్మని వాడి వుద్దేశ్యం అనుకుంటా.
రంగ : మీకందరికీ ఇమ్మంటారా ?
రాధ : అవును మామయ్యా !
రంగ : సరే ! సుబ్బయ్యా. నాలుగు గ్లాసులు మంచినీళ్లు ... (సుబ్బయ్య వెళ్ళాడు)
పాప : ఎందు కిష్టపడ్డార్రా ! మనస్సులు కలవకపోతేమాత్రం ఏది ? కళ్లు మూసుకు కాపరం చేయకూడదూ ?
రాధ : అంత నీచులం కాదు.
పాప : అంటే నేను నీచుణ్ని అన్నమాట.
రంగ : పాపయ్యా !
పాప : అదికాదు రంగనాథం ! ఏది ?
రంగ : ఏదీకాదు. ఏదిమాట్లాడినా నువ్వుకూడా వాళ్ళల్లో ఒకడివి కావాల్సి వుంటుంది.
పాప : అయ్యోరామా ! నోరేకాదు. కళ్లుకూడా మూసు కుంటాను. (పాపయ్య భయంగావున్నాడు. "ట్రే"లో నాలుగుగ్లాసులు పెట్టుకుని సుబ్బయ్యవచ్చాడు)
రంగ : తీసుకొచ్చావుగా ! (మందు గ్లాసులోపోస్తూ) ఎలా

గయినా చావడం తప్పదు. యెప్పుడైనా చావుతప్పదు. రక్తపాతంలోపడి చావడం నిజంగా నాకూయిష్టంలేదు. మాట్లాడుతూ మాట్లాడుతూ చచ్చేవాళ్ళే నిజంగా ధన్యులు! మరచా. నాకు వేరేగ్లాసు ఏది?

సుబ్బ : మీరుచెప్పింది నాలుగుగ్లాసులే బాబయ్యా!

రంగ : ఓ! వయసుమీరిందికదూ! మరచాను. ఈ నలుగురూ లాగే, నేనూ చావడం న్యాయంకాదు.

పాప : అయితే నువ్వు బ్రతుకుతావా రంగనాథం?

రంగ : నోరుమూస్తా నన్నావ్?

పాప : చచ్చాం! అలాగేచేస్తా. నువ్వొక్కడవన్నా మిగిలితే...

రంగ : నీ పాడుకబుర్లు వినడానికి పనికివస్తానంటావ్.

పాప : ఏది? ఇదిగో రంగనాథం!

రంగ : ఓహో! ఛస్ ఆడుకోడానికి సాయంగా నాతోనే వస్తా నంటావ్.

పాప : అయ్యోరామ! ద్వందంగా మాట్లాడ్డం ఇకనైనా మానెయ్యవయ్యా!

రంగ : ఇక నా మాటే వినిపించదుగా. నలుగుర్ని హత్యచేసిన నేను సుఖంగాచావడం మంచిదికాదు. రివాల్వర్‌లో అయిదు గుళ్ళుకూడా వున్నాయి. ఈకణతదగ్గిరగురి చూపుకుంటే యిక పాపయ్యకబుర్లే వినిపించవ్. ఆఁ సుబ్బయ్యా! (ట్రే తీసుకున్నాడు) ఆఁ వెలుగు రేఖలు విరజిమ్ముతున్నాయి. సూర్యోదయంకావస్తోంది. అంతకు ముందే మనమంతా అంధకారంలో కలవాలి. ఆలస్యం

చేయొద్దు. ఊఁ. తలో గ్లాసు తీసుకోండి. ఏం? ఆలస్య మేమిటి? సరే! నేనేయిస్తా!

రాము: (దుఃఖం) యిది న్యాయంగా లేదండి నాన్నగారూ!

రంగ: న్యాయమూర్తి దగ్గర న్యాయం గురించి నువ్వు మాట్లాడతావేమిరా? ముందు నువ్వే తీసుకో? ఊఁ. (తానే యిచ్చాడు) గ్లాసు తొణికినా, మందు నేలపాలైనా దగ్గిర రివాల్వర్ వుందని మాత్రం మరచిపోవద్దు.

రాము: పోనీ వాళ్లను చంపొద్దులెండి.

రంగ: నీ రాధ నేలుకుంటావా?

రాధ: అతను ఏలుకుంటా నంటే మాత్రం ఆమోదించే వాళ్లెవరు?

రాము: నీ పాడు ముఖాన్ని ఏలుకుంటానని చెప్పిందెవరు?

రంగ: పోయే ముందు పేచీ పడటం వినేవాళ్లకి హీనంగా వుంటుంది. సీతా నువ్వు?

సీత: (రామూ చేతిలో గ్లాసు తీసుకుంటుంది)

రంగ: సాహసమంటే నీదమ్మాయ్. కాని ముందు నువ్వు తాగటానికి వీలులేదు. అంతా ఒకేసారి తీసుకోవాలి. అంతా ఒకేసారి చావాలి. (ఈలోపుగా రాము, గోపీ, రాధా కూడా గ్లాసులు తీసుకున్నారు) త్యాగమూర్తులు! Good! రేపటి పేపర్లో ఈ విచిత్రగాథ పెద్ద అక్షరాలతో పడేదానికి కూడా ఏర్పాటు చేసాను. ఆఁ. ఆగండి. ఇప్పుడే వస్తా. (లోనికి వెళ్లాడు)

పాప: (భయంగా అటు చూసి) ఇదిగో రామూ! నాకు బుద్ధి వుందా అని అడిగావు. ఏది? నీకు బుద్ధి అంటూ వుంటే

మీనాన్న కెదురు తిరిగి ఈఅన్యాయాన్ని ఆపకూడదూ?

రాము: మీరే ఆపని ఎందుకు చేయకూడదూ?

పాప: నేనా! ఏది? ఆమనిషినిచూస్తేనే భయం. లేకపోతేనా...

రంగ: (తిరిగివస్తాడు) ఏవిటిపాపయ్యా! యీ పరోక్ష ప్రోత్సాహం?

పాప: నా నెత్తి (కూర్చున్నాడు)

రంగ: ఆఁ. ఏమీ లేదు. మనసులుకలవని మనువుకన్నా మరణమే మంచిదని మీ అందరి అభిప్రాయమూ అయితే అదేసందేశాన్ని వ్రాసిన ఈ కాగితంమీద మీరందరూ సంతకాలు చెయ్యాల్సివుంటుంది. కోరిమరణాన్ని తెచ్చుకునేవారు ఏ తీరని కోరిక కారణంగా ఈ పనిచేశారో ప్రపంచానికి తెలియడం అవసరంకదూ!

ఇదే, భవిష్యత్తులో భావియువతీయువకులు తొట్రుపడకుండా సమాజానికేయిది గుణపాఠంగా వర్ధిల్లుతుంది. కానివ్వండి సంతకాలు. ఇది కూడా పత్రికలో ప్రచురితమౌతుంది. ప్రజాకోటిలో మీ వ్యధలు కథలుగా అల్లుకొని కమ్మగా కబుర్లు చెప్పుకుంటారు.

(అందరూ సంతకాలుచేశారు.పరిశీలిస్తున్న రాధనుచూసి)

పోయేముందు ఆ పరిశీలన నెందుకమ్మా రాధా! నీ ఆస్తిని హస్తగతం చేసుకుంటానని అనుమానమా! నేను!బతికుంటేగా ఆపనిచేయటానికి...ఊఁ...సంతకం చెయ్యమ్మా!

(అందరి సంతకాలు పూర్తి అయ్యాయి)

ఇప్పుడు సిద్ధంగా వుండండి. నేను ఒకటి; రెండు;

మూాడు; అనేసరికి అందరూ గ్లాసులు నోటిదగ్గరుంచి 'ఊఁ' అన్న వెంటనే ఒక్క-గుటక వెయ్యాలి. అంతే! ఆతర్వాత సుఖంగా దీర్ఘనిద్రపోతారు. ఏం వింటున్నారా?

పాప : రంగనాథం!

రంగ : మరోగ్లాసు తీసుకురా సుబ్బయ్యా!

పాప : అమ్మో! నేను ఏం మాట్లాడను.

రంగ : సరే! ఒకటి – రెండు – మూాడు.

(నలుగురూ గ్లాసులు మూాతి దగ్గర పెట్టుకోబోతారు)

సుబ్బ: బాబయ్యా!

రంగ : ఏం? నీక్కూ-డా మనసు కరిగిందా?

సుబ్బ: అదికాదు బాబయ్యా! మనుషుల్ని ఉరికంబాని కెక్కిం చేప్పుడు ఆఖరికోరిక ఏదన్నా వుంటే చెప్పమంటారటగా బాబయ్యా!

రంగ : అవును. బాగా జ్ఞాపకం చేసావ్. ఏం గోపీ! రామూ! రాధా! సీతా! మీా అంత్యకోరిక ఏమిటో యీా అంత్య సమయంలో చెప్పుకుంటారా? (ఎవరూ మాట్లాడరు) ఊఁ చెప్పాలి.

రాము: (ఏడుస్తూ) మాకేం కోరికలు లేవండి. మమ్మల్ని చంపండి.

రంగ : ఆఁ!

సీత : అవునండీ చచ్చేముందు మాకేం కోరికలుంటాయ్.

రంగ : అంతేనా?

గోపి : చిన్న Request!

రంగ : కానియ్!

గోపి : సీతా రాముూ దంపతులు కావాలని ఎంతగానో మురిశాను. ఆ ఆశలు తీరకముందే అంత మవుతున్నారు. మీకు ఆఖరికోరిక తీర్చేధైర్యం వుంటే, వాళ్ళిద్దర్నీ దంపతులుగాజేసి, ఆశీర్వదించి ఆ తర్వాత మీకోర్కె తీర్చుకోండి.

రంగ : అర్థమైంది. సుబ్బయ్యా! పూజామందిరంలోని ఆ పూల దండలు-

సుబ్బ: చిత్తం. (వెళ్లాడు)

రంగ : రామూ! నీ మిత్రునికోరిక చాలా ఉదాత్తంగావుంది. నువ్వూ సీతా దంపతులు కావాలని కోరుకున్నారు కదూ!

రాము: మేమేకాదు. గోపీ రాధా కూడ అలాగే కోరుకున్నారు. వాళ్ళ కోరిక కూడా...

(సుబ్బయ్య దండలు తెచ్చాడు)

రంగ : సంతోషం! వాళ్ళకే యివ్వు. ఆగ్లాసులు చేతిలో వున్నాయ్ కదూ! పాపయ్యా, కళ్లు తెరచి కాస్త సాయం చేస్తావ్ ?

పాప : మాయదారి పాపయ్యలే...ఏది ?

రంగ : ఊఁ. ఈ 'ట్రే' లో ఆ గ్లాసులుపెట్టు ... జాగ్రత్త. (పాపయ్య భయంగానే గ్లాసులు తీసుకున్నాడు. అంతా దండలు తీసుకు నిల్చారు)

అలాగే నిలిచారేం! మీ ఆనాటి కోరిక ఈనాటి అంత్యకోరిగ్గా తీర్చుకోండి. జంట జంటలుగా నిలవండి. మహదానందంతో హృదయపూర్వకంగా దండలు

వేసుకోండి. కాని యిదే నిజమనీ, ఇలాగే వుండిపోతా మనే మధురవాంఛలు మీమనస్సులో చొరనీయకండి. వెంటనే మరణముందనీ, మరుజన్మలోనైనా, మీ కోరికలు నెరవేరాలనీ భగవంతుని హృదయపూర్వకంగా కోరుకుంటూ దండలు వేసుకోండి. అవకాశం లేదు. వెలుతురు రాబోతోంది. ఊఁ.

(అంతా దండలు వేసుకున్నారు. రంగనాధానికి నమస్కరించబోయారు)

దూరంగావుండండి. నేనిప్పుడు దీవించేపెద్దనూ కాను. నా దీవెనకూడా ముందేచెప్పా. నేను దండించేకింకరుణ్ణి మాత్రమే. ఊఁ. సుబ్బయ్యా! ఆ గ్లాసులుఅందజెయ్యి. ఇప్పుడన్నా సంతోషంగా తీసుకోండి విషం!

పాప : విషం!...రంగనాధం. నువ్వేమన్నాఅను. నేనుమాత్రం యీ దారుణాన్ని చూడలేను. పోనీ వాళ్ళను అలాగే బ్రతకనియ్యకూడదూ?

రంగ : పాపయ్యా!

పాప : నువ్వేంచేసినా సరే! నన్ను చంపినాసరే, ఏది? నేను సహించను. '(టే' గ్లాసులతో (పక్కకు విసిరేశాడు) గల్లుమని గ్లాసులు పడిపోయాయి)

రంగ : (రివాల్వర్ తీసాడు. ఉగ్రరూపం ధరించాడు.) పాపయ్యా!

పాప : (ధైర్యంగా నిలచాడు) అవును. చిలకా గోరువంకల్లా వున్నవాళ్లను చంపడానికి ముందు నన్నుచంపెయ్! నేను సిద్ధంగావున్నా. వెధవప్రాణం.

రంగ : ఆలోచించుకునే మాట్లాడుతున్నావా? ఆవేశంలో అరుస్తున్నావా?

పాప : ఏది? అదినీది. నేనాలోచించుకునే అంటున్నా. వాళ్లు చేసిన తప్పేవిటి? అసలు వాళ్ళను చంపడానికి నీ కే మధికారముంది. ఇది కోర్టూ కాదు. నీకా ఉద్యోగమూ లేదు. వాళ్ళనిఇలాగే దంపతులుగా వుంచితే నీ సొమ్మేం పోయింది?

రంగ : పాపయ్యా! నువ్వేనా యీమాటలంటున్నది?

పాప : నేనే... ఏది? నేనే...

రంగ : మరి ముందులో అన్న మాటలు.

పాప : ఏది? అందరనేదే నేనూఅన్నా.

రంగ : ఇంతజ్ఞానం వున్నవాడివి నీభార్యను నౌబత్ రావుకిచ్చి, అనుమానంకలిగిన్నాడె వాళ్ల చేతులుకలిపి అక్షతలుచల్ల లేకపోయావ్!

పాప : ఏది? నా ఎదురుగా పడి ఇలా అఘోరి స్తే ఆపనే చేసే వాణ్ని. ఏది? చెప్పానుగా– చెప్పకుండా జెండా ఎత్తే శారని.

రంగ : వెళ్లిపోయిన నీభార్య కారణంగా...అందరూ అలాంటి వాళ్లేనని చెప్పే నీతప్పుడు మాటల్లో ఎంత అక్కసూ, కుళ్లూవుందో ఒక్కసారైనా ఆలోచించావా?

పాప : తప్పేనయ్యా! అది తప్పే ఇకెప్పుడూ అలాంటి తప్పుడు మాటలనను ఏది? ఇప్పుడు నువ్వు చేసేపని ఒప్పా! అని ... ఏది?

రంగ : ఒప్పే...ఈనాడు జీవకారుణ్యాని మనసులో పెట్టుకుని

వీళ్ళను తారుమారుగా దంపతులనుచేస్తే; నీలాంటి వ్యక్తులరూపంలోవున్న సమాజం నన్నూ, వాళ్ళనూ ఏవిధంగా క్షమిస్తుంది. పరిస్థితుల ప్రాబల్యానికి పవిత్ర ఆదర్శాన్నీ నేను బలిచేయను పాపయ్యా! నానిర్ణయాన్ని నువ్వేకాదు ఎవ్వరూ మార్చలేరు. విషం పోయినా దీనిలో అయిదు గుళ్లు వున్నాయని ముందే చెప్పా. ఊం.వన్...టూ...

పాప : (బిగ్గరగా) ఆగు! (చేతులుపట్టుకుని) ఇవి చేతులుకావు కాళ్లనుకో రంగనాథం. వాళ్ళను చంపకు. వాళ్ల నూరేళ్ల జీవితాన్ని నాశనంచేయకు. అంతగా చూడలేకపోతే ముసలివాళ్ళం నువ్వూనేనూ చద్దాం. (కన్నీళ్లుతిరిగాయి)

రంగ : లే పాపయ్యా లే. (లేస్తాడు రంగనాథం గంభీరంగా ముందుకు వొచ్చాడు) అర్థమైంది. మనుష్యుల్లో రంగు భేదాలున్నా ప్రపంచమంతా ఒకటే. మానవులంతా ఒకటే. ఒకదేశంలో ఆచారం మరొక దేశంలో అనాచారమైనా, అంతరాలూ, అనుభూతులు అంతటా ఒక్కటే, అందుకే ఛాందసుడవైననువ్వు, అందరినీ అనాచారులుగా చెప్పేనువ్వు, ఈ తారుమారు పెళ్ళిళ్ళను ఒప్పుకున్నావ్. నువ్వేకాదు. మమకారం శృతిమించగా, మంచి తలెత్తినప్పుడు ప్రతిమానవునిస్థితీ యింతే; జీవులంతా మాలగా, దారమే అనురాగంగా భావన సిద్ధించిన మానవుడు పరులనే భావన తీసివేసి అందరిబాధ తనబాధగానే గుర్తిస్తాడు. అప్పుడే మహాత్ముడు కాగలుగుతాడు. ఆస్థితి సాధారణమైంది

కాదు. సాధారణలకు రాదుకూడా. అందుకే ఆదిలో ఒకసాహసాన్ని చేయడానికి పూనుకున్నాను. సంఘం ఆమోదించదనీ, అంతరాలు కలిసిన వాళ్ళ 'ఆత్మ స్థైర్యాన్ని' పరీక్షించాలనే యీపనిచేసాను. విజయు లయ్యింది నువ్వూకాదు. నేనూకాదు. పరిస్థితులు.

దేశంలో మన సమాజంలో వ్యథాపూరిత జీవితాల నెన్నిటినో పరిశీలించి జరిగిపోయే దుర్ఘటనలకెంతో కన్నీరుకార్చి హృదయమున్న మన ప్రభుత్వం ఏనాడో విడాకులచట్టాన్ని ఆమోదించింది. దానినే నేనీనాడు అమలుపరచాను. అయితే ఇది కొందరికి విషగుళికగా భయాన్ని కల్గించినా మోడువడిన మరికొందరి జీవితా లకు అమృతప్రాయమై తిరిగి చివురించే అదృష్టాన్ని కల్గిస్తుంది.

ఓడిపడబోసిన వీళ్ళజీవితాల్లో ఇక ఏనాడూ పొర బాటే జరగకుండా విడాకులచట్టాన్ని ఆమోదించినట్లుగా సంతకాలు తీసుకున్నాను. అంతమాత్రాన కోర్టువారి ఆమోదం కాలేదనే సంశయం విజ్ఞులలోతలెత్తినా, ఈ తతంగంలో తప్పక విజయంపొందే సద్లక్షణా లున్నాయి. కాబట్టే ఈసమస్యా పరిష్కారానికి సాహ సించాను. సహకరించి భవిష్యత్తులో విజయుల్నికూడా చేస్తాను. ఆ ఆత్మవిశ్వాసంతోనే, ఈ నూతన దంపతు లను ఇకనుండైనా ఆశయసిద్ధులై సుఖశాంతులు చూరగొనాలని ఆశీర్వదిస్తున్నా. సుబ్బయ్యా! పంజ

రంలో పక్షులకు స్వేచ్ఛనివ్వు.
(దంపతులు నమస్కరిస్తారు)

పాప : ఏది ?...నా కర్థంకాలే.

రంగ : నీ కర్థంకాకపోయినా నేను చేసేపని వ్యర్థమైందికాదు. రాధా ! ఇక నా కోడలివికాదు. మీ అమ్మకూ, అన్నకూ నేను సమాధానం చెప్పుకుంటాను. ఇకనుంచి నా యింటి ఆడబిడ్డగా నేవస్తూ సారె చీరలతో వెళుతూ వుండు.

గోపీ! నువ్వు కోరినవరం నీకు లభించింది. ఒక పగలు గడిచింది. రాత్రిలో పడ్డారు. చీకటి చీల్చుకు తిరిగి వెలుతురు ప్రసారిస్తుంది. ఇక మీ జీవితాల్లో కూడా వెలుగు రేఖలు ప్రవేశిస్తాయి. వెళ్ళిరండి.

(సుబ్బయ్య పంజరం తీసుక వీధివైపుకు వెడుతూ వుంటాడు)

సీత : (ఆనందంగా) మావయ్యా !

రాము: (ఆలింగనం) నాన్నా !

రంగ : అపార్థం చేసుకున్నారు. ఇదే నా యదార్థ స్వరూపం !

పాప : ఏది. రంగనాథం ! నువ్వు వున్నావ్ చూశావ్‌- ఏది? అద్భుతమైన మనిషివయ్యా !

సుబ్బ: (లోనికి వచ్చి ఆనందంగా చూస్తున్నాడు)

(దూరంనుంచి సుప్రభాతం - మంగళం)

శుభం.

135


# శ్రీ మురళీకృష్ణ స్టోర్సు

ప్రభుత్వ ప్రచురణ పుస్తకములకు ఆథరైజుడు డీలరు

బుక్ సెల్లర్సు & స్టేషనర్సు

పవరుపేట :: ఏలూరు.

మా వద్ద ఒకటవతరగతి నుండి 5 వ తరగతి ప్రభుత్వ వాచకములు. 3, 4, 5 త, గైడులు, అన్నిరకముల హైస్కూలు టెక్స్టు పుస్తకములు, గైడ్సు, యస్.యస్. యల్.సి., మెట్రిక్ టెక్స్టు పుస్తకములు, గైడ్సు, Test-papers, సోషల్ రికార్డులు, టి. యస్. యల్. సి. గైడ్సు, స్టేజీ, సాంఘిక నాటకములు, నాటికలు, కథలు, నవలలు, రామాయణ, భారత, భాగవత, పురాణ, వైద్య, జ్యోతిష గ్రంథములు, అష్టోత్తర సహస్రనామములు, (ప్రాథమిక, మధ్యమ, రాష్ట్ర), ప్రవేశిక, విశారద, హిందీ టెక్స్టు పుస్తకములు, గైడ్సు, హైదరాబాదువారివి ప్రథమ, మధ్యమ, ఉత్తమ, విశారద టెక్స్టు పుస్తకములు, గైడ్సు, గవర్నమెంటు పరీక్షలకు పనికివచ్చు అన్నిరకముల కోడ్ పుస్తకములు, డైరీలు, గ్రీటింగుకార్డులు, ఫైల్సు, అకౌంటు పుస్తకములు, స్కూలుకు, ఆఫీసులకు పనికి అన్నిరకముల స్టేషనరీ సామానులు, ఫ్యాన్సీసామానులు సరసమైనధరలకు విక్రయించబడును.

పిన్నలకు పెద్దలకు విజ్ఞాన, వినోద, ఆనందములు కలిగించు అన్నిరకముల తెలుగు, ఇంగ్లీషు, హిందీ నవలలు, నాటకములు, కథల పుస్తకములు ఉన్నవి.

---

N. B. గ్రంథాలయములకు మా ప్రత్యేకత.

136

ఒకేదఫా పదిరూపాయలు పుస్తకములు తీసుకున్నవారికి పోస్టేజీ ఉచితం.

| | | | రు.న.పై |
|---|---|---|---|
| "పంజరంలో పక్షులు" | నాటకం | శ్రీ పినిశెట్టి | 2-25 |
| అన్నా - చెల్లెలు | ,, | ,, | 2-00 |
| పల్లెపడుచు | ,, | ,, | 2-00 |
| ఆత్మీయులు | ,, | ,, | 2-00 |
| ఆడది | నాటికలు | ,, | 1-50 |
| దత్తత | నవల | ,, | 3-00 |
| కరుణామయి | ,, | K. R K. శాస్త్రి | 3-00 |
| వివశువు | కథలు | 'ఆహరా' | 2-00 |
| ఆనాడు | నాటకం | కణ్వశ్రీ | 1-25 |
| బాలరాజు | ,, | శ్రీమాన్ తులసీ | 1-50 |
| వాపసిచ్చిన వరకట్నం (నాటిక) | | కొండేటి | 0-75 |
| అల్లుడుచూపిన ఆదర్శం | ,, | అనుకొల్లు | 0-75 |
| నిజంచెప్తే నమ్మరు | ,, | సీతంరాజు | 0-75 |
| కట్ జోకర్ | | కారెపు | 0-75 |
| చెదిరినకాపురం | ,, | కొడాలి | 0-75 |
| మళ్ళీ పెళ్ళి | ,, | కొడాలి | 0-75 |
| పరిశోధన | | [illegible] శెట్టి | 0-75 |

శ్రీ మురళీకృష్ణ [illegible] ర్సు

[illegible] సెల్లర్సు అండ్ [illegible]ర్సు

[illegible] :: ఏలూరు.

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
Acc. No.

# తన జీవిత రహదారిలో మన రచయిత

1920 పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురంలో జననం. వీరు స్వయం కృషితోనే సాధించిన రచనా సామగ్రితో హృదయాలను రసమయం చేసే విధానంలో రచనను సాగించారు. అనుకరణలూ, ఆధారాలూగాక వ్రాసినవన్నీ స్వకపోల కల్పితాలే అయ్యాయ్. తమ కాళ్ళమీద తాము నిలబడే రచయితల్లో ఒకరుగా వీరుకూడా నిలుస్తారు.

1940 నుంచి పాలకొల్లులో నివాసం. ఆదర్శ నాట్యమండలి అనే నాటక సంస్థను స్థాపించి పదేళ్లగా నాటక రచనలో నటనలో, మండలి నిర్వహణలో కృషి చేసి కృతకృత్యులయ్యారు.

1950 ఆంధ్ర నాటక కళా పరిషత్తులో వీరి పల్లెపడుచు నాటకం ఉత్తమ ప్రదర్శనా బహుమానాన్ని– ఆడది నాటిక ఉత్తమ రచనా బహూకృతినీ అందగలిగాయి. బాగా ప్రచారం పొంది వేలాది ప్రదర్శన లిచ్చిన వీరి నాటకాలు "పల్లె పడుచు", "అన్నా చెల్లెలు" "కులంలేని పిల్ల".

ఆనాటినుంచి మద్రాసు చిత్రసీమలో వుంటూ "సంతానం" "ఇలవేల్పు" "పరివర్తన" "పల్లెపడుచు" "అక్కా ఒకింటికోడలే" "ఆడపెత్తనం" "నిత్య కల్యాణం పచ్చతోరణం" "సిరి సంపదలు" "ఈడూ జోడూ" అనే చిత్రాలకు కథా మాటలు, "వదినగారి గాజులు" "రాజా పేద" మొదలగు చిత్రాలకి మాటలు రచించి, సుప్రసిద్ధ చలన చిత్ర రచయితగా కూడా ప్రఖ్యాతి గాంచారు.

వీరు రచించిన "దత్తత" "మమత" అనే నవలలు రెండూ నవలా సాహిత్యంలో ఒక ప్రత్యేకతను పొంది బహుళ పాఠక లోకాన్ని ఆకర్షించాయి

1960 లో రవుతూ పిక్చర్సు అనే చలన చిత్ర సంస్థను నెలకొల్పి "నిత్యకళ్యాణం పచ్చతోరణం" అనే చిత్రాన్ని నిర్మించారు, దర్శకత్వం కూడా నిర్వహించారు. ఆ చిత్రం ప్రముఖుల, పత్రికల, ఆంధ్ర మంత్రుల, ప్రేక్షక లోకం యొక్క ప్రశంసల నందుకొని ఉత్తమ చిత్రాన్ని తీసిన గౌరవం పొంది మంచి దర్శకుల జాబితాలోకూడా చేరారు.

మదరాసులో సౌత్ యిండియన్ ఫిలిం ఫాన్సువారు నిర్వహించిన చలన చిత్ర పోటీలలో 1960 తెలుగులో ఉత్తమ కథా చిత్ర రచయితలుగా నిర్ణయింపబడి యవార్డు పొందియున్నారు.

స్వయం శక్తిమీదనే ఆధారపడి సాధన ద్వారా, వ్యక్తిత్వంవల్ల జీవితాన్ని మెట్లుమెట్లుగా విభాగించుకొని, ఒక్కొక్క సోపానాన్ని పైకెక్కుతూ కళా విజయమే జీవితాదర్శంగా పయనిస్తున్న వీరి గమనం ఉజ్వలమై, మంగళప్రదమై, తెలుగు గడ్డలో వెలుగుదారిగా మనగలదని మేము ఆకాంక్షిస్తున్నాము.

ఇట్లు,
ప్రకాశకులు

138



ర చ యి త

శ్రీ పినిశెట్టి శ్రీరామమూర్తి

BCi

AOU A103B101 BC

"…ANJARAMLO PASKHULU''
PINISETTY

a S. M. K. S. Publication
Price : Rs. 2-25 nP.

# పినిశెట్టివారి రచనలు -

| నాటకాలు | సంవత్సరం |
|---|---|
| "పంజరంలో పక్షులు" | 1963 |
| పల్లెపడుచు | 1950 |
| అన్నా–చెల్లెలు | 1952 |
| కులంలేనిపిల్ల | 1948 |
| ఆత్మీయులు | 1956 |
| కన్నకొడుకు | 1945 |
| సుడిగాలి | 1942 |
| రెండూ రెండూ నాలుగు | 1960 |
| పతనజీవులు | 1947 |
| **నాటికలు** | |
| ఆడది | 1950 |
| రిక్షావాడు | 1950 |
| చలిజ్వరం | 1955 |
| **కథానికలు** | |
| సవతి తల్లి (సంపుటి) | 1946 |
| **నవలలు** | |
| దత్తత | 1952 |
| మమత | 1958 |
| **ప్రహసనాలు** | |
| కామయ్యగారి కార్యం (సంపుటి) | 1940 |

TITLE PRINTED AT SREE KRISHNA PRINTERS, ELURU.

మనసు ఫౌండేషన్ పుస్తకాల సంరక్షణపట్టిక

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | AOUA103B101 |
| పుస్తకం పేరు | పంజరంలో పక్షులు |
| తారీఖు | 31 December 2025 |
| ముందు అట్ట | YES |
| వెనుక అట్ట | YES |
| మొత్తం పేజీలు | 143 |
| పెద్ద సైజు పేజీలు | NO |
| ఖాళీ పేజీలు | Ci BCi |
| లేని పేజీలు | NO |
| తయారు చేసినది | Bhagravi |
| పేజీలు విడదీసినది | Ludhiya |
| స్కాన్ చేసినది | Nagesh [illegible] |
| పరీక్ష చేసినది | SARANYA |
| పేజీలు సరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| పరిస్థితి | good |